# దేవుని మార్గము

## మన ప్రయాణము

రచయిత

**బి. శ్రీను**

(సువార్త క్రైస్తవ సంఘం ఉప సభ్యుడు)

**వరంగల్ జిల్లా, తెలంగాణ.**

ప్రచురించిన వారు

**సువార్త క్రైస్తవ సంఘం**

(Regd.No. : 159/2015)

**అనంతపురము జిల్లా.**

త్రైత శకము-37    ప్రథమ ముద్రణ : సం॥ 2015

ప్రతులు : 1000    **వెల : 50 /-**

# సువార్త క్రైస్తవ సంఘం ప్రచురణలు

1. సువార్త బైబిలు.
2. దేవుని మార్గము–మన ప్రయాణము.
3. పాప క్షమాపణ ఎలా కలదు?

## గ్రంథములు లభించు చిరునామా

**బి. యోహాను**

సత్యనారాయణపురం కాలనీ,

చైతన్యపురి, హైదరాబాద్, తెలంగాణ – 500 060

Cell : 92982 01323, 90005 84063

**పి. తులసీరావు**

శ్రీరాంనగర్ కాలనీ,

ధర్మపురి రోడ్, విజయనగరం జిల్లా, ఆం.ప్ర – 535 002.

Cell : 94418 78096, 94943 30640

# మీరు క్రైస్తవులా?

# మనము క్రైస్తవులమా?

ఒక మనిషికి రాజు అని పేరు పెడితే వాడు రాజు అవుతాడా? కుండలు చేస్తాడు కాబట్టి కుమ్మరివాడు, మంగలిపని చేస్తాడు కాబట్టి మంగలివాడు అంతేకాని మంగలిపని రానివాడిని మంగలివాడు అనగలమా? ఒక వ్యక్తి డాక్టర్ చదువు పూర్తిచేసి పట్టాతీసుకున్న తర్వాత వాడిని డాక్టర్ అంటాము. అలాగే డాక్టర్ కొడుకు డాక్టర్ అవుతాడా? డాక్టర్ చదువుకున్నవాన్ని మాత్రమే డాక్టర్ అంటాము.

ఏసుక్రీస్తు సువార్తను ప్రకటించిన తరువాత ప్రపంచములోనే ఒక గొప్ప మార్పు జరిగింది. అనేకమందిలో దైవభీతి కలిగినది. అంతకుముందు ఉన్న అధర్మములను లేకుండాచేయుటకు తను సువార్తను తెలియపరచాడు. 'నా తండ్రిచిత్తానుసారము నడిచినవాడు మాత్రమే నాకు పాత్రుడు' అన్నాడు. సువార్తను పాటించి అనుసరించినవాడు మాత్రమే, క్రీస్తుదారిలో నడిచేవాడిని మాత్రమే క్రైస్తవుడు అనాలి. అంతేగాని త్రాగుబోతులు, తిరుగుబోతులు, వ్యభిచారులు, నరహంతకులు, అసమర్థులు, చర్చికివెళ్ళే ప్రతివాడిని క్రైస్తవుడు అనరాదు.

నేడు సమాజములో క్రైస్తవ మతమంటూ ప్రతివాడు, వాడితోపాటు వాడి సంతానం అందరూ క్రైస్తవులు అని చెప్పుకుంటూ సువార్తకు ఉన్న శక్తిని తప్పుత్రోవ పట్టిస్తున్నారు. ఒక్క భోదకుడు కూడా నేడు క్రీస్తు చెప్పిన, నియమాలు, నిబంధనలు, ఆజ్ఞలు తెలియని పరిస్థితులలో ఉన్నారు. "గ్రుడ్డివారై ఉండి గ్రుడ్డివారికి త్రోవచూపించగలరా!" అన్న క్రీస్తుమాట నెరవేరుతుంది.

సువార్త జ్ఞానము, దేవుని ఆజ్ఞప్రకారము జీవించుట నేటి సమాజములో చాలా కష్టము, అందుకు పరిశుద్ధాత్మ కృప పొందియుండాలి. ముందుగా భక్తిభావము కలిగి, తరువాత నీతిగా నడుచుకుంటూ, ఆ తరువాత బుద్ధిని వెలిగించు శక్తిపొంది, జ్ఞానమును సంపాదించినవాడు క్రీస్తు వారసుడు అవుతాడు. వాడే నిజమైన క్రైస్తవుడు.

నరకమునకు పోవు దారి విశాలము అనేకులు అందులో ప్రవేశించుదురు. మోక్షమునకు పోవుదారి సంకుచితమైఉన్నది దానిని కనుగొనువారు కొందరే. నేడు ఇరుకుదారిలో పోవువారు ఎందరు? అటువైపు దారి చూపించువారు ఎందరు? ఆ ఇరుకుదారిని కనుగొన్నవారు ఎంతమంది? కేవలము చర్చికిపోయే ప్రతివాడు క్రైస్తవుడు కాదు. క్రైస్తవులు, యూదులు మాత్రమే పరలోకమునకు వెళ్తారు అని మోసపుచ్చువారు ఎందరో కలరు. అబద్ధప్రవక్తల మాటలు నమ్మకండి.

దేవున్ని భక్తితో వేడుకుని సువార్త జ్ఞానము చదవండి, ఆయన అనుగ్రహం పొంది, క్రీస్తుదారిలో నడిచి క్రైస్తవుడిగా (విశ్వాసిగా) మారండి! మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి! దు:ఖం మిగిలిఉందా? భయం మిగిలి ఉందా? అవమానములు మిమ్మల్ని ఆవహిస్తున్నాయా? రోగాలు మిమ్మల్ని వదలము అంటున్నాయా? అహంకారము, అధికారము, బంధాలతో బంధింపబడియున్నారా? మనసును మీరు లొంగదీసుకోలేదా? అయితే మీరు క్రీస్తుదారిలో లేనట్టే! ఆ దారి ఇంకా కనుగొనలేదు అని అర్థము. నేటి నుంచి శ్రద్ధతో క్రీస్తును వేడుకోండి, ఆయనే దారి చూపించువాడు.

# దేవుని మార్గము - మన ప్రయాణము

యోహాను సువార్త ఎందుకు చదవాలి? బైబిల్‌లో అన్ని అధ్యాయములు ఉండగా ఈ ఒక్క సువార్తను ఎందుకు తెలుసుకోవాలి? అన్న ప్రశ్న ముందుగా మనము వేసుకుని చూద్దాం!

ఒక రాజు తన పరిపాలనా విధానమును, పద్ధతులను, నియమాలను తన సేవకులకు చెప్పి, ఈ విధానము ప్రకారము ప్రజలకు చెప్పి వారినుండి పన్నులు వసూలు చేయండి అని చెప్పాడనుకుందాం! అయితే కొందరు రాజు చెప్పిన విధానమును కాక, తమకు అనుకూలంగా ఆ పద్ధతులను మార్చుకొని వారిస్వార్థం కోసం చెప్పువారు కొందరుండగా, అలాగే చెప్పిన విధానమును పూర్తిగా పాటించనివారి కోసం వీరి ఇష్టానుసారంగా ఆ యొక్క భావం వచ్చు విధంగా కొందరు చెప్పగా, ఇంకా కొందరు పూర్తిగా అహంకారముతో వారికిష్టమొచ్చినట్లు ప్రజలకు చెప్పి వారిని భాదించు చుండగా, కొందరు మాత్రము స్వచ్ఛందంగా రాజు చెప్పినవి కూడా పాటించవచ్చును.



దేవుని మార్గము
మన ప్రయాణము

ఇందులో ఏవి మంచివో ఏవి చెడ్డవో విచారించే ఓపిక, తీరిక ప్రజలకు లేక వారు తప్పయినా లేదా ఒప్పయినా కూడా తలవంచక తప్పదు.

అయితే అదే రాజు స్వయంగా వచ్చి తన సేవకులతో తన రాజ్యంలో నియమ, నిబంధనలను ప్రజలకు చెప్పి, వీటిని మీరు పాటించండి, నేను నా పరివారం మీకు మేలు

చేయుదుము. ఒక వేళ నా సేవకులలో ఎవరైనా తప్పు చేసిన ఎడల మీరు స్వయంగా నాకు తెలుపవచ్చును. ఎల్లప్పుడు నేను మీకు అందుబాటులో ఉందును అని రాజు చెప్పాడనుకో అప్పుడు ప్రజలు తమ హృదయమందు ఏమాత్రము భయం లేకుండా రాజుయెడల శ్రద్ధకలిగి, భక్తికలిగి, ఎవరూ తప్పు చేయకయుందురు. ఎవరైన తప్పుగా తీర్పు తీర్చిన ఎడల రాజు ఈ విధంగా చెప్పలేదు కదా! అని ప్రశ్నించవచ్చును.

పాతనిబంధన గ్రంథంలో దేవుడు స్వయముగా చెప్పకపోయినా తన భక్తులు జ్ఞానసంబంధ అన్ని విషయములను చెప్పారనుకొందాము.

పాత నిబంధనలో 39 అధ్యాయములు ఉండగా అందులో అన్నీ దేవుని చేర్చు మార్గములే అయినప్పుడు మళ్ళీ దేవుడు స్వయంగా ఎందుకు రావాల్సిన అవసరం వచ్చింది? అంటే జ్ఞానం అందులో లేదు అనిచెప్పవచ్చు, అది చరిత్ర అయిఉండవచ్చును లేదా మంచిమాటలు కూడా అయి ఉండవచ్చును, మనిషిని క్రమపద్ధతిలో పెట్టు సిద్ధాంతములు, ఆచారములు కూడా అయిఉండవచ్చును.

వ్యభిచారం చేయకూడదని పాతనిబంధన గ్రంథం చెప్పితే, “మోహపు చూపుతో ఒక స్త్రీని చూచిన ఎడల వ్యభిచారం చేసినట్లే పాపం వస్తుంది” అని క్రొత్త నిబంధనలో ఏసు అన్నాడు. అయితే బాహ్యముగా కనిపించు దానిని వ్యభిచారము అని పాతనిబంధనలోని గురువులు వ్యభిచారము చేసిన వారిని శిక్షించెడివారు. ఇక్కడ యేసువారు అదే స్త్రీని క్షమించి ఉన్నాడు. ఈ ఒక్క వాక్యమును పరిశీలించిన రెండింటి వ్యత్యాసం తెలియగలదు. క్రొత్త నిబంధనలోని ఏసు జ్ఞానము ప్రకారము మనము క్రీస్తు వారము, క్రీస్తుశకం నుండి మన నడక మొదలైంది.

కనిపించే వేషధారణ ముఖ్యము కాదు, కనిపించని ఆత్మజ్ఞానం చెప్పుటకు దేవుడు వచ్చాడు. దేవుడే స్వయంగా వచ్చి చెప్పిన మాటలే నిజమైన జ్ఞానము, అవియే మన తండ్రిని చేరుమార్గము.

యేసుక్రీస్తువారు 12 మంది శిష్యులను ఎన్నుకుని వారిముందు ప్రజలకు జ్ఞానమును భోదించారు. ఆ విషయములన్నియూ ఆ శిష్యులలో మత్తయి, మార్కు, లూకా, యోహానులు దేవునితో కూడా ఉండి ప్రత్యక్ష సాక్షులుగా దేవుని వాక్యములు వ్రాసినారు. అందులో అందరు ఆయన ప్రయాణం గురించి వ్రాసినారు, కావున ఏ ఒక్కరు వ్రాసిన సువార్తనైనా చదువవచ్చును. పూర్తి దేవుని జ్ఞానం తెలియగలదు. అందులో ఒకరైన మత్తయి సువార్తలోగల జ్ఞానము చాలా వరకు రహస్యములతో కూడుకున్నదైన భాషలో ఉన్నది. యోహాను వ్రాసిన సువార్త వివరించి చెప్పుటకు అర్థం చేసుకొనుటకు వీలుగాఉంది.

నేను ఒక రోజు ట్రెయిన్‌లో వెళ్తుండగా ఒకరు యోహాను సువార్తను మాత్రము ప్రింట్ చేసిన పుస్తకమును పంచుతున్నారు. అయితే క్రైస్తవంలో ఉన్న దేవుడు తనకిష్టమొచ్చినవారిని, తనయందు శ్రద్ధయున్నవారికి మాత్రమే అందులో ఎక్కడ సత్యముందో గుర్తించేలా చేసి వారిని, వారిద్వారా మిగతావారిని తన రాజ్యమునకు అర్హులను చేసుకొనును అని గలదు. అదే విధముగా 'పాతతిత్తులలో క్రొత్తద్రాక్షరసమును పోయకుడి' అలాగే 'పాతగుడ్డకు ఎవడునూ కొత్తమాసిక వేయడు' అని చెప్పడమూ, 'నేనే మార్గము, సత్యము, జీవము అని నా ద్వారా తప్ప ఎవడును పరలోకము చేరడు' అన్న వాక్యములను గ్రహిస్తే బైబిల్ మొత్తం పరలోక మార్గము కాదు, యేసుక్రీస్తువారు చెప్పినదే నిజమైన మార్గము అని చాలా సులువుగా స్పష్టముగా తెలియగలదు.

ఈ గ్రంథమును వ్రాయుటకు నాకు అర్హత ఆ దేవుడే.

ముందుగా సువార్తలో "వార్త" అనగా ఒక విషయమును తెచ్చునది లేదా చెప్పునది అని అర్థము. 'సు' అనగా మంచి అని అర్థము సువార్త అనగా మంచివాక్యము లేదా స్వచ్ఛమైన జ్ఞానము అని తెలియవలెను.

## యోహాను సువార్త

**(యోహాను, 1-1,2,3) ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.**

**వివరము :** ముందుగా మనకు కనిపించు ఒక ఉదాహరణ చూద్దాము. ఇల్లు కట్టడానికి మనము ఏమి చేస్తాము, ముందుగా ఒక స్థలమును ఎన్నుకుని ఆ స్థలంలో ముగ్గువేసి (డ్రాయింగ్) హాలు, వంటగది, పడకగది అదే విధంగా ద్వారములు, వచ్చుటకు, వెళ్ళుటకు దారి, ఇల్లు నిర్మాణం అయిన తరువాత ఇంటిలోని వసతులు ఈ విధంగా మనము ఇంటినిర్మాణం గురించి చెప్పుకోవచ్చు. వీటికన్నా ముందుగా ఇల్లు కట్టాలన్న ఆలోచన రావాలి, ఆ యొక్క ఆలోచనకు తగిన జ్ఞానం కావాలి, ఇంటినిర్మాణానికి కావలసిన పనిముట్లు కావాలి, ధనం కావాలి, పనివారు కావాలి, కొంత సమయం కావాలి. ఎవడైనా ఒకడు నిర్మించిన దానిని చూసి మనము ఇల్లు కడుతున్నాము. మనకు సొంత జ్ఞానము లేదు. సొంత ఆలోచన లేదు. ఇక దేవుని విషయమునకు వద్దాము.

'ఆది' అనగా మొదట అని అర్థము, మొదట అంటే భూమి లేదు, సూర్యుడు లేదు, ఇంకా మనము చెప్పుకునే గ్రహాలు ఏమియూ లేవు, అంతా కూడా చీకటి కూడినదై నిరాకారముగా ఉండెను అని అర్థము.

**"ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను."**

కొంత తికమకగా ఉన్న ఈ వాక్యము దేవుని గూరించి పరిచయం అనగా మన సృష్ఠికర్త మనలను సృష్ఠింపకముందు ఆయన దగ్గర ఉన్న ఆస్తి 'వాక్యము'. ఇక్కడ వాక్యము అనగా జ్ఞానము (తెలివి) అని అర్థము. మనము సాధారణంగా వాక్యము అనగా ఒక విషయమును చెప్పుట, లేదా వ్రాయుట అని అనుకుంటాము, ఒకడు మనిషిగా పుట్టి, వాడు నోటితోనో, చేతితోనో ఒక క్రియను ఇంకొకరికి చెప్పు పద్ధతి అని చెప్పవచ్చును. మనకు ఈ వాక్యము సృష్ఠికి పూర్వం గురించి చెప్పుచున్నది కావున దీనిని జ్ఞానం అని నిర్థారించుకున్నాము.

ఒక ఉదాహరణ చూద్దాం. నా దగ్గర పెన్నుఉన్నది. ఆ పెన్ను నాదిగ ఉన్నది. పెన్ను దగ్గర నేను ఉన్నాను. పెన్ను నాతో కూడా ఉంది. పదాలను పరిశీలించిన కొంత తికమకగా ఉంది కానీ ఏమి తెలుస్తుంది? పెన్ను అన్న విషయం తప్ప ఇంకేమీ లేదు. ఇంకా కొంచెం లోతుగా వెళితే నాతో, నా దగ్గర, నాది అని అన్నాము కాని అది ఎవరు? చెప్పునది ఎవరు ఎవరికి చెప్పుచున్నారు? ఎవరు వినుచున్నారు? ఈ యొక్క వివరము ఏమియు లేదు. కాబట్టి పైన తెలిపిన వాక్యములో కూడా ఒక్క విషయమును గూర్చి చెప్పుచున్నట్లు అర్థమవుతుంది.

ఆదియందు జ్ఞానము మాత్రము ఉన్నది. (రూపంలేదు, రంగులేదు, ఆకారంలేదు, ఏవిధంగా చెప్పుటకు వీలులేని విషయం) ఇప్పుడు మనలను సృష్ఠించిన వాడు 'జ్ఞాని'. ఎలా ఉంటాడో తెలియదు. ఆయన్నే దేవుడు అని అంటున్నాము. దేవుడు అనగా 'దేవులాడబడేవాడు' అని అర్థము. పరమాత్మ అనగా పరము అంటే వేరుగా, ఆత్మకు వేరుగ ఉన్నవాడు అని అర్థము. కావున పరమాత్మ (పరిశుద్ధాత్మ) అన్నాడు.

ఈ యొక్క సువార్తలో మొదటి వాక్యమును అర్థము చేసుకున్న, మన సృష్ఠికర్త జ్ఞానియై మాత్రము ఉన్నాడు అని చెప్తున్నాడు. అందుకు యేసువారు 'నా తండ్రిని ఎవరూ ఎరుగరు' అని చెప్పిన మాటకు అర్థము కూడా ఇదియే.

పరమాత్మను ఎవరూ చూడలేరు. చూడరు. కనబడడు. ఇది దేవుని నియమము. కాని ఆత్మదర్శనము గూర్చి వివరించాడు. ప్రతి వ్యక్తి ఆత్మను గురించి అధ్యయనం చేయడం, దాని గురించిన జ్ఞానం తెలుసుకోవడం ముఖ్యం. అందుకు మనకు మూడు పవిత్ర గ్రంథాలలో ఈ విషయం గూర్చి ఎక్కువగా చెప్పడం జరిగింది.

ఇకపోతే దేవుళ్ళు, దయ్యాలు, భూతాలు, పిశాచాలు, మంత్రాలు, గ్రహాలు, రోగాలు, అదే విధంగా పుట్టుక, చావు, సుఖాలు, భోగాలు, గుడి, ధనం, కీర్తి, బాధలు, శ్రమ, మొదలగునవి. ఇవన్నీ కూడా ఉన్నాయి అన్నది సత్యము. ఇవన్నీ మన జీవన పోరాటంలో శత్రువులు, మిత్రులు కావచ్చు. అయినా తప్పకుండా వీటితో పోరాడవలసిందే. దీనికి ఎవరు కూడా అతీతులు కారు. వీటిని ఎదిరించేందుకు శక్తి చాలక కొందరు వీటికి బలి అవుతూ ఉంటారు. కొందరు మాత్రము జీవితం యొక్క అంతిమ లక్ష్యం

గురించి తెలుసుకొని దానిని సాధిస్తారు. అది ఆత్మను గురించిన అధ్యయనం కావున మనము ఆధ్యాత్మికము అంటున్నాము.

**(యోహాను, 1-2) సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.**

మన సృష్టి ఎలా జరిగింది? అని తెలుసుకోవాలని ప్రతి ఒక్కరికీ కోరిక ఉంటుంది. కానీ సృష్టించినవాడు తెలియదు, ఆయన జ్ఞాని అంతే. కానీ మనకు కనిపించు ప్రపంచమును చూసుకొని కనిపించని వ్యక్తి చేసిన ఈ ప్రపంచమును తెలుసుకోవచ్చును. దేవుడే చెప్పని విషయం మనమెలా తెలుసుకోగలము? ఈ ప్రశ్నకు జవాబుమనము తెలుసుకోలేము ఆయన తెలియజేస్తే తప్ప!

ఇక్కడ కొంచెము బుద్ధిని ఉపయోగించి ఆత్మద్వారా యోచించి చూద్దాం!

ఇంట్లో కరెంట్ లేదు అనుకుందాము ఏదీ కనిపించదు, అప్పుడు మొదట మనము చేయుపని ఏమిటి? దీపం వెలిగిస్తాము. ఆ తరువాత వెలుగుతో మిగతా మన అవసరములను చూచుకొంటాము. మొదట



నిరాకారముగా ఉన్న విశ్వం.



దేవుడు వెలుగును సృష్ఠించాడు. అనగా సూర్యుడు అని చెప్పవచ్చును. దాని నిర్మాణానికి మూలం కేవలం దేవుడి జ్ఞానము మాత్రమే.

ఆ తరువాత దానినుండి కొంత భాగం తీసుకుని భూమిని దానినుండి కొంతభాగం తీసుకుని చంద్రుడుని సృష్ఠించాడు. ఈ మూడు మనకు కనిపించు గ్రహములు అయినా మొత్తం మన గ్రహాల సంఖ్య 12. సూర్యుడు కేంద్రముగా ఉండి మిగతా 11 గ్రహాలు దానిచుట్టూ పద్ధతిగా తగు సమయంలో తిరుగుచున్నవి.

నక్షత్రములు సృష్ఠికి పూర్వమే ఉండవచ్చును. నక్షత్రము అనగా నాశనము లేనిదని అర్ధము. వాటి గురించిన వివరణ ఏ గ్రంథములోనూ వివరించలేదు. అయిన ఏసుక్రీస్తు జన్మించిన తరువాత 'తోకచుక్క ఒకటి పుట్టెను' అని వ్రాయబడినది. తోకచుక్క పుట్టును అంటే చావుపుట్టుకలు ఉన్నట్లు కావున 'తోకచుక్క కనబడెను' అనిన అర్ధము సరిపోవును. అవి కూడా దేవుని ఆధీనంలోనే ఉన్నాయి అని అర్ధమవుతుంది.

ఇక్కడ ఒక అనుమానం మనకు కలుగవచ్చు. సూర్యుని చుట్టూ ఎందుకు తిరగాలి? మొదట సూర్యున్నే సృష్ఠించాడని ఎలా చెప్పవచ్చు? దీనికి ఒక ఉదాహరణ చూద్దాం! ఇనుమును ఆయస్కాంతము ఆకర్షించి



పట్టుకుంటుంది. ఈ రెండింటికి అవినాభావ సంబంధం ఉంది. అయితే అయస్కాంతమును రెండు ముక్కలు చేసి అతికించిన అవి ఆకర్షించ బడతాయి, అదే అయస్కాంతము వ్యతిరేఖదిశలో పెడితో అతుక్కోవు సరికదా కొంత శక్తినుపయోగించి దూరం అవుతుంటాయి. ఇనుమునుండి రెండు భాగాలు చేసిన అవి తిరిగి అతకవు, అవి అతకాలంటే మరియొక సిద్ధాంతమును ఉపయోగించాలి. వేడిచేసి కరిగించి ఒకటిగా చేయాలి. చాలా శ్రమతో కూడినది. ఇలా చూసుకుంటే ప్రకృతిలో కనిపించు విధంగా దేవుడు ఒక సూత్రబద్దంగా ప్రతీదీ ఏర్పాటు చేశాడు. దేనినుండి వేరు చేసినది దానిచుట్టూ తిరుగుతుంది. ఆ యొక్క ప్రకారము సూర్యుడిగా చేసి దాని నుండి ఎన్నో కోట్లపదార్థములను సృష్ఠించి వేరుచేసి వాటిని సూత్రాను సారంగా తన ఆధీనంలో ప్రతీదీ ఉండు విధముగా ఏర్పాటు చేసుకున్నాడు. వాటిని నియమించిన లైన్స్ (భ్రమించు పద్ధతి) ప్రకారం తప్ప అవి సొంత నిర్ణయం తీసుకోలేవు. ఒక విధంగా రైలు పట్టాలమీదనే ప్రయాణిస్తుంది, ఇది శాసనం ఎలాగో గ్రహాల పరిస్థితి అలాగే .

ఇక్కడ ఒక చీపురు తీసుకుని చూద్దాం కొన్ని వందల పుల్లలతో చేసిన చీపురు అవి వేరుగా ఉంటూ అనేక శాఖలుగా విస్తారం చెంది శుభ్రం చేయుచున్నది. అలా ప్రతి పుల్ల దాని పనిని సక్రమంగా చేస్తుంది. అన్ని పుల్లలను మనిషి చేతిలో కట్టగా కట్టి దానిని ఉపయోగిస్తున్నాడు. కాబట్టి సమస్తమును ఆయన మూలముగ కలిగియున్నది.

యోహానుగారు ఈ వాక్యము చెప్పుట ముఖ్య ఉద్దేశ్యము ఏమనగా సృష్ఠికర్త ఒక్కడే, అతడు జ్ఞానము కలిగినవాడు, రూపం లేని వాడు, సర్వాధికారి, దేవుడు అని చెప్పుచున్నారు.

కాని కొందరు సాతాను, దేవుడు గొడవపడి సాతాను భూమిమీదకు వచ్చింది. మళ్ళీ దేవుని రాజ్యం ఆక్రమించనుంది ఇలాంటి పిట్టకథలు సృష్టించారు. అవి ఎంతమాత్రం నిజంకాదు.

**(యోహాను, 1-4,5) ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించు చున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను.**

ప్రతి వాక్యము కొంత తికమక పెడుతున్నా, శ్రద్ధఉన్నవారికి ఇంకా శ్రద్ధను కలుగజేయు వాక్యములను యోహానుగారు వివరించారు. (ఇక్కడ యోహాను చెప్పునది దేవుని జ్ఞానము. దేవుని జ్ఞానము దేవునికి తప్ప మరెవరికీ తెలియదు కాబట్టి యోహాను అను వ్యక్తి శరీరముతో దేవుడు పలికించు మాటగా మనము అర్థము చేసుకోవాలి.)

ఇప్పుడు భూమి మీద జీవరాశుల గురించి చెప్పుచున్నాడు. అందులో ముఖ్యుడు మనిషి. బైబిల్ వచ్చి మనకు 2000 సం॥లు గడిచిపోయినది. కానీ అన్ని రహస్యములు మనిషికి తెలియలేదు. మనిషి తను ఎలాఉన్నాడో ఎలా జీవిస్తున్నాడో కూడా తెలియని అగమ్యగోచరముగా జీవనం సాగిస్తున్నాడు. అసలు ప్రాణం ఎలావస్తుంది? దాని రూపించినవాడు ఎవడు? ఎందుకు మళ్ళీ మనలను వదలివెళ్తుంది? కొంచెం కూడా ఆలోచించే తీరికలేదు. మనిషి తాను ఎవరో తనకు తెలియదు కాని దేవుడు తెలుసు అంటున్నాడు. ఇంకా కొందరు నేను చూచాను అని అంటున్నారు. ఇంకొందరు ఏకంగా నేనే దేవున్ని అని చెప్పుకోవడం జరుగుచున్నది. ఒకడు నేనే స్వయంగా బ్రతుకుతున్నాను. ఇంకా చాలామందిని బ్రతికిస్తున్నాను.

నేను గొప్పవాడిని, తెలివైనవాడిని అనుకుంటూ, అజ్ఞానంతో కూడిన జీవితం గడుపుతూ ఉన్నారు.

పై వాక్యమును పరిశీలించుదాము. ఆయనలో జీవముండెను. ఆయన అనగా దేవుడు. ఇక్కడ జీవము అనగా తెలియదు కానీ మనబుద్ధి ప్రకారం యోచించిన కదిలే యంత్రమును నడుపు ఇంధనం అని అర్ధమవుతుంది. యంత్రమును తయారుచేయుటకు జ్ఞానమును ఉపయోగించిన దేవుడు ఆ యంత్రమును నడుపుటకు తనను ఇంధనముగా (ఫ్యూయల్) వాడుచున్నాడు. దాని ఆకారంగానీ, రంగుగానీ, రుచిగానీ చెప్పలేదు, ఎవరికీ తెలియబడదు. మనకు అర్ధమవుటకు ఆ జీవమును పరిశుద్ధాత్మ అని పేరు పెట్టుకున్నాము.

**ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను.**

వెలుగుతున్న దీపం ఎలా అయితే కొన్ని కోట్ల దీపాలను వెలిగించునో, ఆయనలో ఉన్న వెలుగు (ఇక్కడ జీవం అనగా వెలుగు అని సంబోధించారు) మనందరినీ జీవించేలా చేస్తుంది. కాబట్టి మనలో దేవుని ఆత్మ (దీపం) ఉన్నది. మనలో ఉండే ఆత్మయే దేవునిలో కూడా ఉన్నట్టు అర్ధమవుతుంది. మరి ఆత్మను ఎవరైనా చూచారా? అంటే అది మనకు తెలియదు ఆ విషయం కూడా దేవుడు చెప్పాల్సిందే.

**ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని**
**చీకటి దాని గ్రహింపకుండెను.**

ఇక్కడ ఆత్మను గూర్చి, శరీరమును గూర్చి చెప్పుచున్నాడు.

వెలుగు మనలో ఉండి, మనలను జీవింపచేయుచున్నది. కాబట్టి మనశరీరంలో ఉన్నందున అది మనకు తెలియదు కాబట్టి శరీరమును

చీకటిగా పోల్చి, ఆ చీకటి అంటే మనము దానిని గ్రహించకున్నాము. మనలోనున్న వెలుగుకు ఆత్మ అని పేరు పెట్టాము కదా! ఆత్మ ఎలాఉందో తెలియదు కానీ ఆత్మ మనలను జీవింపచేయుచున్నది. మనము కేవలము నిర్జీవమైన యంత్రము అని అర్థమవుతుంది. ఎన్నో రకాల విడిభాగాలతో తయారు అయిన యంత్రము మనిషిచేత నడుపబడుచున్నట్లు, ఎన్నో అవయవాల నిర్మాణమైన మన శరీరము ఆత్మ ద్వారా నడుపబడుచున్నది.

మరింత అర్థమవుటకు కొంత వివరంగా చెప్పుకుందాం! ఈ వివరణ అర్థమైన, దేవుని జ్ఞానము సగం తెలిసినట్టే! అదేవిధంగా బైబిల్ అర్థము చేసుకొనుటకు ఈ విధానం ముందుగా తెలిసియుండాలి.

దేవున్ని పరిశుద్ధాత్మ అన్నాము, మనలో నివసించునది ఆత్మ అన్నాము. మరి మనకు ఒక పేరుపెట్టుకుందాము జీవుడు అని.

| | |
|---|---|
| జీవుడు + ఆత్మ = పరిశుద్ధాత్మ | మూడు భాగాలు |
| నిర్జీవము + జీవము = జీవనము | |
| పనిలేదు + పనిచేయించువాడు = అధికారి | |
| మనిషి + ఆత్మ = పవిత్రాత్మ | |

యేసుక్రీస్తు వారు ముప్ఫై సంవత్సరములు జీవనము చేశారు అనగా మనిషి + ఆత్మగా ఉన్నారు. మూడు సంవత్సరములు పవిత్రాత్మగా ఉండి జ్ఞానం బోధించాడు. అదే విధంగా చనిపోయి మూడవ నాడు తిరిగి లేచాడు. గంటలలో చూసుకున్న సాయంత్రం చనిపోయాడు కావున 6.00 గంιιల నుండి 6.00 గంιιల వరకు 24 గంιιలు ఒకరోజు. మళ్ళీ సాయంత్రం 6.00 గంιιల నుండి ఉదయం 7.00 గంιιల వరకు 9 గంιιలు. మొత్తము 24+9= 33 గంιιలు. ఈ మూడు సంఖ్య రహస్యమును వదిలి వెళ్ళాడు.

దీనిని ఈ విధంగా ఆలోచన చేస్తే మూడు భాగాలు కన్పిస్తుంది. గంటలు+ రోజులు =నెలలు ఇక్కడ సంవత్సరములు తీసుకోవడం లేదు. బుద్ధిని ఉపయోగించి ఆత్మ చెప్పునది ఏమనగా! 30 సంవత్సరములు వ్యర్థముగా బ్రతికినా 3 సంవత్సములు జ్ఞానిగా ఉంటే 33 గంటలలో పరమాత్మలో చేరుకుంటారు అని  దేవుని యొక్క ఉద్దేశ్యము అర్థమవుతుంది.

ఎన్ని సంవత్సరములు వ్యర్థముగా జీవించినా, దేవునిజ్ఞానం తెలుసుకున్న కొద్దిరోజులకే మనిషి మోక్షం పొందుతాడు. అప్పటివరకు ఈ జీవనం సాగించవలసినదే.  ఈ పాపపుణ్యముల భారం మోయక తప్పదు. అవమానములు, బాధలు, రోగములు, ఏడ్పులు, చికాకులు, అదేవిధంగా వ్యతిరేఖ జీవనం కూడా తప్పదు. ఇప్పుడు స్పష్టంగా 'మనము మూడు భాగాలుగా ఉన్నాము' అని అర్థము చేసుకున్నాము.

ఒక ఉదాహరణ, మనకు ఒక సైకిల్ ఉంది అనుకుందాము. దానితో ఎవరైనా మాట్లాడితే మనము వారిని పిచ్చివాళ్ళలాగా చూస్తాము. కాబట్టి ఏదైన చెప్పాలి అన్నప్పుడు సైకిల్ నడుపువానికి చెప్తాము. సైకిల్ జాగ్రత్తగా నడుపు, జాగ్రత్తగా ఉండు అని.  అదేవిధంగా జీవములేని శరీరమునకు ఈ యొక్క సువార్త వాక్యముల చెప్పుట పిచ్చితనమే అగును, కావున యోహాను ప్రతి వాక్యము కూడా ఆత్మకు చెప్పుచున్నాడు. నిర్జీవములాంటి అజ్ఞానికి ఈ పవిత్ర జ్ఞానము అర్థము కాదు.

ఎన్ని సంవత్సరములైనా మనిషిని మనిషిగా పోల్చుకుని చూస్తే ఈ జ్ఞానం కేవలము వారికి నిష్ప్రయోజనం. ఆత్మను కేంద్రముగా చేసుకుని సూర్యుని చుట్టూ అన్ని గ్రహాలు భ్రమిస్తున్నట్లు ఆత్మచుట్టూ మనము అన్ని వాక్యములను అన్వయించుకొని అర్థం చేసుకోవలయును. ఇది సూత్రముగా గుర్తుంచుకోవాల్సిన  విషయం.

**(యోహాను, 1-6,7) దేవునియొద్దనుండి పంపబడిన యొక మనుష్యుడు ఉండెను. అతని పేరు యోహాను. అతని మూలముగా అందరు విశ్వసించునట్లు అతడు వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు సాక్షిగా వచ్చెను.**

మొదట దేవుని గూర్చి చెప్పుచూ ఆయనను ఘనపరచి తరువాత యోహాను తనను గూర్చి పరిచయం చేసుకుంటున్నాడు. అది కూడా నేను బోధకుడిని, గురువుని, దేవదూతను లేదా గొప్పవాడిని అని కాకుండా కేవలం దేవుని జ్ఞానమును మన తండ్రియైన యేసు ద్వారా తెలియబడిన దానిని గూర్చి సాక్షమిచ్చుటకు వచ్చిన సాక్షిని మాత్రమే అని తన్ను తాను తగ్గించుకుని లోకమునకు పరిచయం చేసుకుంటున్నాడు. దేవున్ని చూసిన దేవునితో కలసి నడిచిన యోహానుగారే నేను కేవలం సాక్షిని అని చెప్పుకుంటున్నాడు. (కోర్టులలో చూస్తుంటాము సాక్షి అనగా చూసినదానిని చెప్పువాడు. అలాగే మనము దేవుని జ్ఞానమునకు సాక్షులము, దేవుడు చెప్పినదానిని సాక్షిగా ఒకరు చెప్పగా లేదా వ్రాయగా దానిని చదివి మనము చెప్పుచున్నాము, మనము కూడా సాక్షులము.)

ఈ రోజులలో కొందరు జ్ఞానము తెలిసిన వారిలాగా నేనుగొప్ప ప్రవక్తను, ప్రసంగీకుడను, బోధకుడను, జయశాలిని, నేనే తండ్రిని, గురువుని అని చెప్పుకుంటు గర్వంగా జీవిస్తున్నారు. కాబట్టి అబద్ద ప్రవక్తలగూర్చి జాగ్రత్తగా ఉండండి.

**(యోహాను, 1-18) ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు. తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను.**

ఈ వాక్యము మనకు జాగ్రత్త అని చెప్పునదిగా అర్థమవుతుంది. పరమాత్మను ఎవరూ చూడలేదు అని ఖచ్చితంగా చెప్పుచున్నాడు అనగా

దేవుడు తెలియబడడు. ఇది నియమము. తండ్రిరొమ్మునున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను. ఈ వాక్యములో అద్వితీయుడు అనగా రెండు కానివాడు ఒక్కడే అని అర్థము. ఆ ఒక్కడు దేవుని సారమైన "యేసే" అని తెలియవలెను.

ఇక్కడ నేనే దేవున్నీ అని చెప్పకుండా, తండ్రిరొమ్మునున్న దేవుని కుమారున్ని అని చెప్పాడు. మనిషి శరీరంలో రొమ్ము భాగంలో ఉండేది హృదయము, హృదయములో ఉండునది ఆత్మ, అయితే అది మన తండ్రివలన మనకు వచ్చినది. మరి ఆ తండ్రిరొమ్ములో ఉన్న ఆత్మ ఎవరిది, ఆయనదే అని అర్థమవుతుంది. ముందుచెప్పిన వాక్యములో దేవున్ని ఎవరూ చూడలేదు అంటూనే ఆయన బయలు పరచెను. దేవుడు కొంత అయోమయంగా పదాలనుపయోగించి 'నేనే దేవుడను' అని పరోక్షంగా ఆయనను పరిచయం చేసుకున్నాడు.

ఒక ఉదాహరణ చూద్దాం! ఒక రాజు మారువేషంలో తన రాజ్యమును పరీక్షించుటకు ఒక ఊరిలోనికి వెళ్ళి అక్కడ బాల్యవివాహాలు జరుగుతుండగా ఒక సామాన్యుడిలాగా ఇది చేయడం తప్పు, ఇకనుండి ఈ గ్రామంలో ఇలాంటిది జరిగితే ఈ రాజ్యభటుల చేత మీరు శిక్షకు గురికాక తప్పదు అని చెప్పి వెళ్ళాడు.

అప్పుడు ఆ ఊరి జనం ఎవడో చెప్పిన మాట ఎందుకు వినాలి? వీడు ఏమైన జ్యోతిష్యుడా? లేదా ఈ ఊరికి రాజా? అని హేళనగా మాట్లాడారు.

ఆయన చెప్పినమాట వినక అలాగే వ్యతిరేఖంగా ప్రవర్తించి ఉంటే ఖచ్చితంగా రాజభటులు వారిని శిక్షిస్తారు. ఇలా ఎవరో ఒకరు

శిక్షను అనుభవించిన తరువాతగానీ ఆ రోజు రాజు చెప్పిన మాటలు నిజమని నమ్మరు. ఇక్కడ శిక్షలు అమలు జరుగునప్పుడు రాజు కనిపించడు. రాజు సైనికులకు ఆజ్ఞ ఇవ్వటంవలన ఎవరైనా తప్పుచేస్తే రాజభటులు వారిని శిక్షించుతారు. కాబట్టి రాజును నిందించి ప్రయోజనం లేదు. భటులను నిందించి ప్రయోజనం లేదు. మనతప్పుకు మనము శిక్షను అనుభవిస్తున్నాము అని నమ్మక తప్పదు, ఇదే సత్యము.

భగవంతుడు కూడా దొంగరీతిన ఎవరికీ తెలియకుండా వచ్చి జ్ఞానము చెప్పి వెళ్తాడు.

అందుకే పూర్తి విశ్వాసము కల్గి దేవుడు చెప్పిన నియమాలను, జ్ఞానమును శ్రద్ధతోవిని, బుద్ధితో ఆలోచనచేసి ఆయనయెడల భక్తి కలిగి యుండాలి.

ఈ వాక్యము అర్థము చేసుకున్న తరువాత సాతానులేడు, సైతాను లేదు. ఆయనకు పోటీ ఎవరూ లేరు అంతా ఆయన ఆధీనంలో నడుస్తున్న రాజ్యం. ఇక పరిపాలనలో ఇంతకుముందు చెప్పుకున్న దెయ్యాలు, భూతాలు, ఇంకా అన్ని కష్టసుఖాలు అలాగే గాలి, నీరు, ఆకాశం, నిప్పు, భూమి ఇవన్నీ పరిపాలనలోని భాగాలు మాత్రమే వారివారి ఆదేశానుసారం అవి పనిచేస్తుంటాయి.

**ఉదాహరణ :** ఒకడు చేసుకున్న పాపం ప్రకారం వాడు చనిపోవు సమయం వచ్చినప్పుడు వాటిని అమలు చేయడానికి దేవుని సైనికులు పనిచేస్తారు. అది యాక్సిడెంటా? హత్యచేతనా? గుండెజబ్బుతోనా? రోగములతోనా? నీటితోనా? ఇలా వాడు పొందిన పాపఅర్హతనుబట్టి వాడికి శిక్షను అమలు చేయువారు దేవుని సైనికులు. వారే గ్రహాలు, భూతములు.

**(యోహాను, 1-23) ప్రభువు త్రోవ సరాళము చేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము నేను అని యేసు చెప్పెను**

ప్రభువు అనగా దేవుడు. ఆయన త్రోవ అనగా ఆయనను చేరు మార్గము. సరళము అనగా శుభ్రము లేదా విశాలము. అరణ్యములో ఎలుగెత్తి చెప్పుట అనగా? అరణ్యం అనగా మనుషులులేని ప్రదేశము లేదా నిర్మానుష స్థలము అని అర్ధము. నిర్మానుష ప్రదేశంలో మనము గట్టిగా మాట్లాడినా వినేవాడు ఉండడు కాని ఒక స్వరము ఉంది అని ఆ ప్రదేశమునకు తెలియజేయడమగును. ఇక్కడ యేసువారు జనారణ్యంలో ఉండి ఈ వాక్యము చెప్పుట వలన జనులున్నారు కానీ దేవుడున్నాడు అని తెలియదు. కాబట్టి ఆజ్ఞానారణ్యము అని అర్ధము చేసుకుని ఎలుగెత్తి చెప్పు ఒక శబ్దము నేను అన్నాడు. శబ్దము అనినా ఇక్కడ జ్ఞానము అని అర్థము చేసుకోవాలి. దేవుడు కన్పించడు అది నియమము, ఆ నియమమును దేవుడు కూడా అతిక్రమించకుండా శబ్దరూపంలో జనులకు తెలియజేస్తారు.

జ్ఞానము అనగా నేమి? ఎందుకు ఇన్నిసార్లు జ్ఞానం అంటున్నాము? ఎందుకు దేవుడు జ్ఞానము తెలుసుకోండి అంటున్నాడు? బంగారమును అమ్మి జ్ఞానం సంపాదించుకోండి? వెండిని అమ్మి జ్ఞానము సంపాదించండి అన్నాడు అసలు జ్ఞానము అంటే ఏది? ఇక్కడ అన్నింటికీ సమాధానం ఒక్కటే 'దేవుని చేరుటకు ఏర్పరచబడినదానిని జ్ఞానము' అంటున్నాము.

మనిషి జీవించుటకు ఏర్పరచుకొనిన దానిని అవసరం అంటాము అది జ్ఞానం కాదు కేవలం వస్తువులనుపయోగించు పద్ధతి మాత్రమే. ఒకడు ఒక వస్తువును ఉదాహరణకు కారు తీసుకుందాం, ఇది నేను కనుగొన్నాను అంటాడు అంతేకానీ సృష్టించాను అనకూడదు. ఎందుకంటే ఇనుము

భూమిలో ఉంటే దానిని గుర్తించి దానితో కారు తయారు చేశాడు. అది నడుపుటకు భూమిలో పెట్రోలు ఉంటే దానిని గుర్తించి కారునడుపు చున్నాడు. ముందుగా ఉంచబడిన దానినుండి వస్తువులుగా తయారు చేస్తున్నా అది స్వంత జ్ఞానం కాదు. ఇది కూడా దేవునిచేత ఏర్పాటు చేయబడిన జ్ఞానమేగానీ, ఎవడూ తనకుతానుగా ఏదియూ చేయలేడు. ఇంకొంచెం వివరించి చూచుకొనిన, భూమిమీద ఏది చేసినా బ్రతకడం కోసమే కాని చావును జయించలేము. అలాగే పుట్టుకను ఆపలేము. ప్రకృతి వైపరీత్యాలకు మనిషి తలవంచక తప్పదు. రోగాలకు బలి అవ్వక తప్పదు. శరీరం కృషించకమానదు. దు:ఖమనుభవించక ఉండము. ఇలా తలవంచుకుని బ్రతకడం తప్ప మనచేతిలో ఏదియూ లేదు.

మనము ఎలా ఉన్నామో తెలుసుకుని, ఆ తరువాత దేవుని గూర్చి తెలుసుకుంటూ ఈ జీవితం ఆయనకు అంకితంచేసి, మనము స్వతంత్రులుగా జీవించుటకు దేవుడు ఏర్పాటు చేసినదే జ్ఞానము. అందరికి ఇలా యోచించే జ్ఞానముంటుందా? అని ప్రశ్నవేసుకుంటే అందరు ఆయనవలన జీవిస్తున్నారు కాబట్టి ఒకరికి సాధ్యం ఇంకొకరికి అసాధ్యం అను మాట ఉండదు. ఆయనకు అందరూ సమానులే. అంతా మనమీదనే ఆధారపడి ఉంటుంది మన శ్రద్ధనుబట్టి మనకు జ్ఞానము లభిస్తుంది.

## బాప్తిస్మము / జ్ఞాన స్నానము

బైబిల్‌లోను తెలుగుపదాలలోను బాప్తిస్మము కొత్తపదము. దీనిని సృష్టించి వ్రాసినారు. దీని ఉద్దేశ్యము మనము తెలుసుకొను అవసరమున్నది. యేసువారికి యోహాను బాప్తిస్మము ఇచ్చాడు. అక్కడ జరిగిన సంఘటన

చూద్దాం! యేసుక్రీస్తు 30సంవత్సరముల తరువాత మొదటగా జనములోనికి వచ్చి బాప్తిస్మము తీసుకున్నాడు. ఇక్కడ ఒకటి అర్థమవుతుంది దేవుని జ్ఞానం తెలుసుకోవటానికి మొదలుపెట్టిన మొట్టమొదటి అడుగుకు గుర్తుగా బాప్తిస్మము అని పేరుపెట్టారు. ఇది మనుష్యులకు కన్పించునది. ఏసుక్రీస్తు తలను యోహాను పూర్తిగా పట్టుకుని నీళ్ళలో ముంచాడు. దానిని మొదటి సారి జ్ఞానముచేత పూర్తిగా తడుపబడుతున్నాము అని అర్థము. నీళ్లు జ్ఞానమునకు గుర్తు. మురికిని నీళ్ళతో శుభ్రం చేసినట్లుగా, ఏ కొంచెం మిగిలియున్నా, మురికి మొత్తము పోదు కావున పూర్తిగా మునగడం పూర్తి శుభ్రతకు సూచిక. అలాగే అజ్ఞానం కలిగిన వ్యక్తి దేవుని జ్ఞానం పూర్తిగా తెలుసుకోవాలని అర్థము తెలుపు పనే బాప్తిస్మము లేక ఉపదేశము.

మిడిమిడి జ్ఞానం కలిగి కొంతచదివి, కొంతభక్తి కలిగి, కొంతే శ్రద్ధకలిగి ఈ రోజు దేవుని జ్ఞానమును మతంగా చేసి, దానికి ఆచారం అను మసిపూసి మనషుల్ని బానిసలుగా చేసి, ఒకరిని ఒకరు చంపుకుంటూ ఇదే దేవుని మాట అని కొందరు పాపాన్ని సంపాదించుకుంటున్నారు. మన ఇందుదేశంలో ఈ మత తీవ్రత చూస్తే మనము ఎంత అజ్ఞానములో ఉన్నామో అర్థమవుతుంది. మనుషుల్ని మనుషులుగా చూడటం మానేశారు. మతంగా చూడటం మొదలుపెట్టారు. ఎవరినైనా చూసి వీడు పలానా మతం అని చెప్పవచ్చు, ఎవనికి వాడు గుర్తులు, రంగులు, వేషధారణ చేసుకుంటూ ఇదే దేవుని మార్గం అంటూ మూర్ఖులుగ ఉన్నారు. బైబిల్ మనుషులకోసం చెప్పబడింది దీనిని వ్యతిరేకించువాడు మనిషికాదు అని అర్థం. అలాగే అన్ని పవిత్ర గ్రంథాలలో కూడా ఇదే విషయం ఉంటుంది. ఈ విషయాలు లేని ఎడల అది దేవుడు చెప్పిన మాటలు కాదు అని పూర్తిగా నమ్మినపుడే మనిషి బాప్తిస్మము పొందినట్టు అనుకోవచ్చును.

ఒకరితో మంచిగా ఉండి ఒకరికి అబద్ధం చెప్పి, ఒకరికి మాత్రమే నిజం చెప్పటానికి దేవుడు మనిషికాడు. ఆయన అందరిమీద సమానంగా వర్షం కురిపించుచున్నాను అన్నాడు. 6500 భాషలు ప్రపంచములో ఉన్నాయి. ఎవని భాషలో వాడు వాని తండ్రిని పిలుచుకుంటాడు. అలా అని 6500 మంది తండ్రులుండరు. ఎవరికైనా ఒకడే తండ్రి. పరమాత్మ అనినా, యెహోవా అనినా, అల్లా అనినా భాషలు వేరు, ఈ పదాలు దేవుని కొరకే అయినప్పుడు ఈ మూడు ఒక్కటే కదా! ఇంత చిన్న విషయమును కూడా గ్రహించలేని స్థితిలో మనము ఉన్నాము. సామాన్యుల సంగతి వదిలేస్తే దేవుని విషయములు చెప్పాల్సిన పెద్దలే భయంకరంగా వేరుచేసి మాట్లాడుతున్నారు. ఈ స్థలంలో దేవుడున్నాడు అంటున్నాడు. ఇది పవిత్ర స్థలం, ఇది దేవుని ఊరు అని దానిని శుభ్రం చేస్తున్నాడు. నీ శరీరంలో ఉన్న దేవుని తెలియక నువ్వు మురికిగా ఉంటూ బయటకన్పించు నటనలు చేయుచున్నారు. క్రైస్తవులు కొందరు ఈ దేశంలోనే ఉంటూ పరాయిదేశం కోసం పనిచేస్తున్నారు. క్రిష్టియానిటి కంట్రీస్ గొప్పవి అంటూ పొగుడుతూ ఉన్నారు. అలాగే ముస్లీంలు కూడా ఉన్నారు. ఒక గ్రంథంలోని విషయములు అర్థముకాకపోతే ఇంకొక గ్రంథము చదువు, అలా జ్ఞానిగా మారినవారు ఉన్నారు. మనము కేవలము దేవునిమార్గము తెలుసు కుంటున్నాము, అది ఆత్మకు సంబంధించినది అంతే. బహిర్గతంగా చెప్పునది కాదు. ఇక్కడ బ్రతుకుతున్నాము కాబట్టి ఈ నేల మనకు తల్లిలాంటిది దీనిని ఏదో రకంగా గొప్పగా చెప్పాలికానీ కించపరచుకునే గుణం కలిగియుండకూడదు.

**బాప్తిస్మము గురించి మరికొంత వివరించుకుందాం!**

అందరికి గురువుగా దేవుడున్నప్పుడు యోహాను (ఈ సువార్త వ్రాసిన యోహానుగారు కాదు. ఇతడు అతనికన్నా ముందుగా ఉన్న దేవుని సాక్షి) క్రీస్తుకు బాప్తిస్మమిచ్చు అర్హుడా? అని ప్రశ్న వేసుకుని చూసుకుంటే ఏసుక్రీస్తు సాధారణ మనిషిగా జీవనంలో ఉన్నాడు. ఇక్కడ భూమి మీద సంగతులు మాట్లాడుకుందాము. మొట్టమొదటిసారి దేవుని గూర్చి తెలియాలన్నా ఆ విషయం దేవుడు చెప్పాలి లేదా ఆ విషయం తెలిసిన వ్యక్తి చెప్పాలి అని అర్థమగుటకు నాలోనున్న ఆత్మను వెలిగించాలి అంటే వెలుగుతున్న ఆత్మకు మాత్రమే సాధ్యము. వెలుగుతున్న ఆత్మ అంటే దానిని ఎవరో ఒకరు వెలిగించి ఉండాలి. ఒకరినుండి ఇంకొకరికి ఈ వెలుగు ఇవ్వబడుతుంది అని అర్థం చేసుకోవాలి. మొదటిగా వెలిగించినవాడు దేవుడే కాబట్టి అందరిలోనూ ఆయన వెలుగు ఉంది.

ప్రతివాడు పుట్టుకతో ఆత్మను తెలియలేడు. ప్రతివాడికి ఆత్మ ఉన్నదన్న విషయం దేవుడు చెప్పాలి. దానికి సంబంధించిన జ్ఞానము శ్రద్ధ ప్రతి ఒక్కరికీ ఇవ్వబడినాయి. ప్రతివాడు దానిని వెతుకుతూ వెళ్ళాలి దానిని సంపాదించాలి. దానికి తొలిఅడుగు గుర్తుగా ఒక గురువునుండి జ్ఞాన స్నానము పొందాలి అని అర్థమవుతుంది. అలా క్రీస్తువారు జ్ఞానస్నానము (మొదటి ఉపదేశము) పొందిన తరువాత 40రోజుల కఠినమైన ప్రార్థనలో పూర్తి పరిశుద్ధాత్మను పొంది సర్వమానవాళికి దేవుని మార్గం చూపాడు.

జ్ఞానస్నానము పొందినా జ్ఞాని కాదు. పరలోకరాజ్యము చేరలేడు. అడ్మిషన్ తీసుకున్న వ్యక్తి క్లాసులోకి మాత్రమే వెళ్ళగలడు. కొంతకాలం చదివి అర్థం చేసుకుని దానిప్రకారం నడుచుకున్నచో జ్ఞాని అవగలడు.

కొందరు బాప్తిస్మము తీసుకున్నాను ఇక నేను పరలోకము అర్హత పొందాను అని ధీమాగా చెప్తుంటారు. దాని వివరణ తెలియక అపోహలో ఉన్నారు.

క్రీస్తువారు బాప్తిస్మము తీసుకున్న సమయంలో పావురము గురించి ఉన్నది. అది తన తలపై వచ్చి యున్నది. పావురము నిష్కపటము లేని స్వచ్ఛతకు గుర్తు. కావున మీరు కేవలము జ్ఞానము తెలియుట కొరకు మాత్రమే మీ మనస్సును, హృదయమును మార్చుకోని నిష్కపటము లేక యుండవలెనని అర్థము. అలా కాకుండా బాప్తిస్మము నామమాత్రముగ, మనస్సును మార్చుకొనక ఆచారముగా భావించిన అది వ్యర్థమైన ప్రయాస అగును.

టైము చూడటం రానివాడు గడియారము కొనుక్కున్నట్టు. కొందరు గుడిలో కొబ్బరి కాయలు కొడుతున్నారు. గంట కొడుతున్నారు. బొట్టుపెట్టు కుంటున్నారు. ప్రసాదం తీసుకుంటున్నారు. ఎందుకు ఇలా చేస్తున్నారు, దీని అర్థమేమిటి? అని అడిగినా ఎవరూ చెప్పరు. అందరూ చేస్తున్నారు నేను చేస్తున్నాను అంటున్నారు. పోనీ అయ్యగార్లకి ఏమైనా తెలుసా? తెలియదు, అది చెప్పకుండా ఏదో ఒక కథ అల్లి దానికి అర్థం చెప్పుచున్నారు. వివరము తెల్పి, తెలుసుకొని ఆ పనిని చేయాలి.

ప్రశ్నవేయడం, ప్రశ్నవేసుకోవడం, జవాబు తెలుసుకోవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. పిల్లలకి దీనిని పెద్దలు అలవాటు చేయించాలి. దేవుని జ్ఞానము చెప్పువారు కూడా భక్తులను ప్రశ్నలు అడగండి, జవాబు చెప్తాను అని వారికి ప్రశ్నవేయడం నేర్పించాలి. భయముతో కూడిన, మొక్కుబడిగా చేసిన పని వ్యర్థము.

**(యోహాను, 2-10) ప్రతివాడును మొదట మంచి ద్రాక్షారసమును పోసి, జనులు మత్తుగా ఉన్నప్పుడు జబ్బు రసము పోయును. నీవైతే ఇదివరకును మంచి ద్రాక్షారసము ఉంచుకొని యున్నావని చెప్పెను.**

ఈ వాక్యము లోకము గురించి చెప్పుచున్నారు. ప్రతివాడు మొదట మంచిగా ఉంటూ, మంచి ప్రవచనములు పలుకుచూ, జనానికి మంచిగా పేరు తెచ్చుకున్న తరువాత వారు ఆ యొక్క నమ్మకమును వారి స్వార్థమునకు వాడుకుంటున్నారు. అనగా లోకసంబంధమైన ఆశలు కల్పించి భక్తులను మోసం చేస్తున్నారు. నీవైతే ఇదివరకు మంచిజ్ఞానము పొందియున్నావు. దేవుని కృపవరములలో జ్ఞానము ముఖ్యమైనది అయినా దానిని చివరివరకు కూడా ఆ యొక్క జ్ఞానము ప్రకారము నడుచుకొనవలెను అని చెప్పుచున్నారు.

**(యోహాను, 1-51) మీరు ఆకాశము తెరువబడుటయు, దేవుని దూతలు మనుష్యకుమారుని పైగా ఎక్కుటయును దిగుటయును చూతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**

కంటిని కనిపించని ప్రపంచము గూర్చి ఇక్కడ చెప్పుచున్నారు. అనగా దేవుని రాజ్యపాలనను గూర్చిన వివరమిది. రాజ్యము ఎక్కడోలేదు మనలోనే ఉన్నది. కనిపించు శరీరములోపల రక్తప్రసరణ, గుండెకొట్టు కోవడం, మూత్రపిండములు, కాలేయము, నరములు ఇవన్నీ దేనిపని అది చేస్తున్నది. ఇదంతా స్థూలజ్ఞానము. కంటికి కనిపించని విధానముంది అది తలలో కాలచక్రము, కర్మచక్రము, గుణచక్రము, ఆత్మ నివాసకేంద్రము, అహము, బుద్ధి, చిత్తము, మనస్సు, ఏడు నాఢీ కేంద్రములు, ఇదంతా సూక్ష్మజ్ఞానమందురు. మనుష్యకుమారుడు అనగా ఆత్మ, ఎక్కుటయు, దిగుటయు అంటే పాపము ఏ విధంగా చేరుతుంది, ఏ విధంగా అమలు అవుతుందో ఆ విధానము మీకు తెలియబడుతుంది అని అర్థము.

మొత్తము మన శరీరములో పది స్థూల భాగములు. 1) కన్ను, 2) ముక్కు 3) నాలుక 4) చెవి 5) చర్మము 6) చేతులు 7) కాళ్ళు 8) నోరు 9) గుదము 10) గుహ్యము.

**పదిహేను సూక్ష్మభాగములు** 1) జీవుడు 2) మనస్సు 3) బుద్ధి 4) చిత్తము 5) అహము 6) చూపు 7) వినికిడి 8) స్పర్శ 9) రుచి 10) వాసన 11) వ్యానవాయువు 12) సమాన వాయువు 13) ఉదాన వాయువు 14) ప్రాణవాయువు 15) అపానవాయువు. వీటిన్నింటినీ నడుపునది ఆత్మ. యోబు గ్రంథములో కంటికి కనిపించని ప్రపంచము ఆకాశమందున్నది, ఆ ఆకాశము నీ తలలోనే ఉన్నది.

**(యోహాను, 1-36) ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల.**

లోకపాపము అనగా అనుభవించు జీవితము, సంపాదించు పాపము, పుణ్యము. దీనినే కర్మ అంటాము. ఇది ఎలా సంపాదించు కుంటామో, ఎలా అనుభవిస్తామో ఎవరికీ తెలియదు, అందుకే కర్మ మర్మము అని మన పెద్దవాళ్ళు అంటారు. దీని గురించిన వివరము తెలుపుటకే దేవుడు గురువుగా భూమిమీదకు వస్తాడు. దేవుడి గొఱ్ఱెపిల్ల అనగా దేవుని కుమారుడు అని అర్థము. పాపమును తీసివేసే శక్తి జ్ఞానమునకు కలదు కాబట్టి అటువంటి జ్ఞానమును దేవుని కుమారుడు తీసుకువచ్చాడు. ఆ జ్ఞానము మనము తెలుసుకుంటే పాపము లేకుండా పోతుంది. కాబట్టి దానిని లేకుండా చేయడానికే యేసుక్రీస్తు వచ్చారు.

**(యోహాను, 2-16, 17) నా తండ్రి ఇల్లు వ్యాపార పుటిల్లుగా చేయకుడి అని చెప్పెను. ఆయన శిష్యులు నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించునని వ్రాయబడి యున్నట్టు జ్ఞాపకము చేసికొనిరి.**

ఈ భూమి అంతయూ వ్యాపించియున్న పరమాత్మ ఇల్లు ఏది? కేవలం దేవాలయము మాత్రమేనా? లేదా ఎన్నుకోబడిన ప్రత్యేక స్థలములా? వ్యాపారము చేయుట తప్పా? ఇలా ప్రశ్నలు రావచ్చును. యేసువారు ఎక్కడ వాక్యము చెప్పినా కొంత ప్రపంచ జ్ఞానము కన్పించు విధంగా సూక్ష్మ జ్ఞానము భోదించును. ఉదాహరణ దేవాలయము ఎదుట నిలుబడి ఈ దేవాలయమును పడగొట్టుడి మూడు దినములలో నిలుపుదుననెను. ఆ తరువాత తనే దాని అర్థము నేను చెప్పునది శరీరదేవాలయము గురించి అనిచెప్పెను. అదే విధంగా ఇక్కడ కూడా ఇల్లు అనగా మన శరీరమే. కేవలం శరీరము బ్రతుకుటకు, ధనము సంపాదించుటకు, వ్యాపారము చేసుకొనుటకు కాదు పరమాత్మను తెలుసుకొనుటకు అయితే ఆ విషయమును మనిషి పూర్తిగా మరచిపోయినాడు. అందుకు కోపంతో క్రీస్తువారు హెచ్చరిస్తున్నారు.

నీ ఇంటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించుచున్నది అనగా నన్ను అవమానపరచుచున్నది. దీని వివరమేమంటే కొద్దిగా మనిషి అన్ని పనులను కాసేపు ఆపుచేసి, కొద్దిగా బుద్ధిని ఉపయోగించిచూచి తన్ను తాను పరీక్షించుకొని చూసుకుంటే.

1) నా పుట్టుకకు కారణం నేను కాను అలాగే చావుకు కూడా
2) నా శరీరాకృతి నిర్ణయం ఎవరిది? నాకు ఉన్న బుద్ధి ఎలా వచ్చింది? మనస్సు చేస్తున్న మాయ ఏమిటి?

3) ఆహారము ఎవరి వలన వస్తుంది? మనము ఎవరి వలన జీవిస్తున్నాము?

4) మనము ఉపయోగించు పరికరములు ఎవరు సృష్ఠించారు.

5) పనిచేయు శక్తి, బలము ఎవరి వలన కలిగినవి?

6) నా మరణం తేది ఎప్పుడు?

7) నా చేతిలో ఏమి ఉన్నది, నా మరణం తరువాత జీవితం ఏమిటి? నేను ఎవరు?

8) నీరు, వెలుతురు, వేడి, ఆహారం లేకుండా జీవించలేను, నేను ఎలా స్వతంత్రుడను?

9) నీటి వరదల వల్ల, భూకంపాల వల్ల, అధిక వేడి వలన, రోగాల వల్ల నేను భరించలేని బ్రతుకు జీవనం నేను ఎలా స్వతంత్రుడను?

10) నా కళ్ళముందే నా తండ్రిచనిపోతున్నారు. నేనునూ చనిపోతాను మరియు నా పిల్లలు చనిపోతారు. నా స్వతంత్రమేమిటి?

11) నేను జీవితాంతం కూడబెట్టిన ధనము నాతో కూడా రాదు ఎందుకని?

12) నేను ఏమి చేస్తున్నాను? దేనికై ప్రయాస పడుతున్నాను?

13) ఎలాగు మరణించు జీవితం కోసం ఎందుకు నేను రాళ్ళను, ఇనుప ముక్కలను పోగుచేసుకుంటున్నాను. మనిషి ఇంకొక మనిషిని ఎందుకు ద్వేషిస్తున్నాడు. ఎందుకు నా మనస్సులో ఈ హెచ్చుతగ్గు భావం కలిగియున్నది. వీటన్నింటికీ సమాధానం ఎవరి దగ్గర లేదు. మనలను సృష్ఠించినవాడు ఆయనను తెలుసుకోవాలనే ఆయన ఉద్దేశ్యము అందుకు మనకు జన్మను ఇచ్చి, మనలను పోషించుచున్నాడు. కాబట్టి మన శ్రద్ధ అంతయూ ఆయన మీద ఉండవలెనని చెప్పుచున్నాడు. అంధకారం వదలి

జ్ఞానంతో నన్ను తెలుసుకొని నశించని జీవితం పొందండి అని పరిశు ద్ధాత్మయే వచ్చి మనకు జ్ఞానం చెప్పుచున్నది.

**(యెహాను, 3-6) శరీరము మూలముగా జన్మించినది శరీరము ఆత్మ మూలముగ జన్మించినది ఆత్మయై ఉన్నది.**

ఈ వాక్యము కొంత సైన్స్‌తో, ఎంతో దేవుడి జ్ఞానముతో కూడినదై ఉన్నది. శరీరమును గురించి మనకు కనిపించు విధంగా ముందుగా తెలుసుకుందాం! తల్లిదండ్రుల కలయికే సంతానం ఇది శాస్త్రం. పురుషుని యొక్క వీర్యకణము స్త్రీ యొక్క అండమును చేరిన, అది పిండముగా మారును. ఆ తరువాత ఆ పిండము తల్లి కడుపులో 9నెలలు ఎదిగి, ప్రసవించి అది బిడ్డగా మారును. ఇది అంతయూ తెలిసిన సమాచారము. ఇప్పుడు కొన్ని ప్రశ్నలు వేసుకుందాం!

1. తల్లి కడుపులో పిండమునకు జీవం ఉంటుందా?
2. తల్లి కడుపులో ఉన్న పిండముకు జీవముండిన ఎడల తనకు నిర్ణయం తీసుకునే శక్తి ఉందా?
3. కేవలం అండము, వీర్యకణముల ద్వారా మొత్తము శరీరము తయారు అగునా?
4. వీర్యకణములో ఏముంది? అండములో ఏముంది?
5. జీవమున్న పిండమే అయితే ప్రసవించిన తరువాత చాలామంది పిల్లలకు జీవము ఎందుకు లేదు?
6. కొంతమంది పుట్టిన తరువాత కొంతసమయము తరువాత ఏడుస్తారు ఎందుకు?
7. కొన్ని న్యూస్ పేపర్లలో చూసాము, బిడ్డ చనిపోయినది అని

నిర్ధారించిన తరువాత పూడ్చిపెట్టడానికి సిద్ధంగా ఉన్న పాప ఏడ్చింది. తరువాత బ్రతికిందని హాస్పిటల్‌లో గొడవచేయడం. అవి అన్నియూ చూచాము. దానికి కారణమేమి?

8. కణములోనే జీవముంది అని డాక్టర్స్ చెపుతుంటారు. ఇది ఎంతవరకు నిజం?

ప్రశ్నలను వేసుకున్న తరువాత కొంత ఆలోచన వస్తుంది? 25% నమ్మకమున్నా, 75% శాతం మన మనస్సు ప్రశ్నలలోనే ఉంచుతుంది. సరే ఇది ఇలా కాసేపు వదిలేసి ఇంకొక కోణంలో పరిశీలిద్దాం!

మనము మన జీవితంలో ఇతరుల పుట్టుకను, చావును ఈ రెంటినీ కళ్ళతో చూస్తాము. (ఎవరి చావు,పుట్టుక వారు చూసుకోలేరు. ఇంకొకరిని చూసి నమ్ముచున్నాము.) పుట్టుక గురించి కొంచెం తెలుసుకున్నాము. ఇప్పుడు చావు గురించి చూద్దాం. మన కళ్ళముందే పుట్టి పెరిగిన వ్యక్తి చనిపోతే, ఆ వ్యక్తి శరీరము మొత్తం అక్కడ ఉన్నాకూడా అది కదలదు. దానినే చావు అంటున్నాము. ఇక్కడ శరీరము అంతా మన ఆధీనంలో ఉన్నప్పుడు మన చావు మన ఆధీనములో ఉండాలి కదా? అంటే మనకు ఏ అధికారములేదు. మనకు లేదు అంటే ఇంకొకరికి ఉన్నట్టే కదా!.

ఇంకా కొంచెం ఆలోచిద్దాం! ఒక కారు ఆగిపోతే ఏదో రకంగా దాని లోపం సరిచేసి తిరిగి దానిని నడిచేలా చేస్తాము. మరి మనిషి కూడా చనిపోతే తిరిగి ఈ సైన్స్ బ్రతికించలేదా? గుండె ఆగిపోతే వేరే గుండె పెట్టి బ్రతికించలేమా? తల మొండెము వేరు చేసి, ఏదైనా బ్రతికిఉన్న జంతువును తల అతికించి బ్రతికించలేమా? ఇన్ని సంవత్సరాలుగా డాక్టర్స్ దీనిని కనిపెట్టలేకపోయారా? ఒక గుండెను గురించి అధ్యయనం

చేయుడానికే మనిషి జీవితకాలం సరిపోనప్పుడు, మనలో ఎన్ని అవయవాలున్నాయి? ప్రతిదానికి ఒక స్పెషలిస్ట్ ఉన్నారు. అయినా ప్రాణం మాట అటుంచి రోగం కూడా పోగొట్టలేని పరిస్థితి వాళ్ళది.

మనము చావును ప్రత్యక్షంగా చూసిన సాక్షులం. దానిని నమ్ముతున్నాము. చావులో కూడా కొందరు కొంచెంసేపు తరువాత గంటకో లేదా రోజుకో తిరిగి బ్రతికినవారు కలరు. న్యూస్‌లో కూడా అప్పుడప్పుడు చూస్తుంటాము.

ఇప్పుడు పనివిధానం తెలుసుకోని చూద్దాం! చనిపోయేటప్పుడు మన నిర్ణయం లేదు. పుట్టేటప్పుటడు కూడా నిర్ణయం లేదు. కాబట్టి కంటికి కనిపించనిది ఏదో మనలను శాసిస్తుంది. మనకు తెలియకుండా అది మనలో ఉండి, మనలను పనిచేయిస్తుంది. కాబట్టి మధ్యలో పెరగటం, జీవించడం కూడా మన చేతిలో లేదు అని నమ్మవలసివస్తుంది.

ఇంకొక ఉదాహరణ తీసుకుందాం! మన శరీము కండలు తిరిగి ఉండాలంటే బాగా తిని, వ్యాయామం చేసి బలంగా తయారు అవుతాము. ఇది కన్పించు బలం. ఇలాంటి వాడిని మనము నీకు ఇంత బలము ఎలా వచ్చింది? అని అడిగితే నేనే కష్టపడి కండలు పెంచాను. నాఅంత బల వంతుడు లేడు అంటాడు, ఇది సహజమే. మనిషి స్వతహాగా శక్తిని సంపాదించుకుంటాడు అని నమ్ముచున్నాము. ఈ నమ్మకం ఇలా ఉంచుదాం! ఇదే కండలు తిరిగిన వ్యక్తి వారం రోజులు నిద్రలేకుండా ఉంటే అవే కండలు ఉండినా, అదే తిండి ఉండినా వాడు కనీసం నడవలేని పరిస్థితిలోకి పోతాడు. అంటే కంటిని కనిపించని నిద్రలో శక్తి ఉందా, కనిపించు భోజనంలో శక్తి ఉందా!

కంటికి కనిపించని విధానమేదో పనిచేస్తుంది అని కొంత నమ్మకం వచ్చిందికదా! మళ్ళీ పుట్టుకకు సంబంధించిన విషయానికొస్తే పుట్టి ఏడ్చిన తరువాత వాడు బ్రతికినట్టు. ఆ ఏడుపు పుట్టిన వెంటనే కావచ్చు లేదా 5,10ని॥లు ఆలస్యముకావచ్చు, గంట కూడా ఆలస్యం కావచ్చు. ఈ విధానం చూస్తుంటే కంటిని కనిపించని శక్తి ఏదో వచ్చిచేరినప్పుడు వాడు ఏడుస్తున్నాడు. శ్వాస అప్పుడు మొదలవుతుంది. దీనినిబట్టి తల్లి కడుపులో ఉన్న బిడ్డకు ప్రాణం లేదు అని నిర్ధారించవచ్చును. ఇది తప్పు అని ఒకేసారి మూర్ఖంగా ఆలోచించకుండా, కొంత మన శరీరంమీద శ్రద్ధపెట్టి ఆలోచించిన పూర్తిగా కాకున్నా, మనము కొంత తెలియవచ్చును.

**కొన్ని సూత్రాలను అన్వయించుకొని చూచిన**

1. కుండలు చేయువాడు కుండను మట్టితో చేస్తాడు. అక్కడికి ఆకారం తయారు అయింది కానీ పని అయిపోలేదు. దానిని ఎండబెట్టి, కాల్చి కొన్ని రోజుల తరువాత అమ్ముకుంటాడు.

2. కర్పూరం తీసుకుని దానిని వెలిగించిన అది వెలుగుతుంది. ఆ వెలుగు దాని యొక్క సైజునిబట్టి ఉంటుంది. వెలిగించకముందు అది ఎన్ని రోజులైనా సరే దాని గుణం దానినుండి పోదు. వెలిగించిన తరువాత అది మార్పుచెంది కంటికి కనిపించకుండా ఆవిరయి పోతుంది.

పై రెండు ఉదాహరణలు అన్వయించుకున్న వీర్యకణములో జీవము లేదు అనీ, అది కేవలం ఒక మార్పుచెందు రసాయనం (కెమికల్) అనీ నమ్మవచ్చు. అలాగే బిడ్డ తయారు కాగానే పూర్తి అయినట్లు కాదు. అందులో జీవం లేదు. దీని మీద ఇంకా శ్రద్ధగా ఆలోచించిన పూర్తిగా అర్థము కాగలదు. ఆత్మయే జీవింపచేయుచున్నది. శరీరము కేవలము నిష్ప్రయోజనం అన్న

బైబిల్ వాక్యము పూర్తి నిజము. శరీరములో జీవము లేదు అని తెలుసుకున్నాము. ఇంకాకొంచెం అనుమానముండడము సహజమే! ఎందుకంటే ఆత్మను కూడా తెలుసుకుంటే పూర్తిగా నమ్ముతాము అని మన మనస్సు హెచ్చరిస్తూ లేదా సూచనలిస్తూ ఉంటుంది.

ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయైఉన్నది. శరీరమునుండి శరీరము తయారవుచున్నది అని వివరించుకున్నాము. ఆత్మను చూడలేదు, తాకలేదు. దీనిగురించి తెలియదు, దీని జన్మమెలా తెలుసుకోవడం. అన్ని ప్రశ్నలకు దేవుడే జవాబు చెప్తాడు. దానికి మనకు బైబిల్ ఆధారమైన గ్రంథము. శరీరములో కంటికి కనిపించని వాడు మనలను పరిపాలిస్తుంటే, దానికి ఆత్మ అని పేరుపెట్టి, అది అదే ఆత్మచేత సృష్టించబడినది అని వాక్యము చెప్పుచున్నది. అది దేవుడు అని చెప్పవచ్చు. ఆత్మవెలుగై ఉండెను ఆ వెలుగు నేనై ఉండెను అని దేవుడు చెప్పిన వాక్యమే ఆధారం.

మనలో ఉన్న ఆత్మ గురించి కొంచెమైనా తెలుసుకొనుటకు ప్రయత్నం చేశామా? దేవుని జ్ఞానం కొంచెం కొంచెం శ్రద్ధ కలిగిన ఈ అనుభూతిని పొందవచ్చును.

ఈ పవిత్ర బైబిల్ గ్రంథములోని వాక్యములు పూర్తిగా ఆత్మజ్ఞానం తెలుపు వాక్యములే కనుక వీటిని గ్రహించి అనుసరించిన, అది సాధ్యమవు తుంది అని వాక్యములు చెప్పుచున్నవి.

**(యోహాను, 3-18) ఆయనయందు విశ్వాసముంచువానికి తీర్పు తీర్చబడదు; విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచ లేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను.**

ఆయన అనగా సృష్ఠికర్త (దేవుడు) ను పూజించువారికి, నమ్మిన వారికి, ఆయనను గుర్తించినవానికి తీర్పుతీర్చబడదు. తీర్పు అనగా నేమి? ఎవరు ఎవరిని ఎందుకు తీర్పు తీర్చుతారు? ప్రశ్నవేసుకుని చూద్దాం! తీర్పు మంచి తల్లిదండ్రులు ఉండి, పిల్లల ఎదుట శ్రద్ధ, క్రమశిక్షణ, చదువు, ఆరోగ్యం ఇలా అన్నింటిలో శ్రద్ధ తీసుకునే తల్లిదండ్రుల పిల్లలు వారికి బహుశ ఎక్కువ ప్రశ్నలు రాకపోవచ్చు. కానీ ఎక్కువ సంతానం, తక్కువ జీతం, జీవనవిధానంలో లోపం, తండ్రి త్రాగుబోతుగా, కష్టానికి తప్ప జ్ఞానానికి చోటులేని ఇల్లు, తక్కువ కులం, హేళనగా చూడటం, అమర్యాద, బంధువుల పరిచయాలు లేకపోవడం, పెరిగిన వాతావరణ ప్రభావం, సరైన జీవనోపాధిని ఎన్నుకోకపోవడం, ఎంత కష్టపడ్డకూడ అదే జీవనం. ఇలాంటి జీవితాలలో నిరాశ, నిస్పృహలతో పాటు ధనమున్నవారు పుణ్యాత్ములు అనే భావన కలుగుతుంది. ఉదాహరణ తీసుకుందాం! ఎవరైనా అందంగా కారు నుండి దిగివస్తున్నా లేదా ఏదైనా సినిమాలో అందమైన హీరోయిన్ ఉన్నా ఎక్కువ ఆకర్షింపబడతారు. ఎందుకంటే అందంగా ఉండువారు తక్కువగాను, కొంత అస్వస్థత కలిగిన శరీర సౌందర్యంతో ఉన్నవారు ఎక్కువగా ఉంటారు.

ఎందుకు ఈ వ్యత్యాసం జరుగుతుంది? అందరూ దేవుని దృష్టిలో సమానంగా ఉన్నప్పుడు, ఒకడు ఒకలా ఇంకొకడు ఇంకోలా ఉండటం ఇది ఎందుకు జరుగుతుంది? అందరికీ సమాన జ్ఞానం ఎందుకు లభించడం లేదు? ఒకడు పుట్టకతోనే బానిసగా, ఇంకొకడు ఏ కష్టమూ తెలియని వాడిగా ఎందుకుంటున్నారు? అసలు జన్మలు ఎలా నిర్ణయింపబడతాయి? ఎవరు నిర్ణయిస్తారు? మన వెనుక ఉన్న రహస్యమేమిటి? ఎవరు దీనికి సమాధానం చెప్తారు? ఎలా తెలుసుకోవడం? ఇలా ప్రతి మనిషిలో ఎన్నో

ప్రశ్నలు దాగి ఉన్నాయి. కానీ సమాధానం కోసం వెదికే వారు ఎవరు? ఎంతమంది? 60 సం॥లు జీవిస్తే మన పుట్టుక గురించిన రహస్యం తెలుసుకోవాలని కనీసం ఒక్కరోజు కూడ ఆలోచించనివారు ఎంతోమంది!

దీని గురించి ఆలోచించి ఎందుకు పిచ్చివాడిలా అవుతావు? అని చాలామంది అనటం జరిగింది కానీ ప్రశ్న ఉంది అందుకు సమాధానం కూడా ఉంది. అది దేవుడే చెప్తాడు. మనకు 5000 సం॥ల పూర్వమే 'భగవద్గీత' రూపంలో దేవుడు జ్ఞానమును చెప్పియున్నాడు. కానీ కొందరు దానికి మతము అను మసిపూసి అందరికీ ఆ యొక్క జ్ఞానమును తెలుపక కొన్ని వేల సంవత్సరములు మనుషులను పూర్తి అజ్ఞానులుగా చేశారు.

దేవుడు మనయొక్క అజ్ఞానమును తొలగించుటకు మరియొక గ్రంథమును ఈ లోకమునకు అందించాడు. అదియే బైబిల్. కానీ బైబిల్ ప్రతి ఒక్కరి చేతిలో ఉన్నా తమకు కావలసిన లేదా ఉపయోగపడు వాక్యములను మాత్రమ్రు ఎన్నుకుని జనమును ఆకర్షించు వాక్యములు చెప్పుచున్నారు. సత్యమును గ్రహింపక వాటిలోనున్న రహస్యములు తెలుసుకొనుటకు ప్రయత్నం చేయడము లేదు. ఏది ఏమైనా దేవుని జ్ఞానం ప్రపంచవ్యాప్తంగా ముందుకు వెళ్తుంది అంటే అది బైబిల్ ద్వారా అని చెప్పవచ్చును.

తీర్పుకు సంబంధించిన వాక్యము ఎందుకు ఇక్కడ బైబిల్‌లో ప్రస్తావించాడు. చూద్దాం!

శరీరము, ఆత్మ, ఇవి రెండు ఉంటేనే మనిషి జీవితం. చావు, పుట్టుకలు మనచేతిలో లేవు, అలాగే మధ్యలో జీవించేది కూడా మనచేతిలో లేదు. కొందరు దీనిని ఒప్పుకోనరు, వారిని వదిలేసి వాస్తవం చూద్దాం!

**"వానికి ఇంతకుమందే తీర్పు తీర్చబడెను"** ఈ వాక్యములో తీర్పు అనగా కేటాయించిన జీవితం అని అర్థము. ఒకడు సినిమాకి వెళ్ళాలి అనుకో, వాడియొక్క ఆర్థిక పరిస్థితిని బట్టి 10రూ॥, 20రూ॥ లేదా 100॥లు టికెట్టు కొని చూస్తాడు. చూసేది ఒకే సినిమా కాని చూసే విధానంలోనూ, అనుభవించే హోదాలోనూ మార్పుఉంది. అలాగే అందరూ భూమి మీదనే జీవించిన జీవనవిధానంలో హెచ్చుతగ్గులున్నాయి. ఇదే విధంగా అన్నింటి యందు వాడికి ఏది నిర్ణయింపబడితే అదే వాడికి దొరుకుతుంది. ఒకడు బాగా కష్టపడి చదివి మంచి ఉద్యోగం సంపాదించి మంచిగా బ్రతుకు తున్నాడు అనగా వాడు మంచి చేశాడు వాడికి మంచి జరిగింది. అలాగే ఒకడు హత్యచేశాడు లేక మోసం చేశాడు, వాడు దానికి తగిన జైలు జీవితం గడుపుచున్నాడు. ఇది వాస్తవం, భూమి మీద జరుగుచున్నదే మనము చూస్తున్నాము. కానీ దేవుని ప్రణాళిక ఎలా ఉన్నదో తెలుసుకుందాం, 'సంపాదించినది అనుభవించాలి' ఇది సూత్రం.




మన జీవితము అద్దములాంటిదని పెద్దలు ఎందుకన్నారోగానీ అది 100% వాస్తవము. మనకు గత జన్మలున్నాయి. అద్దము వెనుక జరిగినది కనుక మనము నమ్మడము లేదు. ఎన్నో జన్మలున్నాయి. మనము భూమిమీద జీవిస్తున్నాము అంటే ఈ భూమి పుట్టినప్పటి నుండి మనము ఉన్నాము.

క్రైస్తవులమైన మేము దీనిని ఒప్పుకోము? మాకు బైబిల్‌లో చెప్పబడ లేదు, అని చాలామంది అంటుంటారు, ఇది వాస్తవంగా బైబిల్‌లోనే చెప్పబడింది అని అంటే ఎక్కడ ఏ వాక్యములో, ఏ అధ్యాయములో చెప్పారు? అని అడుగుతారు. బైబిల్ కాలేజీలు పెట్టి, అదే వృత్తిగా చేసుకుని ఉన్న వారు కూడా పూర్తిగా చదివి అర్థము చేసుకునే పరిస్థితులలో లేరు. సరే మనము వాక్యములోనికి వద్దాం!

యోబు కాలజ్ఞానము చెప్పారు కదా! అందులో కొన్ని వాక్యములు చూద్దాం! కాలము అనగా టైం, జ్ఞానము అనగా కాలములో జరుగుపని అని అర్థము.

1) నరుల క్రియలకు తగినట్టుగా ఫలము ఆయన వారికిచ్చును.

2) దేవుడు ఏమాత్రం దుష్కార్యం చేయడు.

3) శరీరులందరూ ఏకముగా నశించెదరు. నరులు మరలా ధూళియై పోవుదురు.

4) మనము నిన్నటివారమే. మనకు ఏమియూ తెలియదు. భూమి మీద మన దినములు నీడవలె ఉన్నవి. ఈ వాక్యములు పరిశీలించిన తరువాత 1) వాక్యములో ఎవడు ఏది సంపాదిస్తే దానినే అనుభవించును అని 2) ఇందులో దేవుడి ప్రమేయం ఏమీ లేదు అనీ 3) అందరూ చనిపోవుదురు వాస్తవం మరలా ధూళియైపోవుదురు అనగా మరల మరల (రిపీట్) అవుతున్నాము అనీ 4) మనము గతజన్మవారిమే మనకు ఏమీ తెలియదు అని చెప్పుచున్నారు. కొంత ఆలోచించిన ఈ యొక్క పూర్తి జ్ఞానం చిక్కగలదు. జననము మరణము దాని రహస్యమును గూర్చి మరియొక వాక్యములో కూడా వివరించారు. దాని గురించి తరువాత తెలుసుకుందాం! ఈ యొక్క వివరము ప్రకారము మనము ఏదైతే గతంలో

సంపాదించామో దానినే మనము ఇప్పుడు అనుభవిస్తున్నాము. దానిని ఎలా సంపాదించుకుంటున్నాము? ఎలా పాపమును సంపాదించకుండా ఉండాలి? ఏమి చేస్తే మనము ఈ యొక్క శ్రమలనుండి విముక్తి పొందుతాము? ఏ రూపంలో దేవుడు పాపాన్ని పుణ్యమును లెక్కిస్తున్నాడు? లోకసంబంధమైన నీతినిబట్టి చేస్తున్నాడా? లేదా దేవుని యొక్క నీతినిబట్టి చేస్తున్నాడా? గతంలో నేను ఏమిచేస్తే క్యాన్సర్ వ్యాధి వచ్చింది? ఏమి చేస్తే షుగరు వచ్చింది? ఏమి పాపము చేస్తే నా పిల్లలు పనికి రాకుండ పోయారు? ఏమి పాపము చేస్తే వికలాంగుడిలా పుట్టాను? ఏమి పాపము చేస్తే శత్రువులు ఉన్నారు? ఎన్నో ప్రశ్నలు వస్తాయి. కానీ దేవుడు దీనికి ఈ శిక్ష, దీనికి ఈ జీవితం అని ఎక్కడా చెప్పలేదు.

ప్రస్తుతము మనము అనుభవించు జీవితంలో మనకు తెలియకుండా సంపాదించుకున్న పాపం ఎంత? ఎలా మనము గుర్తించడము? దీని గురించిన వివరములు బైబిల్‌లోనే ఉన్నాయి. ఒక వాక్యమును తీసుకుని ఒక వారము రోజులుపాటు అర్థము చేసుకున్న, మనకు మన జీవితంలో ఎన్నో వారములు గడచిపోగలవు.

మనము తీర్పు తీర్చబడినవారము కాబట్టి ఆయన నామమందు విశ్వాసము కలిగి, ఆయన అద్వితీయతను గుర్తించి, ఈ లోకమును వీడి పరలోకము చేరుటకు ప్రతిఒక్కరూ ప్రయత్నించవలెను. సరైన రీతిలో దేవుని జ్ఞానమును తెలుసుకొని దానిని పాటిస్తూ, పిల్లలకు కూడా చిన్నప్పటి నుండి ఈ దైవజ్ఞానం అలవాటు చేసినట్లయితే, అందరూ సంతోషముతో మంచి జీవితం గడుపవచ్చును. ఈ రోజు చేసిన తప్పు రేపు తప్పక అనుభవించి తీరాలి ఇది శాసనం. దీనిని ఎల్లప్పుడు మనస్సులో గుర్తుంచు కొని జీవించాలి. ఒకరిని హత్య చేస్తే తిరిగి నువ్వు హత్య చేయబడతావు

ఇందులో ఎంతమాత్రము సందేహము లేదు. దేవునిజ్ఞానము లేదా దేవునిమార్గము ఒక్కటే మనకు గతి. అదియే గతంలో లేదా ఈ జన్మలో చేసిన పాపాలను తుడిచివేసి పరలోకము చేర్చును. అదియే అంతిమ తీర్పు. అప్పటివరకు లోక శ్రమలను అనుభవింపక తప్పదు.

**(యోహాను, 3-19, 20) వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమక్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్ క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడియున్నవని ప్రత్యక్షపరచబడునట్లు వెలుగునొద్దకు వచ్చును.**

వెలుగు అనగా జ్ఞానము. చీకటి అనగా శరీరక్రియలు.

ఒక కుటుంబంలో తల్లిదండ్రులకు నలుగురు సంతానము, అందులో ఒకడు మాత్రమే సంపాదిస్తున్నాడు. మిగతా వారిలో ఇద్దరు అంతగా ఆదాయం లేకపోయినా, ఒకడు మాత్రము ఏమి సంపాదించక కేవలం దేవుడు దేవుడు అని తిరుగుతున్నాడు అనుకోండి. ఇంట్లో సంపాదించేవాడు గౌరవాన్ని పొందుతాడు, పైగా వాడికి సంపాదించనివాడు పనికిరాని వాడిలా కనిపిస్తాడు, వానిని సన్నాసి అంటాడు, చవట అంటాడు, అసమర్థుడు అంటాడు. సంపాదిస్తున్నవాడు ఏమి తప్పుచేసినా అది వాడికి అలంకారముగా ఉంటుంది. అమ్మాయిలతో తిరిగితే వాడు మంచి రసికుడు అనీ, గొడవలకు పోతే వాడు మంచి ధైర్యమున్నోడు అనీ, బాగా తిట్టి బెదిరించి పనిచేయించిన వాడు సమర్థుడు అనీ, ఏదో రకంగ మనుషులు

వాడికి కిరీటము, బిరుదులు పెట్టడం, వాడిని గొప్పవాడిగా చెప్పడము జరుగును. అలా వాడు గొప్పవాడిగా చలామణి అవుతుంటాడు. పొగడ్తలతో కూడుకొన్న, గొప్ప మర్యాదతో కూడుకొన్న వాడు ఇంతమంచి జీవితాన్ని వదులుకొని దేవుని జ్ఞానము తెలుసుకోవడానికి రానేరాడు.

ఒకవేళ గుడికి వెళ్ళి గంటకొట్టి ఒక బొట్టుపెట్టుకుని అందరికీ కనిపించునట్లు ఆర్భాటము చేయవచ్చును. వాడికి ఎంతసేపు జనము నుండి గొప్ప అనిపించుకోవాలి అనే ఒక మానసిక వ్యథ తప్ప ఏ జ్ఞానమూ ఉండదు. సత్యము గ్రహించినవాడు అయితే నన్ను నడిపించి, నాతో పనులు చేయించుచున్నవాడు దేవుడే అని తెలుసుకుని జ్ఞానము (దేవుని మార్గము) వద్దకు వచ్చును.

**(యోహాను, 4-34) యేసు నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమై యున్నది.**

యేసువారు శిశ్యులతో దేవుడు నాకు అప్పగించిన “పనియే” నాకు ఆహారము. దానిని పూర్తి చేయుటయే నాకు ఆహారము అని అన్నాడు. **ఆయనకు ఒకటే లక్ష్యం, ఒకటే ఆలోచన, ఒకటే ధ్యాస** అప్పగించిన పని పూర్తిచేయడం. దేవుని పని ఒక్కటే కానీ మనకు చాలా పనులుంటాయి. అవి అన్నియూ పూర్తిచేసుకుని దేవుని జ్ఞానము తెలుసుకోవడానికి ఎప్పుడో ఒకసారి కొంత సమయం ఇస్తాము. అదికూడా కష్టాలలో ఉన్నప్పుడు, కోర్కెలున్నప్పుడు. అలా కాకుండా ఒక లక్ష్యం పెట్టుకుందాం ఖచ్చితంగా దేవుని జ్ఞానము పూర్తిగా తెలుసుకుని తీరాలి అని పూర్తిగా ఆయనకు అంకితమై పరలోకం చేరి తీరాల్సిందేననీ విశ్వాసాన్ని విడవక ప్రయత్నం చేద్దాం!

**(యోహాను, 3-29,30) పెండ్లికుమార్తె గలవాడు పెండ్లికుమారుడు. అయితే నిలువబడి పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు, ఆ పెండ్లికుమారుని స్వరము విని మిక్కిలి సంతోషించును. ఈ నా సంతోషము పరిపూర్ణమై యున్నది. ఆయన హెచ్చవలసియున్నది. నేను తగ్గవలసియున్నది.**

యోహానుగారు పరిసయ్యులతో చెప్పుమాటలు ఇవి.

మనకు పెండ్లి అనుమాట తెలుసు. పెండ్లి అనగా వివాహము అను ఇంకొక పదము కలదు. సాధారణంగా మనము పెండ్లికుమార్తె, పెండ్లి కుమారుడు అంటాము. కూతురు, కుమారుడు అని పెండ్లి చేస్తుంటారు దీని అర్థము ఆలోచింపకయే, వివరించి చెప్పకయే ప్రతి ఒక్కరూ దీనిని వదిలివేయడము లేదా ముగించడము జరుగుతుంది. కానీ బైబిల్‌లో ఎన్నో చోట్ల పెండ్లి అనుపదం ఉండగా మన హిందూ సాంప్రదాయాలలో పెండ్లికి చాలా ప్రాముఖ్యత కలదు. అలా ఎంతో గొప్పదైన ఈ విషయమును అర్థము తెలియకనే నిరర్థక జీవితము గడుపుచున్నాము.

**కొన్ని ప్రశ్నలు వేసుకుందాం!**

1) పెండ్లి చేసుకోకుండా సంసారం చేస్తే పాపమా?

2) పెండ్లి చేసుకోకుండా స్త్రీపురుషులు కలిస్తే పిల్లలు పుట్టరా?

3) పెండ్లి అనునది కేవలము మానవ అభివృద్ధి కోసమేనా?

4) చాలామంది పెండ్లి చేసుకోకపోతే సృష్ఠి ఆగిపోతుంది అంటారు నిజమేనా?

5) మోహపువాంఛ తీర్చుకొనుటకు ఒక్కటి అవుతారు, ఇందులో పవిత్రత ఉందా?

6) పెండ్లికి ముందు స్త్రీపురుషులు కలిస్తే తప్పా?

7) ప్రకృతి సిద్ధమైన అవసరం అయిన దీనికి ఎందుకు కులం,మతం, వర్గభేదం చూపుచున్నారు?

8) ధనముకు పెండ్లికి ఏమి సంబంధం? గొప్పవాడి పెండ్లికి బీదవాడి పెండ్లికి తేడా ఏంటి?

9) పెండ్లి అయిన తరువాత పురుషుడే ఎందుకు బాధ్యత వహించాలి?

10) పెండ్లి అనునది ఆనందమా? వ్యాపారమా? అవసరమా? బాధ్యతా?

ఇన్ని ప్రశ్నలు వేసుకుని ఈ సమాజంలో జీవించలేము, అందరితో పాటు మనము కూడా నడవాలి అంటుంటారు. అలా అజ్ఞానంగా ఎందుకు, ఎవరికోసం బ్రతకాలి? మనము ఎవరికి భయపడాలి? మనలని పోషించు వాడు ఎవడు? పెంచువాడు ఎవడు? చివరకు మనప్రాణం తీయువాడు ఏవడో వాడికి కదా మనము భయపడాలి. సరే అర్థము చూద్దాం! పెండ్లి అనగా మన తెలుగు డిక్షనరీలో బ్రహ్మము, దైవము అను అర్థము కలదు. పెండ్లి అనగా దేవుడు అని పెండ్లికుమారుడు అనగా దేవుని కుమారుడు అని అర్థము.

పెండ్లి కుమార్తె అనగా ఎవరు? ఒక ఉదాహరణ చూద్దాం! ఒక పొలమును వ్యవసాయమునకు అనుకూలముగా చేసి దానిలో గింజలు నాటి పంటను పండించిన వాడు గొప్పవాడు, వాడికి ఎలా పండించాలో తెలుసు కాబట్టి ఏ ప్రదేశంలోనైనా వాడు పంటను పండించగలడు. ఇక్కడ రెండు పనివిధానాలు ఉన్నాయి. ఒకటి వ్యవసాయదారుడు, రెండు పొలము. ఈ రెండు కనిపించునవి.

అయితే సృష్టికర్త ఈ రెండు మనకు ఇచ్చాడు కావున ఇప్పుడు మనచేతిలో ఉన్నది కేవలము ఇచ్చినవాటిని ఉపయోగించి సరైన ఉత్పత్తి చేయడమే. మంచిపంట పండించడమే. భూమిని స్త్రీగా, వ్యవసాయదారుని పురుషునిగా తీసుకుందాం! నేలను వాడని యెడల ఎండిపోయి బీడువాడును. వ్యవసాయము చేయని యెడల రైతు ఆకలితో చనిపోవును. కాబట్టి పని ఖచ్చితంగా జరిగితీరాలి. ఈ రెండు ఒకటి అయితేనే జీవనం.

వాక్యము ప్రకారము పెండ్లి అనగా దేవుడు, పెండ్లికుమారుడు అనగా దేవుని కుమారుడు పెండ్లికూతురు అనగా శరీరము (జీవుడు) అని అర్థము చేసుకోవాలి.

ఆత్మ నడిపించువాడు, శరీరము (జీవాత్మ) అనుభవించునది. అయితే ఈ రెండు వ్యతిరేఖంగా ఉన్నాయి. కాబట్టి మనలో మనకే యుద్ధము. శరీరమునకు (జీవునకు) సంబంధించిన విషయము మనకు తెలుసు, పరిశుద్ధాత్మకు సంబంధించిన వ్యవసాయమును ఆత్మ నేర్చుకొని శరీరమును సాగుచేసిన ఈ రెండింటి కలయికే మోక్షము అను ఫలము.

భూమి మీద వివాహము అనగా కలయిక అని అర్థము. శరీరము పాపమునకు గుర్తు, ఒక శరీరము ఇంకొక శరీరము కలిసిన అదియూ పాపమే. దాని సంతానము కూడా పాపమే అని అర్థమవుతుంది. ఇది కొంతమంది ఒప్పుకునే పరిస్థితులలో లేరు అయినా సరే దేవుని జ్ఞానము ఎలా ఉందో చూద్దాం! వివాహానికి ముందు దేవుని జ్ఞానమును చెప్పుటకు జ్ఞానము తెలిసిన గురువు, లేదా పాస్టర్ ద్వారా పూర్తి వివరము అమ్మాయి అబ్బాయి తెలుసుకుని ఆత్మమూలముగ జీవించేదము అని వారికి పుట్టు సంతానమునకు కూడ జ్ఞానమును చెప్పి వారిని జ్ఞానమార్గములో

నడిపించెదము అని నిర్ణయం తీసుకుని జీవించిన అది నిజమైన వివాహము. ఈ వివరము తెలియక ఒక్కటైన దంపతులు వ్యభిచారము చెసినట్లే, పుట్టే సంతానం కూడ పాపమునకు సంబంధించినదే. మనకు పూర్వము మన ఇందూ సంప్రదాయాలలో కేవలం దేవుని జ్ఞానం చెప్పుటకు మాత్రమే ఉపదేశము, ఉపనయనము, పెండ్లి, తాలిబొట్టు, బుగ్గచుక్క కాళ్ళకు పారాణి, భాషింగం, ఉంగరములు, మెట్టెలు, ఇలా ఒక గుర్తుకు దేవుని జ్ఞానము అడ్డుపెట్టి నిత్యము గుర్తుండు విధంగా అవి గుర్తు చేయువిధంగా ఉండెడిది.

ముందుగా మనము మూడు భాగాలుగ ఉన్నాము 1) జీవాత్మ 2) ఆత్మ 3) పరమాత్మ అని అర్థమవుతుంది.

**వాక్య వివరము చూద్దాం!**

పెండ్లికుమార్తె గలవాడు పెండ్లికుమారుడు. పెండ్లి కుమార్తె అనగా సజీవ శరీరము, పెండ్లికుమారుడు అనగా పరమాత్మ మరియు స్నేహితుడు అనగా మనలో ఉన్న ఆత్మ అని అర్థము చేసుకోవాలి. పెండ్లి కుమారుని స్వరము అనగా దేవుని జ్ఞానము వినెడి స్నేహితుడు అనగా ఆత్మ అని అర్థము. ఈ నా సంతోషము పరిపూర్ణమైనది యోహానుగారికి దేవుని స్వరముతో ఆయన సంతోషము పరిపూర్ణమైనది అనగా పరలోక రాజ్య అర్హతతోపాటు ఈ లోక విడుదలకు సమయం దగ్గరయినందున ఆయన మిక్కిలి సంతోషించుచున్నాడు. ఆయన హెచ్చవలసి ఉన్నది.

దేవుని జ్ఞానము దేవుడు తప్ప మరెవరూ చెప్పరు, కావున ఆయన చెప్పవలసియున్నది నేను వినవలసియున్నది అని అర్థము. ఆయన గద్దించవలసి యున్నది మనము భయపడవలసియున్నది. ఆయన నేర్ప వలసియున్నది. మనము పాటించవలసియున్నది.

**(యోహాను, 4-23, 24) యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చేయున్నది. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను.**

"యదార్థము" అనగా ఖచ్చితమైనది. యదార్థము కానిది "అధర్మము" అని అర్థము.

ఒక ఉదాహరణ చూద్దాం! మనకు తల్లి కనబడుతుంది. అదే విధంగా మన తండ్రిని గుర్తించటానికి మనకు కొంత సమయము పడుతుంది. తరువాత ఊహ తెలిసిన తరువాత మనతల్లి తండ్రిని పరిచయం చేస్తుంది. ఇది మనము చూస్తున్న సత్యము.

**కొన్ని ప్రశ్నలు వేసుకుందాం!**

1) మనలను కన్నతండ్రి మనతల్లిని మోసం చేసాడు అనుకో, అప్పుడు మన తల్లి మనకు ఏమి చెప్తుంది?

2) మనతల్లి మనము పుట్టిన తరువాత చనిపోయినది, మన తండ్రి ఇతడే అని ఖచ్చితంగా ఎవరు చెప్తారు?

3) ఊహ తెలిసిన దగ్గరనుండి నేను అనాథశరణాలయములో పెరిగాను అక్కడ నన్ను పోషించువారు నీవు చెత్తకుప్పలో దొరికావు అని చెప్పారు. నాకు నా తల్లిదండ్రులు ఎవరో ఎవరు చెప్తారు?

4) నా తల్లి నాకు అబద్ధం చెప్పి బ్రతికున్న నా తండ్రిని చనిపోయాడు అని చెప్పింది అనుకో, ఆ రహస్యం ఎలా తెలుసుకోవడం?

5) ఎవరికో పుట్టిన నన్ను ఎవరో ఒకరు పెంచుకుని మేమే మీ

తల్లిదండ్రులము అని చెప్పారు అనుకోండి నిజమైన తల్లిదండ్రులను ఎలా తెలుసుకోవడం?

6) హాస్పిటల్‌లో బిడ్డను ఒకరి సంతానం ఒకరి మార్పు జరిగిన, అది ఎలా జరిగిందో ఎవరిబిడ్డ ఎవరిదో ఎలా నిర్ధారించుకోవడం?

7) డి.ఎన్.ఎ టెస్ట్ చేస్తే తెలుస్తుంది కదా! అనుకోవచ్చు అది మిషన్ అది తప్పుచెప్పి నీ సొంత కొడుకునే నీ కొడుకు కాదు అంటే అప్పుడు ఏం చేస్తాము?

ఈ ప్రశ్నలన్నీ వేసుకుంటే మన పుట్టుకలో మనకు సరైన యదార్థత లేదు. భూమి మీద కనిపించు మనకే స్పష్టత లేదు, ఇక కనిపించని దేవుని ఎలా గుర్తించడం, ఆరాధించడం?

అందుకే దేవుడు ఏమంటున్నాడు అంటే దేవున్ని చేరటానికి ఎన్ని మార్గాలున్నాయి? అవి ఏవి? వాటిని పూర్తిగా జాగ్రత్తగా పరిశీలించిన మనము యదార్థమార్గములో ఉన్నామా? లేదా? అని అర్థమవుతుంది? అని చెప్పుచున్నాడు.

**1) జ్ఞానమార్గము 2) క్రియ (పని) మార్గము 3) భక్తిమార్గము**

ఈ మూడు మార్గాలు బాగా గుర్తుంచుకోండి మనలను ఎవరూ మోసము చేయకుండా, మనము మోసపోకుండా సరైన గురి కలిగి యదార్థవంతుడైన దేవుడిని ఆరాధించగలము.

## జ్ఞానమార్గము

**ముందుగా కొంత వివరము చెప్పుకుందాము.**

1) మొదటి వాక్యము దేవునికి రూపములేదు అని అనుకున్నాము. ఇది శాసనము ఎప్పటికీ గుర్తుంచుకోవాలి.

2) రెండవది ఆయన మూలముగా సమస్తము కలిగినది, కావున ఆయన మూలముగ కలిగినదానిని మనము ఆరాధించకూడదు.

3) దేవుడు చెప్పిన విషయములను తప్ప మరేదీ కూడ నీవు నమ్మవద్దు. ఈ మూడు సూత్రములను గుర్తుపెట్టుకున్నవాడు జ్ఞాని అనవచ్చును.

జ్ఞానమార్గము అంటే ఏమిటి? దీనికి జవాబు ఏమనగా! ప్రపంచ జ్ఞానము జ్ఞానము కాదు, పరమాత్మ జ్ఞానము మాత్రమే జ్ఞానము అని అనాలి. ముందుగా మనము ఎలా ఉన్నామో తెలుసుకోవాలి. మనము ఎన్ని భాగాలుగా ఉన్నామో, ఏది ఎప్పుడు ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలి. దేవుడు చెప్పిన ఒక వాక్యమును పరిశోధించి పరిశీలించి అన్వయించి చూచుకోని సత్యమని నమ్మకం వచ్చిన తరువాత అప్పుడు దానిని విశ్వసించు. అట్లు విశ్వసించి నిత్యము ఆయన చేసిన కార్యములను గొప్పగా చెప్పుచూ, వాటిని అర్థము చేసుకుంటూ నిరంతరము విద్యార్థిగా ఉన్న వ్యక్తినే 'జ్ఞాని' అంటాము. ఇప్పుడు దేవుడు **"మూడు ఆత్మలు"** అను సూత్రమును వదిలి వెళ్ళాడు దాని గురించి కొంత చూద్దాం!

### పరమాత్మ + ఆత్మ + జీవాత్మ (963)

పరమాత్మ కంటికి కనిపించడు, ఆత్మకూడా కంటికి కనిపించదు కానీ శరీరము కనిపిస్తుంది. అంటే సూత్రము ఏమిటి? కంటికి కనిపించని

వాడు కనిపించు మనలను నడిపించుచున్నాడు. అందువలన మనము ఏమి చేయాలి అంటే, కనిపించని వాడిని కనిపించని విధానంతోనే ఆరాధించాలి. ఇది గుర్తుంచుకున్నవాడు సరైన మార్గములో ఉన్నట్టే.

దేవుడు చెప్పాడు అని భోదకుడు తప్పుచెప్పితే మోసపోకుండా ఉండడానికి మూడు ఆత్మల ఈ సూత్రమును గట్టిగ పట్టుకున్నవాడిని ఎవడూ మోసం చేయలేడు. బోధకుడు నన్ను దేవుడు పంపించాడు నా మాట వినండి, నన్ను ఆరాధించండి అని చెప్పినా, లేదా విగ్రహమును చూపించి దీనికి బలులు ఇవ్వండి కానుకలు ఇవ్వండి అని చెప్పినా లేదా ఈ వ్రతం చేయండి, ఈ స్తోత్రం చదవండి అని చెప్పినా పైన చెప్పిన ఆ మూడుకి ఇవి విరుద్ధంగా ఉన్నాయి అని అర్థమవుతుంది కదా! అప్పుడు బోధకుడు చెప్పిన వాటిని చేయకండి అంతే.

జ్ఞాని అయిన వాడు "స్వార్థము" కలిగి ఉంటాడు. స్వా+అర్థము అని వివరము. 'స్వా' అనగా సొంతం అనీ 'అర్థము' అనగా ధనము అనీ, ధనము అనిన పరమాత్మ జ్ఞానము అని అర్థము చేసుకోవాలి. వాడు ప్రపంచ ధనమును ఆశించడు, శుభ్రముగా లేకపోయినా, బట్టలు లేకపోయినా, వాడు దేవుని దృష్టిలో పూర్తి జ్ఞాని అని అనవచ్చును. ప్రత్యేక వేషధారణ అసలు ఉండదు. జ్ఞాని గుర్తింపబడకుండ ఉండవచ్చును.

ఏ పని చేసినా దేవుని గురించిన ఆలోచనలే ఉంటాయి. నిత్యము దేవునితో కూడుకుని ఉంటాడు. లోకములో వీళ్ళు కొంత పిచ్చివాళ్ళలాగా కనిపించవచ్చును అయిననూ పట్టువిడవక వీరు మోక్షము పొందువరకు శ్రమిస్తూనే ఉంటారు. ఒక వేళ రాజు హోదాలో ఉన్నప్పటికి దేవుని జ్ఞానము తెలిసి రాజ్యభారము మోయుచూనే వీరు నీతిమంతులుగ ఉంటారు. కాబట్టి కంటికి కనిపించని ఆత్మతో లీనమైఉంటారు.

జ్ఞానమార్గము పాటించిన వారికి పాపము క్షమింపబడి త్వరగా పరమాత్మను చేరుకుంటారు.

## నీతి, పని లేదా క్రియా మార్గము

బుద్ధి పలుచగనుండి జ్ఞానమార్గమును అభ్యసించవచ్చును. అట్లు కాని యెడల నీతినియమాలు కలిగిన పనులు చేయుచు దేవున్ని చేరుకోవచ్చును.

ఈ మార్గము వెనుక రహస్యము చూద్దాం! పాపము చేయుప్రతివాడు మోక్షమును పొందదు. పాపము చేయుప్రతివాడు దానిని అనుభవించక తప్పదు. ఇది దేవుని సూత్రము.

ఈ యొక్క సూత్రము ప్రకారము మనము గతంలో పాపము చేసియున్నాము, కావున దానిని ఇప్పుడు అనుభవించుచున్నాము. ఈ అనుభవించు సమయంలో మరికొంత పాపము చేస్తేకదా మళ్ళీ దానిని అనుభవిస్తాము, కాబట్టి ఆ పాపము చేయకుండా జాగ్రత్త పడటమే ఈ నీతిమార్గము.

**దేవుడు చెప్పిన నీతి మార్గములు ఏమిటి చూద్దాం!**

1) దొంగతనము చేయకు , వ్యభిచారము చేయకు (ఆలోచన కూడా చేయవద్దు)

2) నరహత్య చేయకు, అబద్ధమాడకు, ఆశపడకు, కలత చెందకు, మంచిచెడులకు స్పందించకు.

3) నీ మనస్సు చెప్పినట్లు కాకుండా ఫలితము ఆశింపక పనిచేయి.

4) మూర్ఖుడు తనకు ఇష్టమున్న పని చేయును. నీవు ఏ పనినైనా ఇష్టముగ చేయుము.

5) మూర్ఖుడికి ఫలితము మీద ఆశ ఉండును. నీకు ఉండకూడదు.

6) ఏ పనిని ఉద్దేశపూర్వకముగా మొదలుపెట్టరాదు.

7) ఏ పని చేసిన లేదా నీకు ఏ నష్టము జరిగినా అంతా దేవుని చిత్తం అని వదిలేయాలి.

8) సంతోషము వచ్చినప్పుడు పొంగిపోకుండా, నష్టం వచ్చినప్పుడు చింతింపక యుండవలెను.

9) కోపము, రాగద్వేషములు వదిలి జీవింపవలయును.

10) శ్రద్ధతో అసూయ లేకుండా దీనిని పాటించాలి. ఇలా నియమాలు కలిగియుండాలి. ఇవన్నీ మనిషికి సాధ్యమేనా? అని అనుకోవచ్చును. మనము మనుషులము రోబోలము కాదు, ఇలాంటివి అన్నీ ఎవరైన చేయగలరా? అని ప్రతి ఒక్కరికి అనిపిస్తున్నది.

మరి ఇరుకు ద్వారము అనగా ఏమనుకుంటున్నాము. మోక్షము పొందుట అంత సులువా?

ఒక గీత గీసుకుని మనము దాని ప్రకారమే నడుచుకోవాలి. భూమి సూర్యుని చుట్టు ఎలా ఒక నియమము ప్రకారము ప్రయాణిస్తుందో, అదే విధంగా మనము కూడ నీతి అను గీత మీద ప్రయాణం సాగించాలి. బాగా కష్టమైన పద్ధతి కదా!

ఒక ఉదాహరణ చూద్దాం! ఔరంగజేబు ఇతను ముస్లీం రాజు, ఇతడు దేవుని జ్ఞానము తెలుసుకుని ఈ నీతిమార్గమును పాటించియున్నాడు. ఎలా

అనగా! ఒక ప్రత్యక్ష విషయమును గమనించితే ఔరంగజేబు ప్రజల సొమ్మును నేను నా జీవనోపాధికి ఉపయోగించిన యెడల నాకు పాపము వచ్చునని తలచి, అతడు టోపీలను స్వయంగా తయారు చేసి వాటిని పనివారికిచ్చి అమ్మించి, వాటి ద్వారా వచ్చిన ధనముద్వారా తను జీవించెడివాడు. బయటికి రాజు అయినప్పటికీ తనకు పాపము అంటని విధానము తెలుసుకుని జీవించాడు. ఏ వృత్తిలో ఉన్న ఈ విధానం పాటించవచ్చును. ఇప్పుడు కొందరు కేవలము ప్రజల డబ్బుకోసవే ఆశతో పదవుల కోసం ప్రాకులాడుతున్నారు.

ఇది చేతకానియెడల భక్తిమార్గమును పాటించవచ్చును.

## భక్తి మార్గము

ఇప్పుడు ప్రపంచమంతా దీని చుట్టూ తిరుగుచున్నది. ఇది పాటిస్తున్నారు. కాని ఎంతవరకు నిజమైన భక్తిమార్గములోనున్నారు? అని చూద్దాం! మన భారతదేశమును తీసుకుందాం! ఇక్కడ కుక్క నుండి పందివరకు, మనిషి నుండి రాక్షసుని వరకు, లింగభేదము లేకుండా అందరినీ ఆరాధిస్తున్నాము. భక్తి అందరికి చాలా పెద్ద సమస్యగా మారింది, అందరు భక్తిమార్గములో చేరి చిందరవందర చేసి మనిషిని అయోమయంలో పడవేయుచున్నారు. వేషధారులు, కపటులు, బిక్షగాళ్ళు, వ్యాపార అభివృద్ధికి, సంఘగౌరవానికి పాల్పడుచున్నారు. చెప్పుకుంటూ పోతే... అంతులేదు. నిజమైన భక్తి మార్గము ఏది?

1) బైబిల్‌లో క్రీస్తు ఒక్కడే దేవుడు

2) ఖురాన్‌లో అల్లా ఒక్కడే దేవుడు అని ఉంది, మరి మనదేశంలో

కూడా దేవుడు ఒక్కడే అని చెప్పాలి. ఎందుకంటే దేవుడు అబద్ధము లాడువాడు కాదు.

మనుషుల మాటలు కట్టిపెట్టి భగవద్గీతలో ఏమి చెప్పాడో చూద్దాం.

3) రాజవిద్య రాజగుహ్యయోగము లో 25వశ్లో॥ "దేవతా పూజ చేయువారు దేవతలందే చేరుదురు. పితృదేవతలను పూజించువారు వారియందే చేరుదురు. భూతముల పూజించువారు భూతములందే చేరుదురు. నన్ను (పరమాత్మ) పూజించువారు నాయందే చేరుదురు" అని దేవుడు చెప్పాడు.

దీనినిబట్టి భక్తిమార్గములో చాలా జాగ్రత్తగా ఉండాలి అని అర్థమవుతుంది. యేసుఒక్కడే అతనికి రూపంలేదు. అల్లా ఒక్కడే అతనికి రూపంలేదు. అలాగే ఇందూమతంలో పరమాత్మ ఒక్కడే అతనికి రూపం లేదు. భగవద్గీతలో చెప్పిన ఈ శ్లోకము ఎందుకు తీసుకున్నాము అంటే, దారితప్పితే ఆ దారిలోనున్న కొన్ని మాయరూపములు మిమ్మల్ని పట్టుకుని అటువైపునకే తీసుకుని వెళ్ళి వాటిసొంతం చేసుకుంటాయి. వీటికి వేరుగనున్న నన్ను (పరమాత్మ) పూజించువారు నన్ను చేరుదురు అని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది ఇందువులమైన మనము చదివితే వారు కూడా నిరాకారముకలిగిన దేవున్ని గుర్తిస్తారు అని చెప్పడంకోసమే 5000సం॥ల క్రితము భగవద్గీతలో చెప్పిన విషయములు ఇంకనూ గ్రహింపక గ్రుడ్డివారమై ఉన్నాము. అన్ని మతముల వారికి ముఖ్యముగ చెప్పునది ఏమనగా! గ్రంథము తీసి చదవండి! మనుషుల మాటలు నమ్మవద్దు. ప్రశ్నవేయండి, సమాధానం వెదకండి, మనిషిని చూసి మనిషి భయపడకూడదు, అది పాపము. దేవునికి భయపడాలి ఇది న్యాయము. సరే ఇప్పుడు బైబిల్ ప్రకారము భక్తిమార్గము చూద్దాం!

1) నీవు గదిలోనికి వెళ్ళి రహస్యమందున్న నీ తండ్రికి కనబడవలెనని ప్రార్థన చేయుడి.

2) ఉపవాసప్రార్థనలు అందరికీ కనబడకుండునట్లు జాగ్రత్తపడుము.

3) పూర్ణఆత్మతోను, పూర్ణమనస్సుతోను ప్రార్థన చేయుము. ఒక వేళ చర్చిలో అందరూ ఉంటారు కాబట్టి చర్చికి వెళ్ళి పాటలతోనూ, ప్రార్థనలతోనూ దేవుని స్తుతించండి. మీ మనస్సులో ఏ ఆకారమును ఊహింపక ప్రార్థన చేయండి. చర్చి అనునది అందరూ ప్రార్థించు స్థలము కావున దాని బాధ్యత మన స్థోమతబట్టి తీసుకోవడం న్యాయమే. ఫాదర్, బోధకుడు, తండ్రి, గురువు అని ఎవరినీ పేరు పెట్టవద్దు. ఇది తండ్రి ఆజ్ఞ. మనము మన పని చేసుకుంటూ దేవుడి సేవ చేయడము సరైన మార్గము. దేవుడు పేరు చెప్పి డబ్బు సంపాదించడము పాపము. నిస్వార్థముగా ఏమీ ఆశింపక , వేషధారణ లేకుండా, కేవలము దేవుని జ్ఞానము చెప్పుటయే ఉద్దేశ్యముగా దేవుని ప్రచారము చేయవచ్చును. ఇది కూడా దేవుని సేవయే, ఇది భక్తి మార్గమే. చాలా జాగ్రత్తగా సత్యముతోను, ఆత్మతోను ప్రార్థన చేయవలెను.

## ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రి, మీ నామము పూజింప బడునుగాక, మీ రాజ్యము వచ్చునుగాక, మీ చిత్తము పరలోకమందు నెరవేరినట్లు, భూమియందు నెరవేరునుగాక, మా ఋణస్తులను మేము క్షమించినట్లు, మా పాపములను మీరు క్షమించండి, మమ్ము శోధనలోకి ప్రవేశింపనీయక మమ్ము రక్షించండి ఆమెన్. ప్రతి ఒక్కరూ ఇలా ప్రార్థించవచ్చును.

## ప్రార్థనా విధానములు



పరమాత్మ యెహోవా అల్లాహ్

ప్రార్థన ఎన్ని రకాలుగా ఉన్నా మన మనస్సు, బుద్ధి అంతయూ రెండు కనుబొమ్మల మధ్యన (సహస్రారచక్రమున) ఆత్మనివాసముండు స్థలములో కేంద్రీకరించి ప్రార్థన చేయాలి.

## ప్రార్థనలో ఏమి జరుగుతుంది?

ఆత్మ నివాసముండుచోట ధ్యాస నిలిపిన, లేదా ప్రార్థనలో ఏ ఆలోచనలు లేకుండా కేవలం పరమాత్మను కేంద్రముగా చేసిన, ప్రార్థనా తీవ్రతను బట్టి వారి వారి పాపములు కాల్చబడుతాయి. దీనికోసం ముందుగా ప్రార్థన ఎలా చేయాలో తెలుసుకొని, ఆ తరువాత ఎవరికి అనుకూలమైన రీతిలో వారు ప్రార్థన చేయవచ్చును.

ఉదాహరణ : మనము నిత్యము చూస్తున్న ఎండను మనము ఉపయోగించు కోలేము. అవి కిరణాల రూపంలో ఉన్నా వాటిని మనము పట్టుకోలేము. అదే ఒక భూతద్దం ద్వారా ఆ కిరణములను కేంద్రీకరించి కొద్దిసేపు ఉంచిన అది అగ్నిగా మారి మొత్తం అడవినే తగులబెట్టగలదు.



అదే విధంగా మనము నిత్యము అస్తవ్యస్తమైన జీవితం గడుపుతూ సూక్ష్మంగా సంపాదించు పాపమును తిరిగి ప్రార్థనా రూపంలో దానిని విశ్వశక్తిద్వారా కాల్చుకోవటమే కాక, నిత్యము మనము ఉల్లాసంగా, అన్ని నాడులు శక్తివంతమై పూర్తి ఆరోగ్యకరమైన జీవితమును జీవించవచ్చును.

నిత్యము ప్రార్థన చేయుటవలన అన్ని చికాకులు, సమస్యలు తొలగి మంచి ఆలోచనలతో, మన జీవితం సుఖమయం చేసుకోవటమే కాక పరమాత్మను చేరుకొను అర్హతను కూడా పొందుతాము.

**(యోహాను, 4-35) ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే తెల్లబారి కోతకు వచ్చియున్నవని మీతో చెప్పుచున్నాను.**

పొలము అనగా శరీరము మనుషులు దేవుని మార్గమును (జ్ఞానము) తెలుసుకొనుటకు సమయము వచ్చియున్నది.

**(యోహాను, 4-36) విత్తువాడును కోయువాడును కూడా సంతోషించునట్లు, కోయువాడు జీతము పుచ్చుకొని నిత్య జీవార్థమైన ఫలము సమకూర్చు కొనుచున్నాడు.**

తలలో జ్ఞానమును విత్తువాడు బోధకుడు (యేసు): పొలములో పంట విత్తువాడు రైతు, ప్రజలకు జ్ఞానము చెప్పువాడు బోధకుడు(యేసు) కోయువాడు అనగా విత్తబడిన పొలమును కోయువాడు జీవుడు. జీతము అనగా పరలోక రాజ్య అర్హత సంపాదించుకుంటున్నాడు.

కొంత అర్థముకాకున్నది కావున ఉదాహరణ చూద్దాం. మనకు మన తండ్రి ధనమును ఇవ్వక కేవలం కుండలు చేయడం నేర్పించి వెళ్ళాడు అనుకోండి. నేర్చుకున్న విద్యను ఉపయోగించి తాను కుండలను తయారు చేసి దానిని అమ్మి తన జీవితం గడుపుతాడు. ఇక్కడ తండ్రి ఆస్థి ఏమీ ఇవ్వలేదు. కేవలము పనిని నేర్పించాడు. అయినా దానిఫలితము కనబడుచున్నది.

అలాగే దేవుడు పరలోక రాజ్య అర్హతకు సంబంధించిన ఒక మార్గమును చూపించాడు ఆయన పని అయిపోయింది. ఇప్పుడు మార్గము తెలుసుకున్నాము దీనిని పాటిస్తే కదా ఫలితము పొందేది. పాటిస్తున్న కొలదీ కొద్దికొద్దిగా నీ జీతము (దాచుకొను పరలోకరాజ్య ధనము) పెరుగుచున్నది. అలాగే ఇది ఖర్చుకాదు కనుగ ధనము ఎప్పటికీ నిలిచియుండును. దేవుని మార్గము తెలుసుకొని దానిని పాటించని యెడల ఎవరికీ ఏమీ ఉపయోగ ముండదు.

**ఇప్పుడు ఒక ప్రశ్నవేసుకుందాం!**

అసలు పరలోకరాజ్యమెందుకు? అది ఎక్కడుంది? అది ఎలా ఉంటుంది? నాకు కనిపించడం లేదుకదా? అన్నది ప్రశ్న అనుకుందాము.

ఆ ధనము ఏదో, ఈ లోకములో ఇస్తే షాపింగ్‌లు, కార్లు , బంగళాలు, బోలెడంత అనుభవించ వచ్చును కదా! ఇవన్నీ వదలి ఆయనను (దేవున్ని) ఘనపరచుట లేదా ప్రార్థన చేయుట ఎందుకు? ఇదంతా పనికిమాలిన పని అని అనువారు ఉన్నారు? భక్తి మార్గములో ఉన్నవారిని వింతగా చూచువారున్నారు.

కేవలము నరులు శ్రమానుభవం కొరకే పుట్టుచున్నారు అని యోబు అన్నారు. ఇది పరీక్ష కాలము. ఇది ఆట సమయము. ఒక ఉదాహరణ చూద్దాం. క్రికెట్ ఆటను తీసుకోండి ఆట ఆడువారికి జీతమిచ్చి, భోజనంపెట్టి అలాగే ఒక హోదాకలిగించితే, అందరూ ఆ ఆటలో ఏమి కోరుకుంటారు? మన భారతజట్టు గెలవడమే కదా! ఓడిపోతే ఏమంటాము, మన పరువు తీసారు అని అంటాము. గెలిచినా ఓడినా ఆట ముగిసిన వెంటనే ఇంటికి వెళ్తారు.

కానీ దేవుని రాజ్యములో గెలిచిన తరువాతనే అర్హత, అప్పటివరకు నిన్ను పోషిస్తాడు, నిన్ను ఆటాడిస్తాడు. సమస్తమునకు ఆయనే అధిపతి, అన్నియూ ఆయనే ఇస్తాడు. ఆయన రాజ్యంలో ఉంటూ ఆయనకు గౌరవమీయలేని వారిని ఆయన అదే విధంగా వ్యతిరేఖంగా చూస్తాడు. నమ్మి ఆరాధించువాడు ఆట ఆడుతాడు, గెలుస్తాడు. వీరుడిగా పరలోక రాజ్యము అను తన సొంత ఇంటికి వెళ్తాడు.

**(యోహాను, 5-28, 29) ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్ధము విని మేలుచేసినవారు జీవపునరుత్థానమున కును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు.**

చనిపోయిన వారు యేసుక్రీస్తు వచ్చేవరకు సమాధులలో ఉంటారు అని క్రైస్తవుల గట్టి నమ్మకం. ఈ నమ్మకం కలిగించింది ఎవరు? బైబిల్ వాక్యము చదివి చెప్పిన ఒక వ్యక్తి అయి ఉంటాడు. వ్యక్తి మాటలను మనము నమ్మాము గానీ బైబిల్ చదవడం లేదు. ఇది ఒక ఆచారంలా పాటిస్తూ సమాధుల పండుగ అని కూడా చేసుకుంటున్నాము. ఎవడు ఏది చెప్పితే అది నమ్మడం మానేయాలి. అది నిజమా కాదా? అని చదివి మనము అర్థము చేసుకోవాలి.

**కొన్ని ప్రశ్నలు వేసుకుందాం!**

1) మనిషి చనిపోయిన తరువాత, అది నిర్ధారించుకున్న తరువాత అప్పుడు శవాన్ని సమాధి చేస్తాము అప్పుడు మనిషి ఆత్మ శవంతో పాటు నడిచి వెళ్ళి తీసిన గొయ్యిలో ముందుగా పడుకుంటే శవం దాని మీద పెట్టితే అది కొన్ని వేల సంవత్సరాల వరకు అలా సమాధులలోనే ఉంటుందా?

2) మరి సమాధి చేయని శవాల పరిస్థితి ఏమిటి?

3) మెడికల్ స్టూడెంట్స్ శవాలనుకోసి ప్రాక్టీస్ చేస్తున్నారు. దేవుడు వచ్చిన తరువాత అవి తిరిగి లేస్తాయా?

4) తిరిగి లేస్తాయి అన్న మాట నిజమైతే ఈజిప్టు మమ్మీలలాగా మనము కూగా శవమునకు గుడ్డలు చుట్టి శవమును ఎందుకు జాగ్రత్త చేయడం లేదు? చెప్పుడు మాటలు వినకండి. రోజూ కొంత బైబిల్ చదవండి మనమీద మనకు శ్రద్ధకలిగి దేవుని జ్ఞానము తెలుసుకొనే ప్రయత్నము చేద్దాం! ఎవరినీ గొప్పగా ఊహించుకోకండి! ఎవరినీ ఆదర్శంగా తీసుకోవద్దు. దేవునిని కేంద్రముగా చేసుకుని మనము ఆయన ఇచ్చిన జ్ఞానము ప్రకారము నడుచుకుందాం.

1) పొలము 2) పల్లెము 3) గిన్నె 4) ఆలయము 5) గుడారము 6) సమాధి 7) సిలువ అన్న అన్ని పదములు మనము, మన శరీరము అని అర్థము. దేవుని మీద శ్రద్ధ ఉన్నవాడు మాత్రమే గ్రహించు విధంగా ఇలా ప్రపంచ జ్ఞానముతో కలిపి పరమాత్మ జ్ఞానము అర్థము వచ్చు విధంగా తను (దేవుడు) మాట్లాడటం జరిగింది. వీటిని పోల్చిచూచువాని యొక్క భావమును బట్టియే వాడికి జ్ఞానము ఉన్నది లేనిది తెలియును.

మనకు గత జన్మలు ఉన్నాయి అని యోబు వాక్యములను బట్టి తెలిసింది. కానీ చనిపోయిన తరువాత ఎలా జన్మ తీసుకుంటామో తెలియదు. అది బైబిల్‌లో ఎక్కడా చెప్పబడలేదు అంటారు. మనుషుల మాటలు వదిలేసి దేవుని వాక్యము చూద్దాం.

**"ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను. మనమందరము నిద్రించము గానీ నిముషములో ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మన మందరము మార్పు పొందుదుము. బూరమ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందుదుము. విజయమందు మరణము మ్రింగివేయును"**

దీనిని వివరించుకుని చూద్దాం! మర్మము అనగా రహస్యము అని అర్థము. మనమందరము 'నిద్రించము' అనగా 'చనిపోము' అని అర్థము.

నిముషములో ఒక రెప్పపాటున కడబూర మ్రోగగానే అనగా చివరి శ్వాస ఆగిపోగానే మనము మార్పు పొందుదుము. అంటే వేరే ఎక్కడో జన్మించాము అని అర్థము. బూర మ్రోగును ఇది మొదటి శ్వాస, అప్పుడు మృతులు అనగా తల్లి శరీరమునుండి శవముగా నున్న శిశువు అక్షయులుగా లేపబడుదురు. క్షయము అనగా నాశనము అక్షయము అనగా నాశనము లేనిది, జీవముకలదని అర్థము. మనము మార్పుపొందుదుము. మనము జన్మించినది ఒకసారే అది భూమిమీద వచ్చిన మొదటి దినము. ఆ జన్మమునే మనము మార్పుచెందుతూ ఇప్పటి వరకూ లాగుకుంటూ వచ్చాము.

విజయమందు మరణము మ్రింగివేయును. దేవుని జ్ఞానము తెలుసు కున్న తరువాత, దేవుని రాజ్యఅర్హత పొందిన తరువాత, అప్పుడు ఈ మానవ

మరణము అను మార్పు ఆగి పోవును, అది నిజమైన మరణం అని దేవుడు చెప్పుచున్నాడు. జనన మరణ రహస్యము దేవుడు తెలియజేసాడు. దీని ప్రకారమే నడుస్తుంది. ఇందులో ఏ సందేహము లేదు.

వాక్యము ఏమి చెప్పుచున్నది అనగా! ఒక కాలము వచ్చుచున్నది. అనగా చిన్న పిల్లలు కూడా దేవుని జ్ఞానము తెలుసుకొని వివరించి చెప్పురోజు వచ్చుచున్నది. ఆ కాలమున దేవుని యెడల భయభక్తులు కలిగినవారు, ఇక్కడ ఆయన చెప్పిన మాటలను ఆచరించిన, వారు రక్షణ పొందుదురు అనీ, దేవుని జ్ఞానము నిర్లక్ష్యము చేసినవారు అంతకు అంతకు నరకప్రాయమైన జీవితం అనుభవింతురని భావము.

**దేవునికి వ్యతిరేకముగా ఉంటే ఏమి జరుగునో కొన్ని ఉదాహరణలు**

1) రోగాలతో కూడిన జీవితం

2) పూర్తిగా పాపమయంలో, భయాందోళనతో నీచజీవనం

3) బానిస బతుకులు, హత్యలు, అగమ్యగోచరమైన అస్తవ్యస్త ప్రయాణం

4) సర్పసంతాన బ్రతుకులు, వీరికి ఎప్పటికీ దేవుని జ్ఞానము అంతు చిక్కదు.

**దేవుని రాజ్యమునకు దగ్గరగా ఉన్న వ్యక్తులు**

1) సాత్వికులు 2) జ్ఞానులు 3) నిరాకార భక్తి కలిగినవారు 4) ప్రపంచ స్వార్థము లేనివారు 5) గుణరహితులు 6) ఓదార్పుకోసం ఎదురుచూచు వారు 7) భరించువారు 8) లోక ఆశ లేనివారు 9) నీతి నియమాలు కలిగి ప్రవర్తించువారు 10) దేవుని జ్ఞానము ప్రకారము

నడుచువారు వీరిలో ఒకరు ముందు ఒకరు వెనుక, అయినా తప్పకుండా దేవుని రాజ్యమును చేరి తీరుతారు అని దేవుడు స్పష్టంగా చెప్పియున్నాడు. ఒక విధంగా సేఫ్ జోన్ అన్నమాట.

పెద్దల మూర్ఖత్వానికి, అచారానికి, మీ అంతస్తులకు, ఆర్భాటాలకు పిల్లలను బలిచేయవద్దు, వారికి దేవుని జ్ఞానం చిన్నప్పటి నుండి అలవాటు చేయండి. ఇది పెద్దలు పిల్లలకు ఇచ్చు ఆస్తి.

జీవితాన్ని వృథాగా చేసుకుని వెదికి వెదికి చిందరవందరగా జీవించి చివరకు ముక్తి కొరకు ప్రాకులాడు జీవితం దేవునికిష్టములేదు. ముందునుండి జ్ఞానమును తెలుసుకుని ఈ లోకంలో కూడా సంతోషంగా జీవించవచ్చు.

**గొర్రెపిల్ల అని బైబిల్ లో ఎందుకు దేవుడు చాలాసార్లు ఉపయోగించాడు మనషులకు జ్ఞానము చెప్తూ గొర్రెపిల్లను ఎందుకు గుర్తుగా ఎన్నుకున్నాడు.**

యేసుక్రీస్తు గొర్రెపిల్లను ఎందుకు ఎన్నుకున్నారు? దేవుడు ఎప్పుడు ఏది చెప్పినా, చూపినా అందులో ఒక గూడార్థము ఉంటుంది. గొర్రెపిల్ల అమాయకపు జంతువు అయితే దాని ఉపయోగము చూచిన అది పాలు ఇస్తుంది, ఖర్చులేకుండా గడ్డితింటుంది. అలాగే దాని వెంట్రుకలు మనకు చలినుండి కాపాడుటకు ఉపయోగపడుతాయి. అలాగే చివరకు అది మాంసమై మనకు ఆహారముగా ఉపయోగపడుతుంది. ముందు గొర్రె ఎలా నడిస్తే అది అలా నడుస్తుంది. అందుకే గొర్రెలాగా బ్రతకకండి ఆలోచించండి అంటుంటారు.

అడవిలో బలమైన జంతువు ఏది అనగా! ముందుగా మనకు గుర్తుకు వచ్చేది ఏనుగు. అలాగే క్రూరమైనది ఏది అనగానే సింహము

అంటాము. ఈ రోజుల్లో సింహమునకు ఉన్న క్రేజ్ మాములుగా లేదు. అందరూ సింహములా బ్రతకాలి అంటారు. కానీ ఎందుకు అంతగా దానిని పొగుడుతున్నారో చూద్దాం. ఒక బలమైన వాడు ఒక బలహీనుడుని కొడితే అయ్యోపాపం అంటాము. అలాగే వాడు అందరినీ హింసిస్తే వాడికి భయపడి వాడు కౄరుడు, మూర్ఖుడు వాడి పాపంపండి వాడే పోతాడులే అని అంటుంటారు. అలాగే సింహం తనకన్న తక్కువ బలమున్న జంతువులను తింటుంది. దీనికి అయ్యోపాపం అనకుండా సింహమును పొగుడుచున్నారు. అది కనీసం తనగూడు కూడా నిర్మించుకోలేని అసమర్థత కలిగినది. చాలా చిన్నదైన పిట్టకూడా తన గూటిని చాలా తెలివిగా, సుందరంగా నిర్మించు కుంటుంది.

మనకు పూర్వం ఒక చిన్న కథ ఉంది, అది హిరణ్యకశిపుడు దేవునికి వ్యతిరేఖముగా ఉండుట వలన, దేవుడు నరసింహావతారము ధరించి అతన్ని సంహరించాడని కలదు. ఇందులో వాడు దేవునికి లోబడి లేడు, అందుకు పాపం సంపాదించాడు, ఆ పాపానికి బలి అయిపోయాడు. అలాగే ప్రజలు దేవున్ని మరచి విగ్రహారాధన చేయుట వలన వారు పాపం సంపాదించుకున్నారు. అందుకు వారు శిక్షార్హులై అగ్ని చేత చనిపోయారు. వారితో పాటు నీతిగా జీవించిన నోవాహు కుటుంబము వారు రక్షింపబడి నారు. ఈ రెండింటిలోనూ పాపము చేయువాడు అదే పాపముతో చనిపోవును అని తెలియుచున్నది.

దేవుడు ఎవరినీ శిక్షించడు, ఎవరినీ దండించడు ఎవరి పాపము నకు, ఎవరి నీతికి తగినట్టుగా వారి ఫలము పొందుదురు అని చెప్పారు. ఈ సూత్రము ఆధారముగా చూస్తే గొర్రెపిల్ల ఏమీ తెలియని ఒక అమాయకపు జంతువు అయిననూ అది పాపము చేసినవారివలె చంపబడుచున్నది.

ఎందుకు ఇలా జరుగుచున్నది? ఏ ఆధారము లేనివారు చులకనగా చూడబడతారు, అదే గొర్రెపిల్లకు పోషకుడు, సంరక్షకుడు ఉంటే వాటిని ఎవరూ ఏమీ చేయలేరు. సింహము బలహీనులను తింటున్నది దానికి బలహీనులే బలము. ఒక విధంగా దీనిని సాతాను లేదా మాయగా పోల్చుకోవచ్చును.

మనము కూడా అమాయకులం అందుకే అందరము చని పోతున్నాము, తిరిగి మళ్ళీ పుట్టుచున్నాము. అది బలమైన జీవితమా? నీచ జీవితమా? మనకు తెలియదు. అందుకు దేవుడు మీరు నన్ను సంరక్షకుడిగా ఎన్నుకుని నా మాటవినుచూ, నమ్ముచూ నన్ను ఆరాధించ మన్నాడు. దానివలన మీ యొక్క పాపపు దారిని మళ్ళించి నిత్యజీవనం చూపుతాను అని చెప్పాడు. ప్రతి ఒక్కరూ అమాయకులే అని సూచికగా గొర్రెపిల్లను ఎన్నుకున్నాడు. మంచి కాపరి లేనియెడల మనము మృత్యువుకు బలి కావలసిందే.

యూదాగోత్రపు సింహం అని దేవున్ని అన్నారు కదా! అంటే దేవున్ని ఎవరు దేనితోకూడా పోల్చకూడదు, ఎందుకంటే ఆయన దేనికి కూడా సరిపోని జ్ఞానము కలవాడు. ఇది పేతురు తన యొక్క ప్రపంచ జ్ఞానముతో చెప్పారు. దేవుడే నేను గొర్రెపిల్లను అని చెప్పుచుండగా, దేవుని మాటవదిలేసి వేరే వాక్యము నమ్మవద్దు.

సింహము, పాము, అలాగే అన్ని కౄరమృగములు, అగ్ని, నీరు, రోడ్‌యాక్సిడెంట్స్, రోగము, రకరకాలుగ ఉన్న ఇవన్ని కూడా ప్రాణము తీయు ఆయుధములు వీటికి ఎంతమాత్రము మనము బలికాకూడదు. సింహమును కూడా గొర్రెపిల్లగా మార్చునదియే దేవుని జ్ఞానము.

మనదేశములో పుట్టిన గౌతమబుద్ధుడు చైనా దేశమునకు వెళ్ళి అక్కడ ప్రజలకు పంచశీల సూత్రమును అలాగే దేవుని జ్ఞానమును బోధించారు. బోధిధర్ముడను మరియొక జ్ఞాని ఆ దేశమునకు వెళ్ళి ఆయుర్వేదము, ఆత్మరక్షణ విద్యను మరియు దేవుని జ్ఞానమును బోధించారు. ఈ రోజు చైనాదేశమును చూచి ప్రతి ఒక్కరూ భయపడుచున్నారు. అన్ని రంగాలలో వారు పొందిన అభివృద్ధి చెప్పలేనంతగా ఉంది. మన దగ్గరనుండి వెళ్ళిన జ్ఞానమునకు ఇప్పుడు మనమే బానిసలయి ఆ దేశం మీద ఆధారపడుతున్నాము. ఇప్పుడు ఏ వస్తువు చూచినా మేడ్ఇన్ చైనా అని ఉంటుంది. బలహీనమైన శరీరము గలవారు బలవంతులుగా మారు అపూర్వమైన జ్ఞానము వారికి అందించినవారు మన భారతీయులు. ఒక వ్యక్తి బలహీనముగ నుండి నలుగురిని ఎదుర్కొనుట అది నిజమైన బలము అనవచ్చును.  చైనా మిలటరీ, టెక్నాలజీ, వారియొక్క యూనిటీ, భక్తి, ప్రాక్టీస్, గవర్నమెంట్, అన్ని రంగాలలో వారు నేడు ముందున్నారు. అన్ని దేశాలను భయపెట్టు ఉగ్రవాద దేశాలు కూడా వారిని చూచి భయపడు తున్నవి.

మనకు మాత్రము గుడులని, గోపురములు, పూజలని, సాంప్రదాయాలు అని అలవాటు చేసి, కులం, గోత్రం అనే అంటురోగాలు అంటించారు.  పెద్దవాళ్ళు దానిని గొప్పగా చెప్పారు, అక్కడ అది గొప్పగా పోల్చబడినది. అది చేస్తే తప్పు, ఇలా ఉండాలి, ఇలానే బ్రతకాలి అని వాటికి అతుక్కుపోయి మూఢనమ్మకముతో బ్రతకవద్దు. అది ఎందుకు అలా చెప్పారు? దానిలో ఆ ప్రత్యేకత ఏమిటి? అని ఆలోచించి మేధావిలాగా నలుగురికి ఉపయోగపడుతూ ప్రశాంతమైన జీవితం గడుపుటకు ప్రయత్నం చేయాలి.

ప్రతీదీ సూక్ష్మంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. బైబిల్‌లోగాని లేదా మరేయితర గ్రంథాలలో అయినా చాలా వాక్యములు వ్రాయబడి ఉంటాయి. దానిలో దేవుని చేర్చు మార్గము గ్రహించి వాటిని పాటిస్తూ దేవుని చేరవలసియున్నది. దేవుని జ్ఞానమును గుర్తించు శ్రద్ధ మనము కలిగియుండాలి. కంటికి కనిపించని దేవున్ని అదేవిధానంతో పూజించాలి. ప్రపంచజ్ఞానము ప్రపంచములోనూ ఉపయోగపడగలదు. ఉదాహరణగా మనము ఒక చెరువులో నీరు త్రాగటానికి వెళ్ళాము త్రాగే ముందు పైనీటిని కొంత చేతులతో వేరు చేసి త్రాగుతాము. అలాగే బియ్యము తెచ్చుకుని రాళ్ళు తీసివేసి వండుకుంటాము. ఏదైనా కొనునప్పుడు ఆ వస్తువును జాగ్రత్తగా పరిశీలిస్తాము. మనతో పాటు కొన్ని రోజులుండి నాశనమవు వస్తువుల యెడల ఉన్న జాగ్రత్త మనమీద మనకు లేదు. నేడు ఎందరో దొంగబాబాలు, స్వాములు, పాస్టర్‌లు, బోధకుల మోసపూరిత మాటలు విని మనము అంతకంతకూ దేవునికి దూరం అవుచున్నాము.

**సాతాను అను మాట కూడా బైబిల్‌లో కలదు. దాని గురించి చాలా మంది చాలా రకాలుగా చెప్పడం జరుగుతుంది. అది ఏమిటి?**

నిజానికి తెలుగులో ఆ పదము లేదు. దానిని సృష్ఠించారు. బైబిల్ లో పాము గురించిన వివరము ఉంది. దాని అర్థము వచ్చు విధంగా షైతాన్ అను పదమును తెలుగులో సైతాన్ అను పదముగా మార్చి మన పెద్దలు వ్రాసియున్నారు. బైబిల్‌లో ఎన్నోచోట్ల ఈ మాటను వాడినారు కానీ ఎవరూ చూచినట్లు చెప్పడము లేదు. ఇన్ని వేల సంవత్సరములుగ కూడా ఎవరూ దీనికి సంబంధించిన వివరము చెప్పలేదు. క్రొత్త నిబంధన గ్రంథములో 'సాతానా! నన్ను శోధించకు' అను మాట కలదు. దీనికి మన

వాళ్ళు ఒకడికి నల్లబట్టలు వేసి కొమ్ములు, ఇంకా వెటకారపు నవ్వుతో సినిమాలో చూపించడం, అలాగే ఉంటాడు అని ఊహించుకోవడం జరిగింది. ఇంకా కొంతమంది దేవుని రాజ్యములోనుండి త్రోయబడినదే సాతాను, అది కూడా దేవుడి రాజ్యములో ఉండినదే అని చెప్పడం కూడా జరుగుతుంది.

అవి అన్నీ పిట్ట కథలు అని తెల్పుచూ దేవుడు (యేసు) “నా తండ్రిని నేను తప్ప ఎవరూ చూడలేదు” అని ఒకేఒక్క మాట చెప్పాడు. అంతే కాకుండా ‘ఆదియందు వాక్యము మాత్రమే ఉండెను’ అని చెప్పాడు. అందుకే మనకు యేసే మార్గము కావున ఆయన మాటలను విశ్వసింతుము.

వేరు కొన్ని గ్రంథములను మరియు మనిషి కొన్ని నిర్మాణమును బట్టి చూసుకున్న మనకు సాతాను అర్థము తెలియవచ్చును. శరీరము మూలముగా జీవించువారు నాశనము వైపు, ఆత్మమూలముగా జీవించువారు నిత్యజీవనం వైపు నడుపబడుదురు అని యేసు చెప్పాడు. ఈ వాక్యము మనకు బలము. దీనిని వివరించుకుందాము.

**ప్రతి మనిషిలోనూ 6 చెడ్డగుణాలు 6 మంచిగుణాలు ఉన్నాయి.**

ప్రతి మనిషిలోను దాగిఉన్న ఈ గుణములు రెండు వర్గములుగ ఉన్నవి. ఒకటి దేవుని వర్గము, రెండు సాతాను వర్గము. సాతానును

| | | | |
|---|---|---|---|
| చెడు గుణములు<br>సాతాను సంబంధం<br>శరీర సంబంధం | 1) కామము<br>2) క్రోధము<br>3) లోభము<br>4) మోహము<br>5) మదము<br>6) మత్సరము | 1) దానము<br>2) దయ<br>3) ఔదార్యము<br>4) వైరాగ్యము<br>5) వినయము<br>6) ప్రేమ | మంచి గుణములు<br>దైవ సంబంధం<br>శరీర సంబంధం |

జయించుటకు దేవుడు తన గుణములలో ప్రేమను మనకు పంచి దాని ద్వారా సాతానును జయించమన్నాడు. దేవుని సంబంధులు, దానము, దయ, ఔదార్యము, వైరాగ్యము, వినయము మరియు ప్రేమ కలిగిఉంటారు, అదే సాతాను సంబంధులు కామము, క్రోధము, లోభము, మోహము, మదము మరియు మత్సరము కలిగి ఉంటారు. ఆత్మ సంబంధమైన జ్ఞానము కలిగి చెడు గుణములను జయించు శక్తిని ప్రసాదించమని మన దేవుడైన యేసుక్రీస్తును వేడుకుందాం. ఆత్మ సంబంధమైన జీవితమును జీవించుదాం!

దయ్యము లేదు భూతము లేదు. మనలో మనకు యుద్ధము నిత్యము పోరాటం, మంచిని గెలిపించుటకు మనము సిద్ధమయి ఉందాము. మనము ఓటమి పాలుకాకుండా చూచుకొందాము.

**దయ్యాలు, భూతాలు, పిశాచులు, రాక్షసులు, సాతానులు, కళ్ళదృష్టి, ప్రేతాత్మలు, చేతబడులు, మంత్రవిద్యలు ఉన్నాయా?**

ఇవి మన సంఘమును పట్టిపీడుస్తున్న మాటలు, ప్రతి ఒక్కరిలో ఉన్న అనుమానములు.

బైబిల్ చదివినవారు వీటిని ఒప్పుకుంటారా? ఖురాన్ ని చదివినవారు ఒప్పుకుంటారా? భగవద్గీతను చదివినవారు ఒప్పుకుంటారా? చాలా మంది అవును అంటారు. అందరు అవును అంటే మనము అవుననే కదా అనాలి!

ఒక కత్తిని కూరగాయలు కోసుకోవడానికి ఉపయోగిస్తాము, అలాగే అదే కత్తి ఒక జీవిని చంపడానికి ఉపయోగపడుతుంది. మంట, వంట వండుటకు, అలాగే ఇల్లు తగులబెట్టుటకు కూడా ఉపయోగించవచ్చును.

ఉపయోగమును బట్టి మంచిచెడులుండును. అది ఏదైనాకావచ్చు, కానీ ప్రతీదీ పనిచేయుటకు దేవుడు ఏర్పాటు చేసియుంచాడు అయితే ఇది పూర్తిగా సైన్స్‌కి సంబంధించినదిగా చూచుకోవాలి. కానీ దానిని గూర్చి మనసైన్స్ వివరము చెప్పలేక పోయినది కాబట్టి మళ్లీ ఈ వివరముకూడా దేవుడు చెప్పాల్సిందే. మన గ్రంథాలు ఏమి చెప్పుచున్నాయి.

**1) దయ్యాలు, భూతాలు :-** దయ్యాలు,భూతాలు ఉన్నాయి, వాస్తవం. భూతాలు అనగా పంచభూతములు, ఆకాశము, గాలి, నీరు, అగ్ని, భూమి, వీటికి భయపడాలా? లేక వివరము తెలుసుకుని వాడుకోవాలా? దయ్యము అనగా మనలో ఉన్న భయము అని అర్థము. భయము యొక్క తీవ్రతను బట్టి అది ఏ దయ్యమో మీరే చెప్పవచ్చును.

**2) పిశాచులు, రాక్షసులు, సాతానులు :-** రాక్షసుడు అనగా చెడు గుణం కలవాడు ఇది మానవుడే, సాతాను అనగా చెడు గుణములు కలవాడు ఇదియూ మనిషే. పిశాచి అనగా భూతమునకు మరొక పేరు అనుకోవచ్చు. ఇది కూడా పనిచేయు ఒక వర్గమునకు చెందినదే. నీకు పిచ్చిలేసేలా ఊరంతా పిచ్చివాడిలా తిప్పి తిరిగించు పనికి ఏర్పాటు చేసుకున్నవాడు. పాపము చేత వీడిని పొందు అర్హత నీవు పొందివుంటే వీడు ఆ సమయమునకు నీ దగ్గరకు వచ్చి ఆ పాపమును అమలు చేయు ఒక పనివాడు.

**3) కళ్ళదృష్టి :-** ఇది దేవుని జ్ఞానము కాదు ప్రపంచజ్ఞానము. దీనిని ఆకర్షణ, హిప్నాటిజం, ఎదుటి వ్యక్తిని చూచు విధానం బట్టి ఉండునది. ఉదాహరణకు అందమైన అమ్మాయిని రెప్పవాల్చకుండా చూస్తారు. ఎదుటి వారు అందంగా లేరు కాబట్టి అలా చూస్తారు. అలా ఎందుకు చూస్తారు

అని మనసులో ఒక అమ్మాయి అనుకుని రకరకాల ప్రశ్నలు వేసుకుని కొంత భయముకలిగి ఉంటుంది. అది అస్వస్థతకు గురిచేస్తుంది. సైకాలజీ చదివినవారికి దీని వివరము పూర్తిగా తెలుసు.

**4) ప్రేతాత్మలు :-** ఇది దేవుని జ్ఞానము. కనిపించు శరీరమును కనిపించని విధానము నడిపిస్తుంది అనుకున్నాము. అలాగే కనిపించునది లేకపోయినా కనిపించనిది ఉంటుంది. ఉదాహరణకు ఒకడు మరణం పొందాడు, కాని వాడు మరియొక చోట జన్మించలేదు. అప్పటివరకు కనిపించకుండా ఉండాలి. ఇది వాడు సంపాదించుకున్న పాపము ప్రకారము ఉంటుంది. వీళ్ళు బలహీనమైన శరీరములను పట్టి పీడిస్తుంటారు. ఆ పట్టిన వారు కూడ పాపసంబంధులే. అయితే వేయిమందిలో ఒకరికి కూడా ఈ స్థితి ఉండకపోవచ్చును. దేవుని జ్ఞానము తెలుసుకున్న వాడికి కనీసం వీటి ఆలోచన కూడా రాదు. వాడికి ప్రేతాత్మలు భయపడతాయి.

**5) చేతబడులు, మంత్రవిద్యలు :-** ఒక కుక్కను మచ్చిక చేసుకొనిన దానిని మంత్రము అనవచ్చు, దానిని చెడుకు ఉపయోగించితే చేతబడులు అనవచ్చు.

**6) దేవుళ్ళు, దేవతలు :-** ఉన్నారు. నీకు అన్నం పెట్టి ఆదుకున్నవాడు దేవుడు అయితే వాడు కనిపించువాడు. వాడి కోసం నువు ఏదైనా చేస్తావు. వినయంగా ఉంటావు, భయభక్తులు కలిగి ఉంటావు, అలాగే వాడిలాగా జీవించాలని ఆశకూడా ఉంటుంది. వాడిని నిన్ను కూడా పోషించువాడు ఒకడున్నాడు అని నీకు ఎప్పుడు తెలుస్తుంది అంటే వాన్ని నిన్ను కలిపి బాదినప్పుడు. ఎన్నో యాక్సిడెంట్లు, తీర్థయాత్రల పేరుతో బస్సుల దగ్ధం, దర్శన పేరుతో ప్రళయం, ఇన్ని రకాలుగ పరమాత్మను నేను ఒకడిని ఉన్నానని తెలియునట్లు చేసినా దేవుడు అంటే ఏమాత్రము భయములేకుండ

రాళ్ళకు రప్పలకు మ్రొక్కుచున్నారు. దానిని మీ దేవుడు అని అంటున్నావు. నీవు అనుభవించునప్పుడు మిమ్మల్ని రక్షించువాడు ఎవరు? దేవుని గ్రంథాలు తీసి చదవండి. రోజంతా క్యూలో నిలబడి దర్శనం బాగా జరిగింది అని పాపం మూటకట్టుకున్న విషయం తెలుసుకో. ఏ గ్రంథం ఆధారం లేకుండా మనకు మతము అను ముసుగు వేయుచున్నవారు ఇవన్నీ అలవాటు చేయు చున్నారు. మీరు ప్రశ్న వేయరా? అడుగరా? వివరము తెలుసుకోరా? నీవు సంపాదించిన రూపాయి ఎవడైనా ఇవ్వకపోతే నీకు ఎంత కోపం వస్తుంది. నీకు తెలియకుండా పాపాన్ని నీకు అంటించిన వాడి మీద నీకు కోపం రాదా?

**6) వాస్తు శాస్త్రము :-** వాస్తుశాస్త్రానికి మనిషికి ఏ సంబంధము లేదు. కుంటికాలు ఉన్నవాడు వాస్తు ఇంటిలో ఉన్నా గుడిసెలో ఉన్నా వాడి అవిటితనం పోదు. పాపము పొందిన జీవితము అనుభవించి తీరాలి. అది వాస్తువల్ల అస్సలు పోదు. దానిని సైన్స్ ఏమాత్రము ఒప్పుకోదు. వసతికొద్దీ ఇల్లు కట్టుకోవచ్చును. వసతి అనగా గాలి వెలుతురు ప్రసరించు నియమాలతో చూస్తే అది కొంత మంచిది. అంతేగానీ వాస్తు మంచిది కాదు.

**7) వ్రతాలు, పూజలు, కొబ్బరికాయలు, అగరత్తులు :-** నీవు చేసిన పాపానికి నీ దగ్గరనుండి ధనము, సమయము హరించు విధానములు అంతే. కొంత పుణ్యఫలము రావచ్చును. దీనివలన మోక్షము రాదు.

**8) అన్నదానము :-** ఇళ్ళు కట్టించడం, దానాలు, చేయడము వలన ప్రపంచ సంబంధమైన పుణ్యము రావచ్చును. దీనికి దేవుని జ్ఞానమునకు ఏ సంబంధము లేదు. ధర్మము వలన దేవుని జ్ఞానం పొందు అర్హత కలదు.

**9) అదృష్టము :-** ఇది స్పష్టత లేని మాట దేవుని విషయములో ఇది ఎంతమాత్రము లెక్కలోనికి రాదు. నీవు పుణ్యమును అనుభవించునప్పుడు ఏదో రకంగా నీకు దగ్గరవు మంచిని మనము అదృష్టము అంటాము. పాపము అనుభవించునప్పుడు ఏదోరకంగా మనకు నష్టము జరిగితే దానిని దురదృష్టము అంటాము అంతే తేడా.

**10) పూజారులు, పాస్టర్‌లు :-** దేవుని సేవకుల ఉద్దేశ్యము మంచిదైన సేవయే ఫలము అందించును. లేని యెడల పాపము పొందును. మనిషి ఎడల చేస్తే ఒకరకమైన శిక్ష, అది అనుభవించితే పోతుంది. దేవుని పేరు చెప్పి పాపము చేస్తే దానికి క్షమాపణ లేదు. ఈ యుగమందును రాబోవు యుగమందును అని యేసువారు చెప్పారు.

**11) నీచ వృత్తులు :-** వారి వారి పాపమును బట్టి వృత్తులు వారికి లభించును. జ్ఞానము ద్వారా దానిని అతిక్రమించవచ్చును.

**12) సోమరితనము :-** దేవుని జ్ఞానము ప్రకారము నడవక పోవడమే సోమరితనము. ప్రపంచపరంగా చూస్తే ప్రతివాడును పనిచేయువాడే.

13) పేరుమార్చుకుంటే ఏమి జరగదు దేవుని దృష్టిలో నీపేరుతో సంబంధము లేదు. ప్రపంచ పరంగా ఒకరినొకరు గుర్తుంచుకొనుటకు మాత్రమే పేరు. పేరునిబట్టి ఏ మతమో చెప్పవచ్చు.

దీనిని కొందరు తమ మతమునకు తగినట్టుగా మార్చుకొని వేషదారులుగా ఉన్నారు.

## (యోహాను, 6-54) యేసుక్రీస్తు శరీరము రొట్టె, రక్తము ద్రాక్షారసము.

యేసుక్రీస్తు చూపిన దారిలో ఈ రోజు ప్రపంచమంతా నడవడానికి కారణం. ప్రతి పామరుడికి అర్థమవు విధంగా ఉన్నవాడుక పదాలు కావడం, ప్రతీదీ మనసుకు దగ్గరగా ఉండటం, అలాగే ప్రతి పదంలోనూ జ్ఞానము ఇమిడి ఉన్నది. యేసువారు చెప్పిన ఉపమానములు శిశ్యులకు కూడ అర్థము కాకుండుట వలన చాలామార్లు మీరు కూడా అంధులై ఉన్నారా! అని అనటం జరిగింది. అటుతరువాత ఆయన సూక్ష్మముతో చెప్పుజ్ఞానమును శిష్యులు గ్రహించి యేసు మార్గమును సమస్తలోకమునకు చాటిచెప్పారు.

**కొన్ని ప్రశ్నలు :-**

1) అందరిలో ఉండునది అదే రక్తము కదా! యేసు రక్తములో ఏమి విశిష్ఠత ఉన్నది.

2) యేసుక్రీస్తు ఏ పాపము చేయలేదు. అలాగే పాపము క్షమించు అధికారము కలవాడు, అయితే ఆయన చనిపోవడము దేనికి?

3) అందరిలోనుండు ఆరు లీటర్ల రక్తము ఆయనలోనూ ఉన్నది. ఆ రక్తమును ప్రపంచములోనున్న అందరి పాపమును ఎలా కడుగుతుంది?

4) పాపము అనునది కంటికి కనిపించదు, రక్తము కనిపించునది కావున ఏ విధంగా పాపమును గుర్తించి కడుగుతాము?

5) రక్తము త్రాగుడి అన్నాడు. అది ఎలా సాధ్యమవుతుంది? శరీరము తినుడి అన్నాడు అది ఎలా?

**దేవుని వాక్యము ప్రకారము ఆయన ఉద్దేశ్యము చూద్దాం !**

అందరికీ అర్థమవు విధంగా దేవుడు రక్తము అనిన అది దేవుని జ్ఞానము, పరలోక మార్గము అని అర్థము. పరమేశ్వరుడు, సర్వాంతర్యామి అన్నట్లుగ సమస్తము ఆయన ఆవహించి ఉన్నాడు. ఏ విధంగా భూ మండలమును ఆకాశము అను వస్త్రము చుట్టియున్నదో దానినే శరీరము అనుచున్నారు. శరీరములోనుండు అవయవములు ఎన్ని ఉన్నా అన్ని అవయవములను శరీరము ఎలాగు కలుపుకున్నదో అట్లే అందరూ దేవుని ఆధీనంలోనే ఉన్నారు. కానీ అందులోనుండు రక్తము చెడ్డదైనా మొత్తము జీవితము నాశనమగును, అందుకు అది పరిశుద్ధముగా నిత్యము ఉంచుటకు దేవుని జ్ఞానము తెలుసుకొనవలెను. రక్తము చెడినదైతే దానిని బాగుచేయునది కూడా రక్తమే. అదియే నిబంధన రక్తము. బంధనము అనగా బంధించిన అని అర్థము. నిబంధన అనగా ఏ బంధనములేనది, అడ్డులేనిది, ఆపలేనిది, నాశనములేనిది, అడ్డుకోనిది, ఆటంకము లేనిది దేవుని జ్ఞానము (దేవుని మార్గము) అని అర్థము.

ఈ వివరము చెప్పుచూ ఆయన రొట్టె ద్రాక్షరసమును గుర్తు చూపి నిత్యము మీరు దీనిని పాటించవలసినదే అని చెప్పారు. మనకు ఆకలి రెండు పూటలా వేస్తుంది. ఆకలి పాపానికి గుర్తు భోజనం దానిని ఎదుర్కొనుటకు ఆయుధం. ఇది కంటికి కనిపించునది. అలాగే కంటికి కనిపించకుండా నీవు సంపాదించుచున్న పాపాన్ని నిత్యం నీవు పోగొట్టుకొనుటకు రెండు పూటలా ప్రార్థన చేయండి. ఉదయం లేవకమునుపే మోకాళ్ళపై 'నా తండ్రీ!' ఈ రోజు జీవితం నీది, నీచిత్తము ప్రకారమున నేను జీవించునట్లు, నన్ను నీవు వెన్నంటే ఉండి, నన్ను కాపాడుమని అడిగి

వేడుకొనుచున్నాను ఆమెన్!" అని మొదలు పెట్టు. అలాగే రాత్రి వేళ పరలోక మందున్న తండ్రి ఈ రోజు నాకు తోడు నీడగా ఉండి నన్ను నడిపించి నందుకు నీకు కృతజ్ఞతా వందనములు" అని మనకు వీలయినంతవరకు ప్రార్థన చేద్దాము. పాటలతో స్తుతించుదాం. మన పాపాలన్నీ మనమే మన తండ్రి ద్వారా కాల్చి వేసుకుందాము.

## యేసు జన్మదినము, నక్షత్రము, జ్ఞానులు, జ్యోతిష్యము.

యేసుక్రీస్తువారి జన్మదినము అనగానే డిసెంబర్ 25వ తేదీ మనకు గుర్తుకు వస్తుంది. బైబిల్ ప్రకారము చూచినట్లయిన దేవుడు జన్మించెను. లోకమున నక్షత్రము పుట్టెను అనీ, దానిని అనుసరిస్తూ తూర్పుదేశపు జ్ఞానులు వచ్చిరి అనీ వ్రాయబడియున్నది.

ఇశ్రాయెల్ దేశమునకు తూర్పున ఉన్న దేశము మన భారతదేశము. పూర్వము మన భారతదేశం జ్ఞానదేశముగా నున్నది. అప్పుడు అందరూ ఆధ్యాత్మికంగా పూర్తిజ్ఞానము కలిగి, ఆయుర్వేదము, సంగీతము, కళలు కల్గియుండిరి. ప్రపంచజ్ఞానమైనా, పరమాత్మజ్ఞానమైనా నిండుగా ఉన్నది మన భారతదేశము. దానిని ఇప్పుడు హిందూదేశమని పిలుస్తున్నాము, కానీ హిందూ అనగా అర్థములేని పదము. ఇది ఇందూదేశము. 'ఇందు' అనగా 'జ్ఞాని' అని అర్థము. జ్ఞానమునకు చంద్రుడు గుర్తు కనుక చంద్రుడికి మరోపేరు ఇందూ అని పూర్వము ఉండెడిది. నేడు మన ఇందూదేశ పరిస్థితి అందరికీ తెలిసిందే!

మనదేశములో జ్యోతిష్యశాస్త్రము మనిషియొక్క కర్మ (పాప, పుణ్య) వివరము తెలుసుకొనుటకు జ్ఞానులు గ్రహాలు, నక్షత్రములు,

సంవత్సరములు, నెలలు, వారములు, తిథులు, అని వాటి ఉనికిని బట్టి తెలుసుకునేవారు. యేసుక్రీస్తు జన్మించిన తరువాత ఆ యొక్క నక్షత్రమును చూచి లోకమున గొప్ప వ్యక్తి జన్మించాడు అని అతనికి మన సాంప్రదాయా లలో భాగమైన సాంబ్రాణి, బోలం, బంగారంతో అక్కడికి వెళ్ళి క్రీస్తును ముందుగా దర్శనము చేసుకున్నవారు భారతీయులే. యేసును గౌరవించిన వారము మనమే. అంతగొప్పది మనదేశము. నేడు జ్యోతిష్యశాస్త్రము యొక్క విలువ తెలియక చులకనగా మాట్లాడుచున్నారు. జ్యోతిష్యము మూఢనమ్మకము అని అంటున్నారు. భగవంతుడైన కృష్ణుడు భగవద్గీతను 5000 సంవత్సరముల క్రితమే మనకు వివరించినా నేటికీ దాని విలువ తెలియక గ్రుడ్డివారమై ఉన్నాము. ఖురాన్‌లో కూడా మీకు ఇంతకు ముందే ఒక జ్యోతిని ఇచ్చాము అని భగవద్గీతను గురించి చెప్పబడింది. శాస్త్రము యొక్క విలువ తెలుసు కుని, ప్రతి యొక్కరు వారి కర్మ (పాప) పత్రము ఎలా ఉందో తెలుసుకుని, దానిని "దేవుని జ్ఞానము" అను అగ్నితో కాల్చు కోవచ్చునని శ్రీకృష్ణుడు చెప్పాడు. **"యథైధాంసి సమిద్ధోగ్ని ర్భస్మసాత్కురు తేర్జున! జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా!"** నేను ఇలా పుట్టాను, నాజీవితం ఇలా ఉంటుంది. నాకు చదువు అబ్బదు. నాకు రోగాల బాధ ఎక్కువ. నాకు ధనము లభించదు. నాకు సంతోషముండదు. నేను ఘోరమైన యాక్సిడెంట్‌లో చనిపోతాను అని జ్యోతిష్యము ద్వారా తెలుసుకోవాలి. (జ్యోతిష్యము అంటే ఒక్కటే, అది సంవత్సరము, నెల, తేది, సమయం చూచి చెప్పునదియే నిజమైన జ్యోతిష్యము.) అలాగే దానిని కాల్చుకొనుటకు దేవుని జ్ఞానము తెలుసుకొని పోగొట్టుకొనవచ్చును. ఉదాహరణకు నీకు ఏ హాస్పిటల్‌కు పోయినా రోగము తగ్గటము లేదు. ఏ మందువాడినా పనిచేయటం లేదు, అప్పుడు దేవుని జ్ఞానము తెలుసుకుని దానిని

తగ్గించుకొనవచ్చును. నువ్వు రోగముద్వారా బాధపడుదువు అని పుట్టగానే నీకు రాసి ఉంచబడుతుంది. దానిని జ్యోతిష్యము ద్వారా తెలుసుకొనవచ్చును.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఎప్పుడు అధర్మం చెలరేగునో అప్పుడు నేను వస్తాను అని అన్నారు. అలాగే 2000 సం॥ల క్రితం ఇజ్రాయేల్ దేశంలో జన్మించి అక్కడ జ్ఞానమును చెప్పటమేకాక, ఒక గ్రంథమును ఇచ్చి దానిని ప్రపంచమంతా విస్తరింపజేసారు. బైబిల్‌ని కూడా మనదేశంలో నమ్మినంతగా మరేదేశంలో కూడా మనఅంతా విశ్వాసులు లేరు. అలా అని పరాయి దేశమును కించపరుస్తూ మనదేశమును ప్రేమించుట కాదు కానీ మన దేశమును దేవుడు ఎక్కువగా ప్రేమించుచున్నాడు.

## స్వస్థత మహాసభలు

ఈ మాట వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది క్రైస్తవులే. స్వస్థత మహాసభలు, స్వస్థతావనములు, స్వస్థతశాల ఇలా అనేక రకాలుగా పేర్లు పెడుతున్నారు. దైవజనులు, కృపవరములు కలిగినా, స్వస్థత వరములు కలిగినా వాటిని ప్రచారము చేయుచూ చాలా రకాలుగా వేషధారణ మనుషులు బయలుదేరారు. దానికి జనం గొర్రెలవలె బలి అవుచున్నారు.

1) స్వస్థత వరములు ఉన్నాయా? ఉన్నాయి కాని అవి పూర్తి ఆత్మజ్ఞానము తెలిసినయోగులు, తీవ్రప్రార్థనాశక్తి కలవారు పరమాత్మనామముతో రోగములను నయము చేయవచ్చును. అవి కూడా క్షమించు పాపములు మాత్రమే.

2) దెయ్యములు పట్టినవారు క్రిందపడిపోతారు నిజమేనా? పాపానుసారము నిర్ణయింపబడిన పాపమునుబట్టి సూక్ష్మ ఆత్మలు కొందరిని బాధకు గురి

చేస్తాయి. అది ఎక్కడో ఒక దగ్గర జరుగుతుంది. ఇది జాతకరీత్యా ఆరవ ఆరోగ్యస్థానములో, ఎనిమిదవ ఆయుస్థానములో బుధుడు వ్యతిరేఖిగా ఉన్న వానికి దయ్యములు పట్టును. మిగతావారికి ఏ భయములేదు. దేవుని జ్ఞానము తెలుసుకున్న వారికి, నిత్యము ప్రార్థన చేయువారికి ఏ గ్రహము ఏమీ చేయలేదు. అమాయకపు ప్రజలను వాడుకొని కొందరు వ్యక్తులు మోసపూరిత పనులు చేయుచున్నారు. నిజమైన ప్రార్థనాశక్తి కలవారు రోగమును గద్దించిన అదిపోవును, అంతేకాని క్రిందపడిపోయి, నిద్రస్థితిలోకి వెళ్ళరు.

మనుషులు క్రిందపడిపోవడం ఇది కేవలము సైన్స్‌కి సంబంధించిన జ్ఞానము, అందులో 1) కంటిచూపుతో హిప్నాటిజం 2) స్పర్శతో 3) కమాండ్స్ (మాటలతో) మనుషులను కొద్దిసేపు నిద్రాణస్థితిలోకి తీసుకువెళ్లవచ్చును. ఇది కేవలము సైన్స్, ప్రపంచజ్ఞానము.

3) మహాసభలకు వెళ్ళవద్దు అంటారా? ముగ్గురు నలుగురు కూర్చున్న చోట నేను ఉందును అని యేసుక్రీస్తువారు అన్నారు. అందుకు అందరూ ఒక చోటచేరి స్తుతించుట, ఆరాధించుట, ప్రార్థించుట దేవునికి ఇష్టము. దేవుని జ్ఞానము తెలుసుకోవాలని ఉత్సాహం, ఆశతో పాటు కొంత బుద్ధి కూడా ఉపయోగించవలెను. ఎంత గొప్ప పాస్టర్ అయినా, పోప్‌లు, బిషప్‌లు లేదా పీఠాధిపతులు అయినా బైబిల్‌ని చూచిచెప్పువారు కనుక వారిలో ఏ గొప్పతనము లేదు. అదే బైబిల్ మనము తీసుకొని చదువవచ్చు. ప్రయాసపడి ప్రయాణం చేసి అక్కడేదో ఉంది అని గుడ్డి నమ్మకం కలిగియుండకూడదు.

4) సంఘములు : అరిస్టాటిల్ అన్నట్లు మనిషి సంఘజీవి, చనిపోవునంత వరకు సంఘముతో కూడి జీవించవలెను. బైబిల్ కూడా ఏవ్యక్తి ఒంటరిగా

ఉండకూడదు అనిచెప్తుంది. ఈ సంఘజీవనమునకు, దేవుని జ్ఞానమునకు ఏ సంబంధము లేదు. సంఘము ప్రపంచజీవనవిధానంలో ముఖ్యమైనది. దేవుని జ్ఞానము వ్యక్తిగతమైనది.

దేవుడు మనకు అన్నిరకాల మందులు మరియు వైద్యవిధానం అంతాకూడా ప్రకృతిలో ఇమిడ్చి ఉంచాడు. పూర్వీకులు వాటిని గుర్తించి ఆయుర్వేదశాస్త్రాన్ని రచించి, మనకోసం ప్రపంచములో ఎక్కడ కూడా లేని వైద్యవిధానాన్ని తయారుచేయారు. ఈ రోజుల్లో సైన్స్‌కి అందని ఎన్నో విషయాలను మనవాళ్ళు ఎప్పుడో వివరించిచెప్పారు. ఎన్నో ఇంగ్లీష్ మందులకు తగ్గని రోగములు ఆయుర్వేదము ద్వారా నయము చేయుచున్నారు. కొంత ఆత్మజ్ఞానము కల్గి మొక్కల యొక్క శక్తితో వైద్యము చేసెడివారు. శరీరము మీద పూర్తి సూక్ష్మజ్ఞానముతో పూర్వీకులు ఈ వైద్యవిధానాన్ని చేసెడివారు. ఎంతో గొప్పదయిన మనదైన విధానాన్ని పక్కనపెట్టి, కష్టపడి సంపాదించినది మొత్తం తీసుకెళ్ళి హాస్పిటల్‌లో వ్యర్థం చేయుచున్నాము. ప్రాబ్లమ్ మనలో ఉంటే సొల్యూషన్ కూడా మనలో ఉన్నట్లే.

## దేవుడు - కాలము

దేవునికి కాలానికి ఏమి సంబంధం ఉంది అనే ప్రశ్నరావొచ్చు.

1) భగవద్గీతలో అర్జునుడు శ్రీకృష్ణుడిని "నీవు ఎవరు?" అని అడిగినప్పుడు నేను కాలాన్ని అన్నాడు.

2) బైబిల్‌లో దేవుడు నేను మీకు ఒక కాలము ఇచ్చియున్నాను అన్నాడు.

3) ఖురాన్‌లో అల్లామీకు ఒక కాలాన్ని నిర్ణయించాడు. ఆయన ఎవరి

ఊహకు అందదు అని తెలుసు కాని దీనివలన మనకు ఏమైనా జ్ఞానము తెలుస్తుందా? చూద్దాం!

**కాలజ్ఞానము :** మనకు శ్రీ వీరబ్రహ్మంగారు, అలాగే బైబిల్‌లో యోబుగారు, అదే విధంగా నోస్ట్రడామస్‌గారు జ్యోతిష్యమును చెప్పారు. అసలు ఎలా చెప్పగలుగుతారు. గతంలో జరిగినది ఎవరైన రాసిపెట్టితే చదివి తెలుసు కోవచ్చును. సరే జరిగింది కాబట్టి ఎలాగోలా తెలుసుకున్నారు అనుకుందాం! మరి జరుగబోయేది చెప్పడం ఎలా సాధ్యమవుతుంది? రేపు ఏమి చేస్తామో మనకు తెలియదు. అలాంటిది కొన్ని వేల సంవత్సరముల తరువాత ఏమి జరుగుతుందో ఎలా చెప్పగలరు? బైబిల్‌లో కూడా లేఖనాలలో రాసిపెట్టినట్లు జరిగినది అని చెప్పుచున్నారు.

దీనివెనుక ఏ రహస్యముంది? ఇది మనకు సాధ్యమేనా?

మన పూర్వీకులు చెప్పిన ద్వాపర, త్రైత, కలియుగాలు చెప్తూ వాటి సంవత్సరములు కూడా తెలియజేసారు. 2012 యుగాంతం అని సైన్స్ చెప్పిన మాటలు బూటకం అని తేలింది. అది పనికిరాని జ్ఞానము. అలాగే కొందరు అజ్ఞానులు చెప్పిన జోస్యం వ్యర్థమైంది.

ఒక ఉదాహరణ చూద్దాం! ఒక సినిమా కథరాసి, అలాగే దానిని తగినవారితో సినిమా తీసి, దానిని చూసి, సినిమాహాలులో విడుదల చేసిన తరువాత మనకు మొదటినుండి ప్లే చేస్తారు. అదే సినిమాను ముందుగా చూసినవాడు ఆ సినిమాలో ఏ సీన్ తరువాత ఏ సీన్ వస్తుందో తెలుస్తుంది. కొత్తగా చూచువాడు వానికి ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు.

అదే విధంగా దేవుడు నాకు అన్నీ తెలుసు. జరిగినవి, జరుగు చున్నవి మరియు జరుగబోవునది. అని అన్నాడు అంటే ఖచ్చితంగా ఆయన

భూమిని తయారు చేసి మొదటినుండి చివరివరకు కూడా జరుగబోవునది, జరగాల్సినది,  రచించి ఉంచినాడు. దానినే కాలము అంటున్నాము.

**ఆత్మదేవుని ప్రతిరూపము అన్నారు కదా, దాని వివరము చూద్దాం!**

ఆత్మ ప్రయాణము ఎంత ఏమిటి? అని ఎక్కడా చెప్పబడలేదు. కాని మనమందరము చనిపోము ఒక రెప్పపాటులో మార్పుపొందుదుము అని చెప్పారు. అంటే ఆత్మ ప్రయాణము యొక్క వేగము ఎంత? భూమి మీద ఏ స్థలములోనుండియైనా ఏ స్థలమువరకు అయినా ఒక్కక్షణములో ఆత్మప్రయాణము చేయును. మరియు ఏ గోళమునుండియైనా ఉదాహరణకి అంగారకగ్రహము మీదకి వెళ్ళిన వ్యక్తి మరణించినా కూడ ఒక్క క్షణములోనే ఆత్మ భూమిని చేరుకోగలదు. అన్ని గ్రంథములలో ఇదే విధానము చెప్పబడినది. కావున ఇది సత్యము శాసనము. ఆత్మ వివరము ఇలా ఉంది పరమాత్మ గురించిన కొంత సమాచారం చూద్దాం!

పరమాత్మకు 1000 యుగములు ఒక పగలుగ ఉండును అన్నారు. ఇది సత్యమే. దానితో చాలామార్లు దేవుడు వెలుగైఉండెను అని అన్నారు. అనగా ఇంత వేగము నక్షత్రమునకుండును. ఇంతవరకు ఏ నక్షత్రము మీద కూడ పరిశోధన కాని వివరము కాని ఏ గ్రంథములోనూ లేదు. బహుశ క్రీస్తు పుట్టినప్పుడు ఒక నక్షత్రము పుట్టెను అన్నారు. ఇక ముందు కూడ ఈ వివరము తెలియకపోవచ్చును. ఎందుకనగా అంతా వేగాన్ని కొలిచే సాధనం మానవుడికి సాధ్యమా? దేవుని అనుమతి ఉంటుందా?

1000 యుగములు ఒకపగలు అన్నారు ఒక ఉదాహరణ చూద్దాం! మనము ఒక గుండ్రని బంతిని తీసుకుందాం. దానిని హైస్పీడ్‌తో త్రిప్పి చూద్దాం. మనకు 12గం॥లు ఒక పగలు. ఈ 12గం॥లలో బంతి ఎన్ని

సార్లు తిరుగగలదు. సెకనుకి 10చుట్లు తిరిగితే నిమిషానికి 60×10= 600లు. అలాగే గంటకు 36000సార్లు. 12గం॥లకు 4,32,000 సార్లు చుట్టు తిరుగుతుంది. అయినా పరమాత్మ లెక్కప్రకారము పదిలక్షల సార్లు తిరిగితే ఆయన స్పీడ్ అందుకోలేము. మనభూమి తనచుట్టు తాను తిరగడానికి ఒక రోజుపడుతుంది. దీనిని ఇంకా వేగంగా త్రిప్పేవారు ఎవరు? ఇంతకంటే వేగంగా త్రిప్పితే మన పరిస్థితి ఏమిటి? ఆయనను సైన్స్ ద్వారా ఖచ్చితంగా చేరుకోలేము.

**ఇంకొక ఉదాహరణ చూద్దాం!**

మనము ట్రైన్‌లో వెళ్తుంటే ట్రైన్‌కు దగ్గరగానున్న స్థలమును చూసినట్లయితే ఆకారము స్పష్టంగా లేక గీతలుగీతలుగా మనకు కనిపిస్తుంది. అదే దూరంగా ఉన్న చెట్లు, కొండలు స్పష్టంగా కనిపిస్తాయి. కాని మనకు దగ్గరగా కనిపించు దానిలో గీతలుగా కనిపించిన దానికి ఆకారము లేదు అని చెప్పగలమా? చెప్పలేము.

**మరోక ఉదాహరణ చూద్దాం !**



60. కి.మీ.వేగము 120. కి.మీ.వేగము 400. కి.మీ.వేగము 1000. కి.మీ.వేగము

పైన చూస్తున్న నాలుగు ఫ్రేములలో మొదటిది స్పష్టంగాను ఆకారము తెలుస్తుంది. రెండవది మరియు మూడవది వేగముపెరుగుకొద్ది ఆకారము స్పష్టత లేదు కొంత గీతలుగీతలుగ ఉండి కనిపించుటలేదు. చివరిది అతివేగముచేత అది ఎంతమాత్రము కనిపించుటలేదు. అంతమాత్రమున అక్కడ ప్రయాణించు వాహనము లేదు అని అనగలమా!

మన దృష్టి సామర్థ్యమునుబట్టి మనకు కనిపించును. అంతే మన జీవితము అంతలోనే ఆలోచించగలము. ప్రయత్నించగలము. కంటికి కనిపించని ప్రపంచము ఆకాశమందు ఎంతో ఉండియుండవచ్చును.

ఇంకొక విషయమేమంటే అత్యంత సూక్ష్మంలో కూడా ఆత్మకలదు. ప్రతి ప్రాణిలోనూ ఆత్మ ఉంది. దీనిని ఎవరూ నమ్మడం లేదు. వాహనము రైలు అయినా, బస్సు అయినా, చివరికి చిన్న సైకిల్‌ను నడుపువాడు ఒక్కడే. సరే జంతువులను వదిలేయ్. మన విషయానికొస్తే పరమాత్మ ప్రపంచ జ్ఞానమునకు అందదు. పరమాత్మను ఆయన సూచించిన మార్గములో తప్ప మరేవిధమైన ద్వారముగానీ అవకాశము గానీ లేదు. వేమన దొంగరీతిగ దొరకున మోక్షంబు అన్నాడు. క్రీస్తుకూడ నా ద్వారానే తప్ప ఎవడును పరలోకము చేరడు అన్నారు. నా జ్ఞానము తెలియబడితే తప్ప ఎవడును నన్ను పొందడు అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అదే విధంగా ఖురాన్‌ల్ అల్లాయే మోక్షప్రదాత అన్నారు.

దేవున్ని పూర్తివిశ్వాసముతోనూ, పూర్ణాత్మాతోనూ, ఆయనను ఘనపరచుచూ, ఆయన జ్ఞానము తెలుసుకొని పరమును పొందుటయే సరైన మార్గము. ఆత్మను ఆయనకు అప్పగించుటయే మోక్షము. ఆత్మ మనలో ఉన్నంత కాలము తప్పదు మనకు ఈ నరకయాతన జీవితం. దీనికి ఎవరు అతీతులుకారు. అందరూ కష్టమును అనుభవించు పాపులే.

## (యోహాను, 19-24) దేవుని వస్త్రము, పంచుకొనుట మరియు వేలము.

వారు నా వస్త్రములను తమలో పంచుకొని, నా అంగీ కోసము చీట్లు వేసిరి. యేసుక్రీస్తుకు ఉన్న ఒక వస్త్రమును సిలువవేసిన తరువాత

సైనికులు దానిని వేళంవేసి ఆ అంగీని కొనుక్కున్నారు. దీనిలో ఏమి అర్థముంది అనిఅనుకోవచ్చును. ఆయన ఏది చెప్పినా ఏదో అర్థాన్ని చెప్పే ఉంటాడు.

మన దేశంలో రామమందిరం, అలాగే బాబ్రీమసీదు గొడవలు చూచియే ఉన్నాము. అది నాది అంటే నాది అని. చివరకు హింసాకాండ జరిగింది. నేడు చాలా దేవాలయములలో దేవుడు లడ్డూలు, వస్త్రాలు వేలంపాట చూస్తున్నాము. ఇవన్నీ దేవున్ని చేర్చుతాయా? ఒక్కక్షణం ఆలోచించండి? ఏ గ్రంథములోనైనా రాసిఉందా? బైబిల్ వచ్చి 2000సం॥లు దాటింది ఇంకా కూడా పరమాత్మ జ్ఞానమునకు, ప్రపంచజ్ఞానమునకు తేడా తెల్చుకోలేక పోతున్నాము. అన్ని రంగాలలో అభివృద్ధి అంటున్నారు, జ్ఞానము పెరిగిందా? అక్కడే ఆగిపోయిందా? ఆ రోజు పరమాత్మను ప్రక్కనే పెట్టుకుని మూర్ఖులైన సైనికులు ఆయన అంగీకోసం ప్రాకులాడారు. అదే క్రీస్తువారి ప్రక్కనే సిలువవేయబడిన వ్యక్తి పరమాత్మను వేడుకొని మోక్షము పొందాడు.

ఇంకా అన్ని దేశములలో పట్టిపీడుస్తున్నది ఈ యొక్క మతపిచ్చి నాదిగొప్ప, నాదిగొప్ప అంటూ కొట్టుకుని చస్తున్నారు. ఎవడి మతమునకు సంబంధించిన వారిని వారి మతమువాడు ప్రేమించడం, మిగతావారిని ద్వేషించడం జరుగుచున్నది.  ఉదాహరణకు ఒక మార్వాడివాడు ఇంకొక మార్వాడి వాడికే సహాయం చేయడం, వాడికే ఉద్యోగం ఇవ్వడం, ఇలా ఎవరికివారు వేరు వేరు భావనలు కలిగియున్నారు. మతమార్పిడి అంటూ గొడవలు, ఎందుకు మతం మారాలి. నీ దగ్గర జ్ఞానము లేకపోతే కదా! ఉంటుంది వెతుకు, చూడు, అర్థము చేసుకో నీ మతములోనే నీవు జీవించి పరమును పొందవచ్చును. అన్ని మతాలలో ఉండే సారాంశము ఒక్కటే. మనుషుల మాటలు నమ్మి జీవితం నాశనము చేసుకొవద్దు. బైబిల్ చదివావా?

అయితే భగవద్గీత చదువు అదికాకుంటే ఖురాన్ చదువు. అన్నింటిలో ఒకటే ఉంది అని అర్థమవుతుంది. ఏదీ చదువకుండా మత రక్షణ సమితి అంటూ అజ్ఞానంతో మూర్ఖంగా ప్రవర్తించవద్దు. ఒక కంపెనీకి వెళ్తే వాడి అర్హత పక్కబెట్టి నీది ఏకులం అంటున్నారు. ఏ మతం అంటున్నారు. ఎవరికివారు వేరై అందరూ కలిసుండాల్సిన ఈ దేశంలో విభేదాలు కలిగియున్నారు. ఈ తరం వారిలో ఈ భావన లేదు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. కొందరు చాంధసవాదులున్నారు వారు మార్పుచూస్తారు.

మనలాంటి దేశం ఎక్కడా లేదు ఎన్నో మతాలు, ఎన్నో బాషలు, ఎన్నో సంస్కృతులు ఇంకా మరెన్నో సంప్రదాయాలు అద్భుతమైన దేశం మనది.

## (యోహాను, 12-15) యేసుక్రీస్తు గాడిదపై కూర్చుని వెళ్ళుట

అప్పటిలో చాలామంది గాడిదను ఎక్కి ప్రయాణించేవారు. గుర్రములు, ఏనుగులు, రథములు ఆ రాజ్యములోనున్నా ఒక సామాన్యుడి వాహనము గాడిదగా ఉండెడిది.

"ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తజనులారా నా యొద్దకు రండి" అన్నారు. మనము మనజీవితంలో కేవలం గాడిదచాకిరి చేయు చున్నాము. ఏమీ తీసుకువచ్చింది లేదు. తీసుకుపోయేదీలేదు. మరెందుకు ఈ చాకిరి. పోని సంతోషముగా ఉన్నామా? అదీలేదు. అందుకే యేసువారు "నేను మీపై అధికారము చేయుచున్నాను" అని అన్నాడు. దానికి నన్ను నా జ్ఞానమును తెలుసుకొని మీరు కూడా అధికారము చేయవచ్చునని అర్థము. లేని యెడల మీకు గాడిదచాకిరి తప్పదు అని అర్థము వచ్చునట్లు చేసెను.

## (యోహాను, 20-29) చూసినమ్మిన వారికంటే, చూడకుండ నమ్మినవారు ధన్యులు

యేసువారి మరణం తరువాత మూడవదినమున తిరిగి శిష్యులకు కనిపించినప్పుడు శిష్యులలో ఒకరు నీ గాయములను చూపించు నీవు క్రీస్తువని నమ్ముతాను అని చెప్పినప్పుడు యేసువారు పలికిన మాట ఇది. దేవుడు ఏది చెప్పిన ఆ సందర్భమును ఉపయోగించి సర్వమానవాళికి ఉపయోగపడు పరమాత్మ యొక్క జ్ఞానము చెప్పియున్నారు.

చూసినమ్మిన వారికంటే అను ఈ వాక్యము లోకమునకు సంబంధించినది. కనిపించునది. బాహ్యముగ మనము మ్రొక్కుదేవుళ్ళు, వెళ్ళు గుడులు, ఇంకా అన్ని రకాల లోకసంబంధ ఆలోచనలతో అక్కడికి వెలితే పాపం పోతుంది. ఆ స్థలములో దేవుడున్నాడు అని కనిపించు దానిని ఆరాధించుచున్నారు.

చూడకుండా నమ్మినవారు ధన్యులు, దేవుడు మనలోనే ఉన్నాడు. మనశరీరమే దేవాలయము అని మనలను సృష్ఠించిన, మనలో నివాసమున్న మరియు లోకమంతయూ వ్యాపించియున్న పరమాత్మను చూడకున్న తను ఉన్నాడని నమ్మినవారు ధన్యులు అంటున్నారు. కొంతమంది హేతువాదులు, మూర్ఖులు ఏడి దేవుడు, ఎక్కడున్నాడు, నాకు చూపించు అని అంటుంటారు.

ప్రపంచపరంగా ఈ వాక్యము చూచినట్లయితే ఏదైనా తెలియ కుండా, అహము లేకుండా చేసిన తప్పుకు పాపము రాదు. తెలిసి, కావాలని చేస్తే ఖచ్చితంగా పాపం పొందుతాము.

ఎంతోమంది పుట్టుకతో కిడ్నాప్‌లకి గురియై వేరే రాష్ట్రంలో ఇతరుల చేతుల్లో బిక్షగాళ్ళుగ చిన్నప్పటి నుండి పాపమమును భరించుచున్న వారు కలరు. అలాగే వికలాంగులు, మందబుద్ధికలవారు, అంధులు, రోగములతో కూడిన శరీరముకలవారు. ప్రపంచములో చిన్న తప్పుకు కొద్దికాలము శిక్ష అనుభవిస్తే పోతుంది కదా, మరీ దేవుని ఎడల తప్పుచేస్తే దేవుడు ఇలాంటి జీవితం ప్రసాదిస్తాడు. దీనిని ఎదుర్కొవడానికి నిరహారదీక్షలు, నిర్మూలనలు ఏమీ ఉండవు అనుభవించి తీరాల్సిందే.

## యేసుక్రీస్తు మరణం

**(యోహాను, 10-18)** "ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు. దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు" అని యేసు అన్నాడు.

పై వాక్యమును చూచిన తరువాత ఇంకా దేవుని గురించి ఏమీ మాట్లాడలేము. సృష్టికర్తకు అధికారమున్నది, కావున ఆయన తన శరీరము మీదనే కాకుండ సర్వప్రాణి మీద పూర్తి అధికారముకలవాడు. ఆయన గురించి ఊహించలేము, ఆలోచనకూడ చేయలేము.

మనిషికి సాధ్యమవుతుందా? ప్రాణం తీసుకోవడం మనిషికి సాధ్యమవుతుంది. ఆత్మహత్య ద్వారాఅనుకుందాం! కాని అది కూడా కర్మానుసారం జరుగుతుంది. నేను ప్రాణం తీసుకోవచ్చు అని మనము అనుకుంటాం అంతే. నిజానికి మనశరీరం మీద మనకు ఏ అధికారము లేదు. పుట్టుట, చావుట, బ్రతుకుట, అనుభవించుట ఇవి ఏవి మనచేతిలో

లేవు. కేవలం దేవుని జ్ఞానము తెలుసుకొనుటకు మాత్రమే మనకు అధికారము కలదు. జ్ఞానము తెలుసుకొనునప్పుడు లేదా ప్రార్థనా చేయునప్పుడు కర్మపనిచేయడము ఆగిపోతుంది.

యోగులు మరణించి లేస్తారు నిజమేనా? నిజమే ఏడవ చక్రమందు ఆత్మనివాసముంటుంది. శరీరములో అన్నీ స్థంభించి పోయినను ప్రాణం నిలిచిఉంటుంది. వారు మరణించినట్లు కాదు. ఎన్ని సంవత్సరాలు అయినా జీవించవచ్చును. అర్థమవు విధంగా చెప్పాలంటే అది ఒక నిద్రాణస్థితి.

**(మత్తయి, 7-7,8) అడుగుడి ఇవ్వబడును, వెతుకుడి దొరుకును, తట్టుడి తీయబడును.**

ఈ వాక్యము తెలియని క్రైస్తవుడు లేడు. కాని దీనిని అర్థము చేసుకున్నవారు ఎంతమంది?

అడుగుడి ఇవ్వబడును. నాకు ఉద్యోగం కావాలి దేవుడా అని అడిగామనుకోండి దేవుడు ఉద్యోగమిస్తాడా? నాకు పెళ్ళికావడం లేదు తండ్రీ అంటే పెళ్ళిచేస్తాడా? నాకు మనశ్శాంతి లేదు తండ్రి అంటే ప్రసాదిస్తాడా? దేవుడు ఎవరికి ఏమిచేయడు, మన పాపానుసారంగా మనము పొంద వలసిన, అనుభవించవలసినదే మనము అనుభవిస్తాము. పరమాత్మ జ్ఞానము విషయములో మాత్రమే ఆయనకు అధికారమున్నది. ఆయనను అడుగవలసి యున్నది. ఆయన చెప్పవలసి యున్నది. అప్పుడు దేవుని ప్రార్థించుచు నాకు జ్ఞానమును ప్రసాదించు, నా ప్రార్థన ఆలకించుమని దేవుని అర్థించుచున్నాము కనుక మన పాపము పలుచబడిపోయి కొంత మనశ్శాంతి కలిగి జీవితము సంతోషముగ ఉంటుంది.

వెతుకుడి దొరుకును. ఈ వాక్యముకూడ పరమాత్మ జ్ఞానమునకు సంబంధించినదే. సరే ప్రపంచపరంగా కూడ ఇది ఉపయోగపడుతుంది. అనుకున్న, నేను డాక్టరు కావాలని చదివాను కాని యాక్టరునయ్యాను అంటారు. నేను వ్యాపారం చేద్దామనుకున్నాను చివరికి ఉద్యోగినయ్యాను. నేను పెళ్ళిచేసుకోకుండా ఉందామనకున్నాను కాని సంసారినయ్యాను. నాకు సైన్స్‌గ్రూప్ అంటే ఇష్టం, కాని మా నాన్నగారు ఆర్ట్స్‌లో చేర్పించారు. నాకు హార్ట్‌స్పెషలిస్ట్ కావాలని ఉంది కాని సీటురాలేదు ఆర్థోపెడిక్స్ చేస్తున్నాను అంటారు. మనము వెతికితే దొరకదు. మనకు జరగవలసినది జరుగుతుంది. అంతే ఈ వాక్యము కూడా నాజ్ఞానము కోసం వెతుకుడి దొరుకును అన్నారు.

తట్టుడి తీయబడును అడుగుడికి, వెతుకుడికి, తట్టుడికి తేడా ఏంటి? రెండు వాక్యములు వివరము చెప్పుకున్నాము. ఈ వాక్యము ప్రకారము ముందుగా మనలో వెతకాలి. మనకు దేవుని జ్ఞానము తెలుసుకోవాలని ఆలోచన తట్టాలి, కలగాలి. ఆ ఆలోచన వేగం పెరిగి అప్పుడు దేవున్ని అడుగుతూ, వెతుకులాటతో జ్ఞానమును పొంది మోక్షమునకు దగ్గరవుతారు.

ఇది క్రైస్తవులు ఉపయోగించిన పదాలు, ఇవి మా హిందువుల పదాలు కావు లేదా ముస్లీం వాక్యములు అలా మాట్లాడకూడదు. ఇలా చెప్పకూడదు అంటూ మూర్ఖులైన అజ్ఞానుల మాటలు నమ్మక, అందులో నున్న భావమును గ్రహించిచూడవలెను అప్పుడు అన్ని గ్రంథాలలోని పరమాత్మ భావము ఒకటేనని గ్రహించవచ్చును. ఏది కూడా పరమాత్మ జ్ఞానము విషయములో హద్దులుండరాదు ప్రతిదానిని విశ్లేషించి, అన్వయించి, వివరించి చూచు కోవలయును. ప్రతి ఒక్కరు ఒకరితో ఒకరు మాట్లాడిన కొంత జ్ఞానము తెలియగలదు. ఉదాహరణ బైబిల్‌లో వాక్యములు ఖురాన్

లో వాక్యములు అలాగే భగవద్గీత వాక్యములు ఒకరికోకరు వివరించి చూచుకున్న మూడు గ్రంథాలలో అర్థము తెలుసుకోని అందరము ఒక్కటే అను భావము కలుగును. అలాకాకుండ మాకు ఇలా చెప్పారు, మీది తప్పుగా ఉంది, వాళ్ళు తప్పుగా నడుస్తున్నారు. మీ దగ్గర జ్ఞానము లేదు. మాది స్వచ్ఛమైనది. అంటూ పరమాత్మ జ్ఞానమునకు హద్దులు కలిపించుకుని పరమాత్మ సంతానమైన మనము ఒకరినొకరు వేరు చేసుకుంటు, మత్సరము కలిగి పరమాత్మను అవమానించుచున్నాము.

## ద్రాక్షారసము - మద్యపానము ఒకటేనా?

ద్రాక్షారసము: ద్రాక్షపండు నుండి తీసిన రసమును ద్రాక్షరసము అంటాము. దీని గురించి తెలియనివారుండరు. ఎందుకంటే అందరూ త్రాగుతారు కాబట్టి. బైబిల్ లో ద్రాక్షారసము, రొట్టె, అలాగే విందులలో ఈ రసమును మధ్యపానమును ఉపయోగించారు మనము మధ్యము త్రాగితే తప్పేమిటి? అని అంటారు. ద్రాక్షారసముకి, మధ్యముకి చాలా వ్యత్యాసముంది.

ద్రాక్షారసము ఉపయోగాలు : 1) గుండెకి మంచిది. 2) కొలస్ట్రాల్ తగ్గుతుంది. 3) బ్రెస్ట్‌కాన్సర్ రాకుండా చేస్తుంది 4) ముద్దగా ఉన్న రక్తమును కరిగించేస్తుంది. 5) బరువుతగ్గుతారు 6) మైగ్రెన్ తగ్గిస్తుంది. 6) రక్తము శుద్ధిచేస్తుంది. 7) యాసిడిటి తగ్గుతుంది. 8) అస్తమాకూడ తగ్గుతుంది. 9) యాంటీవైరస్‌గా పని చేస్తుంది. 10) జీర్ణము త్వరగా అవుతుంది.

ఇశ్రాయెల్ దేశంలో ఆహారపంట గోధుమలు, దానితో రొట్టె చేసుకునేవారు. అది పిండిపదార్థము కావున జీర్ణమగుటకు చాలా సమయము

పడుతుంది. అందుకు దానితో కూడా ద్రాక్షారసము తీసుకుంటే పూర్తి ఆరోగ్యకరమైన ఆహారం అవుతుంది. అందుకు క్రీస్తు కూడా అది భుజించి ఉన్నారు.

మద్యపానము : దీని గురించి మంచిగా చెప్పునది ఏమీలేదు. అన్ని కుటుంబాలను, అందరి సంతోషమును, అందరి కష్టార్జితమును మ్రింగివేయు మహమ్మారి.

అంతే కాకుండా ఆత్మకు ఆటంకము చేయును కాబట్టి దేవుని దృష్టిలో ఇది మహాపాపము. గౌతమబుద్దుడు పంచశీలసూత్రములో మద్యపానము మహాపాపము అన్నారు.

ద్రాక్షారసమును కొన్నిరోజులు దానిని నిలువఉంచిన తరువాత బాగా పులిసి అది మత్తుపానీయముగ మారుతుంది. అలాంటి దానిని మనము బీరు అని పేరుపెట్టాము. అలాగే అల్కహాలు అనునది ఒక కెమికల్ మధ్యపానము.

## సిలువ గుర్తు

చాలామందిని మూర్ఖులను, ఘోరమైన తప్పులను చేసిన వారికి విధించు శిక్ష సిలువ శిక్ష. ఏమాత్రము దేవుని జ్ఞానము తెలియని వారికి వేయునది కావున ఇది పూర్తి పాపానికి గుర్తు. కొండసిలువలో సిలువ అను అక్షరము తీసుకుని పాము అను అర్థము వచ్చువిధంగా మన పెద్దలు తెలుగులో ఈ పదమును ఉపయోగించారు. శరీరము మూలంగా జీవించుప్రతివారు పాపాత్ములు అని శరీరమును సిలువతో పోల్చి చెప్పారు. దీనిని కొందరు శ్రమలకు గుర్తు అన్నారు. శ్రమించువాడు పాపాత్ముడు

కావున అలా చూచిన అదే అర్థము వచ్చును. అదే ఆత్మ సంబంధుడు అయితే ఆత్మఫలమైన సంతోషముచేత జీవించును. దేవుడు భూమియందే గానీ, ఆకాశమందే గానీ దేని పోలికనైననూ చేయవద్దు అన్నారు. సిలువ గుర్తు పెట్టడంగాని, గుర్తు వేయడం గాని చేయవద్దు.

యేసు క్రీస్తు ఏ తప్పు చేయకున్నను తనకు సిలువ వేయటం జరిగింది. తన నిబంధన రక్తము చేత ఆ యొక్క పాపాన్ని కడిగి వేసారు. అలాగే మనము కూడ ఏ పాపము చేత జీవించుచున్నామో దానిని జ్ఞానము అను రక్తముతో కడిగి మోక్షము పొందవలెనని అర్థము. ప్రతి ఒక్కరిది సిలువ వేయబడిన జీవితాలే.

**(యోహాను, 9-39) చూడని వారు చూడవలెను - చూచువారు గ్రుడ్డివారు కావలెను.**

చూడనివారు చూడవలెను అన్నారు ఏమిచూడాలి? ఎలా చూడాలి? ఎక్కడ చూడాలి? అన్న వివరమేమీ లేదు. చిన్నవాక్యమే అయినా దీని లోతు చాలా పెద్దది, ఒక్కమాటలో పరలోకము ఎలా వెళ్ళాలి చెప్పండి అంటే ఈ వాక్యము చెప్పవచ్చు.

చూడనివారు చూడవలెను : ప్రపంచములో నీకు ఎన్నో విషయములు తెలుసు. ఎన్నో గ్రంథములు ఉన్న వాటిలో సత్యము చూడు. సత్యము శాసనముతో కూడిన ఖచ్చితత్వము.

చూచినవారు గ్రుడ్డివారు కావలెను : సత్యము తెలుసుకున్నవాడు ఆ సత్యము ద్వారా పరమాత్మను చేరాలి. లేకపోతే ఆ యొక్క సత్యము తెలుసుకుని వృథా అగును.

చదువుకోవాలి, ఉద్యోగం సంపాదించాలి, సుఖంగా ఉండాలి ఇది ప్రపంచ ధర్మం.

సత్యం తెలుసుకోవాలి, కర్మలేకుండా చేసుకోవాలి, గొప్పది మరియు అంతిమది అయిన పరమాత్మ స్థానం సంపాదించుకోవాలి. ఇది దేవుని ధర్మము.

దేవుడు జీవముతోనూ, సత్యముతోనూ, ఆత్మతోనూ నన్ను చేరవలసియున్నది అన్నారు. జీవుడివైన నీవు ఆత్మను తెలుసుకోవాలంటే మద్యలో సత్యము ఉన్నది. దానిని తెలుసుకోకుండా, దానిని దాటి ఆత్మను చేరలేవు.

**కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును.**
**సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును.**

దేవుని మీద మనయొక్క శ్రద్ధను, ప్రార్థనా తీవ్రతను బట్టి మన పాపమును త్వరగా కరిగించి పరలోకమునకు ఎక్కిపోవుదువు అని అర్థము. అదే చూద్దాంలే అంటూ నిర్లక్ష్యధోరణి కలిగి ఆదివారము ఎలాగు చర్చికి వెలుతున్నాము ఒక పాటపాడుతాము, ఒక వాక్యము వింటున్నాము. పదినిమిషాలు ప్రార్థన చేస్తున్నాము అని కొద్దికొద్దిగ నామమాత్రము భక్తి కలిగినవారు ఎప్పటికి పరలోకము పొందుతారో వారినుద్దేశించి కొంచెము విత్తువాడు అని అన్నారు.

ఎవరి విశ్వాసమును వారు పరీక్షించి చూచుకోవలయును.

## మన పవిత్ర గ్రంథాలు

### భగవద్గీత:

అత్యంత విలువైన ఈ గ్రంథము మనకు భగవంతుడు 5000సం॥ల క్రితమే మనకు ప్రసాదించాడు. నేడు దీని యొక్క విలువ తెలియక మన దేశపరిస్థితి అయోమయంగా ఉంది. మతగురువులు కూడా కేవలం స్వార్థముగా ఆలోచించి మనయొక్క పవిత్రగ్రంథమును దేవుని మార్గమును మూసివేసినారు.

ప్రపంచానికి జ్ఞానము నేర్పిన దేశము మనది. పూర్వము ఆయుర్వేదము, జ్యోతిష్యము మరియు అన్ని కళలలోనూ ముందున్న మనదేశపరిస్థితి, మతపరిస్థితి ప్రస్తుతం ఎలావుందో తెలిసిందే! విగ్రహారాధనలు ఎక్కువై అటు జంతువుల నుండి మొదలిడి ఇటు లింగ భేదము లేకుండా ప్రతిదానికి పూజించు అజ్ఞానులుగా ఉన్నాము. ఎందరో మనకు ప్రశ్నలు వేసి వివరమడిగినా చెప్పేపరిస్థితులలో ఎవరూ లేరు.

నేడు హిందూ అనగా అర్థములేని పదము 'ఇందూ' అనగా 'జ్ఞాని' అని అర్థము. పూర్వము అందరూ జ్ఞానులుగ ఉండటం వలన మనకు 'ఇందూ' అని పేరువచ్చింది. జ్ఞానానికి చంద్రుడు గుర్తు అని ఈ యొక్క భగవద్గీతను **'త్రైత సిద్ధాంతము'** రూపంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు వ్రాయడము జరిగింది. దానిని పూర్తిగా ప్రతిఒక్కరికీ అర్థమవు విధంగా వివరించి మళ్ళీ మనదేశమును ఇందువుల దేశముగా మార్చుచున్నారు. వారి గ్రంథములు చదవండి. అజ్ఞానాన్ని వీడి జ్ఞానాన్ని పొంది మనమందరము పరలోకపు ప్రయాణము చేద్దాం!

## బైబిల్

ఇజ్రాయెల్ దేశంలో యేసుక్రీస్తువారు జన్మించి, అక్కడున్న అజ్ఞాన, అంధకార జీవితమును మార్చి ఆ తరువాత ప్రపంచమొత్తమునకు ఆయన పరలోక మార్గమను సూచించారు. నేడు ప్రపంచములో క్రైస్తవమతం ముందుంది. ఇందులో అందరికీ అర్థమవు ప్రార్థనావిధానములు, తేలికైన పదాలు ప్రతి ఒక్కరికీ ప్రేమను పంచు విధానమును చెప్పారు. నేడు మనదేశంలో క్రైస్తవుల విశ్వాసం గొప్పది. ఇక్కడ విగ్రహారాధన లేకపోవుట చేత దేవునికి చాలా దగ్గరగా ఉండటంతో పాటు ప్రేమను పంచుతూ, విశ్వాసులుగా జీవిస్తున్నారు.

## ఖురాన్

జిబ్రయేల్ అను ఆత్మ ముహమ్మద్ ప్రవక్తకు చెప్పిన దైవ సూచనలే ఈ గ్రంథము. ఈ గ్రంథము విశిష్ఠత ఏమంటే మనలను పాలించు దేవుని పాలకులకు ఇచ్చిన సందేశాలను చెప్పడమే. మాకు ఈ విధంగా ఆజ్ఞలున్నాయి. ఏ విధంగా తప్పుచేస్తే, ఏ శిక్షవిధించాలి, అల్లాను ప్రార్థించువారు ఎలా రక్షించబడుతారు అని వివరము చెప్పింది. చాలా సూచనలతో పాటుగా ప్రార్థన (నమాజ్) విధానము, జీవన విధానము, అదేవిధంగా పాపక్షమాపణ పొందువిధానము చివరకు మోక్షమును చేరుమార్గము వ్రాయబడి ఉన్నది. దేవునికి చాలాదగ్గరగా ముస్లీం సోదరులు ఉన్నారు. వారి విశ్వాసం గొప్పది.

మూడు గ్రంథములలో ఏది ఎక్కడ చెప్పినా పరమాత్మను చేరు విధానమే ఉంటుంది. కాబట్టి మనకు అర్థమవు గ్రంథమును చదివి అనుసరించుదాము.

★